www.prajasakti.com
PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 39 Vol సంచిక : 36 No | విజయవాడ, బుధవారం 6 ఫిబ్రవరి 2019 | 12 + 12 పేజీలు వెల : 4.00 Rs.

'పరిశోధన'లో 'అన్నదాత సుఖీభవ'

- వ్యవసాయానికి మళ్లీ కోతలే
- రూ. 1,270 కోట్లు తగ్గుదల
- విపత్తుల మాటేంటి?

2

అంకెల్లో బడ్జెట్ (రూ.కోట్లలో)

బడ్జెట్ పద్దు	2018-19 ప్రతిపాదన	2018-19 సవరణ	2019-20 ప్రతిపాదన
మొత్తం బడ్జెట్	1,91,063	1,96.948	2,26,177
రెవెన్యూ వ్యయం	1,50,271	1,58,858	1,80,369
పెట్టుబడి వ్యయం	28,678	25,021	29,596
కేంద్రం నిధులు	84,624	83,582	97,081
రాష్ట్ర సొంత పన్నులు	65,535	67,535	75,437
ద్రవ్య లోటు	24,205	29,141	32,390
ఆదాయ లోటు	+5,235	2,494	2,099
వడ్డీలకు చెల్లింపులు	15,076	15,776	17,819

ఎన్నికల చిట్టా!



ఆరు కొత్త పథకాలు - అప్పులే సర్కారుకు ఆధారం

కొండంత సంక్షేమ రాగం.. ఆచరణ అనుమానం!

ఎన్నికల వేళ ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు మంగళవారంనాడు ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రతిపాదించారు. 'తల్లి గర్భంలో ఉన్నప్పటి నుండి జీవితంలోని అన్ని దశల్లోనూ సంక్షేమ పథకాలు వర్తించే గొప్ప రాష్ట్రంలో ఉన్నాం' అంటూ రాష్ట్ర ప్రభుత్వం కొండంత సంక్షేమరాగాన్ని ఆలపించింది. ఆర్థిక మంత్రి తాజాగా మరో ఆరు కొత్త పథకాలతో ఓటర్లకు గాలం వేసే ప్రయత్నం చేశారు. రైతులకోసం అన్నదాత సుఖీభవ, డ్రైవర్లకోసం సాధికార సంస్థ, క్షత్రియుల సంక్షేమనిధి, ఇళ్ల నిర్మాణకోసం భూసేకరణకు ప్రత్యేక నిధితో పాటు మరో రెండు పథకాలను ప్రకటించిన ఆయన ఇప్పటికే ఉన్న పథకాలకూ భారీగా నిధులు పెంచుతున్నట్లు తెలిపారు. పేరుకు ఓట్ అన్‌అక్కౌంట్ అయినప్పటికీ 2.26 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్‌ను ప్రతిపాదించిన రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లెక్కలను ఎన్నికల చిట్టాగా మార్చివేసింది. అట్టహాసపు, ఆర్భాటాల భారీ బడ్జెట్‌కు ఆధారం అప్పులే! అందుబాటులో ఉన్న అన్ని సంస్థల నుండి అప్పులు చేయడానికి సిద్ధమైన సర్కారు పొంతన లేని అంకెలతో చేసిన గారడీ వెనుక ఎన్నికల వ్యూహం స్పష్టంగా కనిపిస్తోంది. 2018-19లో రూ.50 వేల కోట్లుగా ఉన్న కేంద్ర గ్రాంట్లు తాజా బడ్జెట్‌లో రూ.60 వేల కోట్లకు, రూ.29 వేల కోట్లగా ఉన్న బహిరంగ మార్కెట్ రుణాలు రూ.39 వేల కోట్లకు, వెయ్యికోట్లగా ఉన్న కేంద్ర ప్రభుత్వ రుణాలు రూ.2,500 కోట్లకు పెరగనున్నాయి. భారీగా తెచ్చే అప్పులను ఎన్నికల తాయిలాల కింద పందారం చేయనుంది. పోనీ, అదయినా సజావుగా, సక్రమంగా జరుగుతుందా... అంటే, అనుమానమే! నిరుద్యోగ భృతిని రెట్టింపు చేస్తున్నట్టు ప్రకటించినప్పటికీ కేటాయింపులు మాత్రం 20శాతమే పెరిగాయి. రాష్ట్రంలోని 93 లక్షల మంది మహిళలకు పసుపు కుంకుమ పథకం కింద 9,300 కోట్ల రూపాయలు అవసరం కాగా, కేటాయించింది మాత్రం రూ.4 వేల కోట్లే! భారీ అంకెలు చూపడంలో ప్రభుత్వ చిత్తం దేనిమీద ఉందో ఈ అంకెలే స్పష్టం చేస్తున్నాయి. 2018-19 బడ్జెట్‌లో వివిధ సంక్షేమ పథకాలకు రూ.23,613 కోట్ల రూపాయలను కేటాయించినప్పటికీ ఆచరణలో ఖర్చు చేసింది రూ.18,258 కోట్ల రూపాయలే! అంటే, దాదాపు 5 వేల కోట్ల రూపాయలు కోత పెట్టింది. అవే పథకాలకు మళ్లీ భారీ కేటాయింపులు చేసి కళ్లముందు కనపడుతున్న కోతలను పట్టించుకోకుండా కళ్లు మూసుకుని సంక్షేమ కలలు మాత్రమే కనాలని ఆర్థిక మంత్రి చెప్పకనే చెప్పారు.

వార్తలు 2, 3 లో

ఓటమి భయం స్పష్టం



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఓటమి భయం స్పష్టమైంది. లెక్కల్లో ఎక్కడా జవాబుదారీతనం కనిపిచలేదు. సంక్షేమ రంగాలకు నిధులు నామమాత్రమే.

– పార్థసారథి, వైసిపి అధికార ప్రతినిధి

ఓట్ల కోసం గారడీ



వాస్తవ విరుద్ధంగా కేటాయింపులు చేసి ప్రజలను మోసగించేలా బడ్జెట్ ఉంది. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మోసగించి ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తోంది. ఓట్ల కోసం ప్రభుత్వం చేసిన ఈ అంకెల గారడీని ప్రజలు విశ్వసించరు.

– పి మధు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి


మరో వంచన



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మరో వంచనకు ప్రతిరూపం. చంద్రబాబును స్తుతించే స్తోత్రంలా బడ్జెట్ ప్రసంగం సాగింది. కేటాయింపులన్నీ కాగితాలకే పరిమితం కావడం తప్ప ఆచరణలో అమలయ్యే అవకాశం కనిపించడం లేదు.

– కె రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి

అప్పుల ఊబిలోకి..



రాష్ట్రాన్ని టిడిపి ప్రభుత్వం అప్పుల ఊబిలోకి దించింది. ఉమ్మడి రాష్ట్రంలో గత ప్రభుత్వాలన్నీ కలిసి రూ.96 వేల కోట్లు అప్పు చేస్తే ఈ నాలుగున్నరేళ్లల్లో టిడిపి ప్రభుత్వ మొక్కటే రూ.1,53,435 కోట్ల అప్పు మిగిల్చింది.

– ఎన్ రఘువీరారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు

చర్చలు సఫలం.... సమ్మె లేదు

- ఆర్టీసిలో 25 శాతం తాత్కాలిక ఫిట్‌మెంట్
- ఎన్జీవోలతో సమానంగా వేతన పెంపునకు హామీ

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

ప్రభుత్వం, ఆర్‌టిసి కార్మిక సంఘాల జెఎసి మధ్య జరిగిన చర్చలు ఫలప్రదం కావడంతో సమ్మె నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు జెఎసి నాయకులు ప్రకటించారు. ఆర్టీసి సిబ్బందికి 25 శాతం తాత్కాలిక ఫిట్‌మెంట్‌తో పాటు ఎన్జీవోలకు వేతన సవరణ చేసే సమయంలో వారితో సమానంగా వేతనాలు పెంచేందుకు ప్రభుత్వం అంగీకరించింది. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొద్దిరోజులుగా ఆర్‌టిసి కార్మిక సంఘాలు జెఎసిగా ఏర్పడి ఆందోళన చేస్తున్న నేపథ్యంలో మంగళవారం ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది. ప్రభుత్వం తరుపున రవాణా శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, ఆర్‌టిసి ఛైర్మన్ వర్ల రామయ్య, ఎమ్‌డి సురేంద్రబాబు పాల్గొనగా జెఎసి తరుపున కన్వీనర్ పి.దామోదరరావు, కో కన్వీనర్లు సిహెచ్.సుందరయ్య, వి.వరహాలనాయుడు, సభ్యులు ఎస్‌కె.జిలానీ బాషా, వై.వి.రావు, హనుమంతరావు, సిద్ధిఖ్ తదితరులు హాజరయ్యారు. దాదాపు రెండు గంటల పాటు చర్చించారు. చర్చల సమయంలో తమకు ఖచ్చితంగా 50 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని, ఆర్‌టిసిని నష్టాలను ప్రభుత్వం భరించాలని పట్టుబట్టారు. దీంతో దిగొచ్చిన ప్రభుత్వం జెఎసి డిమాండ్లను అంగీకరించింది. చర్చల అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడుతూ కార్మికుల కష్టం, యాజమాన్యం పొదుపు చర్యల వల్ల ఆర్టీసి పరిస్థితులు మారే అవకాశం ఏర్పడినా డీజిల్ భారం పడటం వల్ల నష్టాలను తగ్గించుకోలేక పోతున్నామన్నారు. సంస్థ మనుగడ కార్మికులతోనే సాధ్యమని, కార్మికుల శ్రేయస్సును కూడా దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకున్నామన్నారు. పల్లెవెలుగు బస్సుల ద్వారా వచ్చే నష్టాన్ని పూడ్చేందుకు మిగతా 9లో

బిజెపి, టిఎంసి తోడు దొంగలే

- ఎన్నికల ముందు డ్రామాలు ఆడుతున్నాయి
- శారదా స్కాంలో ఇరు పార్టీలు భాగస్వాములే
- సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పారదర్శకంగా విచారణ
- సీతారాం ఏచూరి డిమాండ్

8

పారిస్‌లో భారీ అగ్నిప్రమాదం

- 8 మంది మృతి
- 30 మందికి గాయాలు

9

విచారణకు హాజరవ్వండి

- కొల్‌కతా పోలీస్ బాస్‌కు సుప్రీం ఆదేశం
- దీక్షను విరమించిన మమత
- ఇది మా నైతిక విజయం: తృణమూల్ అధినేత్రి
- బెంగాల్ సిఎంకు ఎదురుదెబ్బ: బిజెపి
- మమతకు సంఘీభావం తెలిపిన ప్రాంతీయ పార్టీల నేతలు



కోల్‌కతా: శారదా చిట్ ఫండ్ కుంభకోణంపై దర్యాప్తులో సిబిఐ విచారణకు తప్పనిసరిగా హాజరుకావాలని కోల్‌కతా నగర పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమార్‌ను సుప్రీం కోర్టు మంగళవారం ఆదేశించింది. అరెస్ట్‌తో సహా ఎలాంటి నిర్బంధ చర్యలకు పాల్పడవద్దని కేంద్ర దర్యాప్తు సంస్థను కేంద్ర దర్యాప్తు సంస్థను నిర్దేశించింది. కేసు విచారణలో సిబిఐకి పూర్తిగా సహకరించాలని తాము రాజీవ్‌కుమార్‌కు సూచిస్తున్నామని ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం తెలిపింది. సుప్రీం తీర్పు వెలువడిన కాసేపటికే మమత తన దీక్షను విరమించారు. సుప్రీం కోర్టు తీర్పు తమకు లభించిన విజయమంటే తమకు లభించిన విజయమని బిజెపి, తృణమూల్ ప్రకటించుకున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర ఆరోపణలు మానుకోవాలన్న సుప్రీంకోర్టు... కోల్‌కతాలో కాకుండా షిల్లాంగ్‌లోని సిబిఐ కార్యాలయంలో విచారణకు పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్ హాజరుకావాలని పేర్కొంది. సిబిఐ దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన సుప్రీం దీనిపై వివరణ కోరుతూ బెంగాల్ ప్రధాన కార్యదర్శి, డిజిపి, కమిషనర్‌లకు నోటీసులు జారీ చేసింది. ఈ నెల 18లోగా వివరణ ఇవ్వాలని, అవసరమైతే ఈ ముగ్గురూ ఈ నెల 20న వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాలని సూచించింది.

వాస్తవాలను వక్రీకరిస్తున్న బిజెపి :మమత బెనర్జీ

రాష్ట్ర పరిణామాలపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వాస్తవాలను వక్రీకరిస్తోందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విమర్శించారు. శారదా చిట్‌ఫండ్స్ కుంభకోణంలో కోల్‌కతా నగర పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమార్‌ను ప్రశ్నించేందుకు ఆదివారం నాడు సిబిఐ అధికారులు ప్రయత్నించిన తరువాత కేంద్రం వైఖరిని నిరసిస్తూ మమత నగరంలోని ఎస్ప్లనేడ్ మెట్రో ఛానల్ ఎదుట 'సేవ్ ఇండియా' పేరుతో ధర్నాకు దిగిన సంగతి తెలిసిందే. మంగళవారం మిగతా 8లో



దీక్షా శిబిరంలో మమతతో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

చంద్రబాబు సంఘీభావం

బెంగాల్‌లో గొడవలు సృష్టించేందుకు కేంద్రం చేపట్టే చర్యలకు ప్రతిచర్య తప్పదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 42 లోక్‌సభ స్థానాలను మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ గెల్చుకుంటుందని ఆయన జోస్యం చెప్పారు. రాష్ట్రంలో సిబిఐ అధికారుల దాడులను వ్యతిరేకిస్తూ గత ఆదివారం నుండి నిరశన దీక్ష కొనసాగిస్తున్న బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి చంద్రబాబు సంఘీభావం ప్రకటించారు.

వైసిపిలోకి ఎమ్మెల్యే ఆమంచి !



ప్రజాశక్తి–చీరాల (ప్రకాశం)

ప్రకాశం జిల్లా చీరాల ఎమ్మెల్యే ఆమంచి కృష్ణ మోహన్ వైసిపిలోకి చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు స్పష్టమవుతోంది. మంగళవారం ఉదయం 11 గంటలకు తన ముఖ్య అనుచరులతో పందిళ్లపల్లిలోని తన నివాసం వద్ద ప్రత్యేక సమావేశం నిర్వహించి అభిప్రాయాలు తీసుకున్నారు. అందరూ వైసిపిలోకి చేరాలని కోరారు. దీంతో వైసిపిలో చేరడం దాదాపు ఖారారైనట్టేనని ప్రచారం జరుగుతోంది. బుధవారం ఉదయం చిత్తూరు జిల్లా రేణిగుంటవిమానాశ్రయంలో వైసిపి అధినేత జగన్‌ను కలిసి పార్టీలో చేరనున్నట్లు ఎమ్మెల్యే ముఖ్య మిగతా 9లో

బేటీ బచావో ప్రచారానికే పరిమితం

- మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించాలి
- మహిళల రక్షణలో మోడీ సర్కార్ విఫలం
- జంతర్ మంతర్ వద్ద ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళన



జంతర్ మంతర్ వద్ద జరిగిన ధర్నాలో ప్రసంగిస్తున్న మరియం ధావలే

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

మోడీ ప్రభుత్వం మహిళా సాధికారిత విషయంలో గొప్పలు చెప్పుకుంటోందని, ప్రచారానికే బేటీ బచావో, బేటీ పడావో పథకాన్ని వినియోగించుకుంటుందని ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం దావలే ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి హయాంలో మహిళలపై దాడులు విపరీతంగా పెరిగాయని, మహిళలకు రక్షణ కల్పించడంలో మోడీ సర్కార్ పూర్తిగా విఫలం చెందిందని విమర్శించారు. దళిత, గిరిజన, అణగారిన వర్గాల మహిళలపై వేధింపులు మోడీ పాలనలో మరింత అధికమయ్యాయని స్పష్టం చేశారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 7 వరకు పలు సామాజిక, ప్రజాస్వామ్య సంఘాలు, రాజకీయ పార్టీలు సంయుక్తంగా తలపెట్టిన ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా ఆరో రోజు మంగళవారం మహిళా సంఘాలు ఐక్యంగా జంతర్ మంతర్ వద్ద భారీ ధర్నా చేపట్టాయి. ఈ సందర్భంగా మహిళలపై వేధింపులకు వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడాలని తీర్మానించాయి. ఈ నిరసనలో మోడీ సర్కార్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలతో హోరెత్తించారు. ఐద్వా ప్రధాన మిగతా 8లో



నివాళులర్పిస్తున్న వ్యవసాయ కార్మిక నేతలు

వలస కార్మికుని విషాద మృతి

- కర్నూలు జిల్లా వాసి ప్రత్తిపాడులో...
- గుర్తుతెలియని వ్యక్తి మరణించాడని ప్రచారం
- వ్యవసాయ కార్మిక సంఘం నేతల నివాళి

ప్రజాశక్తి–గుంటూరు

ఉపాధి కోసం వలస వచ్చిన కార్మికుడు దయనీయస్థితిలో మృతిచెందిన విషాద ఉదంతం ఇది. కర్నూలు జిల్లా నుండి గుంటూరు జిల్లాకు వేల సంఖ్యలో వలస వచ్చారు. వీరు పత్తిపాడు, పెదకూరపాడు, సత్తెనపల్లి, తాడికొండ, నర్సరావుపేట ప్రాంతాల్లో తాత్కాలిక గుడారాలు వేసుకుని పొలం పనులకు వెళుతూ ఉంటారు. అయితే పొలం పనులు దొరకక.. జీవనం కోసం ఒక్కోసారి ఇతర పనులు కూడా చేయాల్సి వస్తోంది. దీనిలో మిగతా 9లో

'ప్రతి దశలోనూ సంక్షేమం'

బడ్జెట్ ప్రసంగంలో యనమల

- డ్రైవర్ల కోసం సాధికార సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వ్యక్తి జీవితంలోని ప్రతి దశలోనూ సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నామని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. మంగళవారం శాసనసభలో 2019-20 ఆర్థిక సంవత్సరానికి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది బడ్జెట్ అంచనాల కంటే ఈబడ్జెట్18.38 శాతం ఎక్కువ అన్నారు.

రైతుల కోసం 'అన్నదాత సుఖీభవ' ప్రవేశపెడుతున్నామని, ఈ పథకానికి రూ.5000 కోట్లు కేటాయిస్తున్నామని ప్రకటించారు. వివిధ పంటలకు సబ్సిడీ పెంచి వరి, చెరకు, ప్రత్తి, వేరుశనగ పంటలకు ఉన్న రాయితీని రూ.10,000 నుంచి రూ.15,000 , మొక్కజొన్న పంటలకు రూ.8,333 నుంచి రూ.12,500, పప్పు ధాన్యాలు, పొద్దుతిరుగుడు పంటకు రూ. 6,250 నుంచి రూ.10,000 పెంచినట్లు తెలిపారు. ఆహార ప్రక్రియ పరిశ్రమలకు రూ.300 కోట్లు ప్రతిపాదించారు. కనీస మద్దతులేని పంటల విషయంలో మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీం ను రూ.500 కోట్ల నుంచి ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.1000 కోట్లకు పెంచుతున్నట్లు ప్రకటించారు. పశుగ్రాసం, ఆహారం అభివృద్ధికి రూ. 200 కోట్లు కేటాయించామన్నారు. పశువులపై బీమా కోసం రూ.200 కోట్లు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ముఖ్యమంత్రి యువనేస్తం పథకం కింద నిరుద్యోగ యువతకు ఇచ్చే భృతిని నెలకు రూ.1000 నుంచి రూ.2,000 పెంచామన్నారు. కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వెనుకబడిన వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నామని అన్నారు. వెనుకబడిన కార్పొరేషన్లకు ఈ బడ్జెట్‌లో రూ.3000 కోట్లు కేటాయించేందుకు ప్రతిపాదించారు. కొత్తగా క్షత్రియుల సంక్షేమానికి రూ.50 కోట్లు ప్రత్యేకంగా కేటాయిస్తున్నామని అన్నారు.

ఆదాయ వనరులు లేని మసీదులకు చెందిన ఇమాంలకు నెలకు రూ.5000, మౌజర్లకు రూ.3000 చొప్పున పారితోషకాలను ప్రకటించారు. మైనార్టీల సంక్షేమానికి రూ.1304.43 కోట్లు కేటాయిస్తున్నామని, గతేడాది కేటాయింపుల కంటే 18.57 శాతం పెంచామన్నారు. వికలాంగుల జీవనాధారం కోసం రూ.35.87 కోట్లు కేటాయించామన్నారు. వారికి పునరావాసం, కృత్రిమ అవయవాలు ఏర్పాటుకు ఈ బడ్జెట్‌లో రూ.70 కోట్లు ప్రతిపాదించారు. కమ్యూనిటీ మౌలిక వసతుల కల్పనకు ఈ బడ్జెట్‌లో రూ. 600.56 కోట్లు కేటాయించామన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్‌కు గతేడాది కంటే ఈ బడ్జెట్‌లో 28 శాతం పెంచుతూ రూ. 14,367 కోట్లను ప్రతిపాదించారు. ఎస్టీ సబ్‌ప్లాన్‌కు 29 శాతం పెంచుతూ రూ. 5,385 కోట్లు, బిసి సబ్‌ప్లాన్‌కు 33 శాతం పెంపుతో




రూ.16,226 కోట్లు కేటాయించామన్నారు. రైతు, మహిళా సాధికార సంస్థ తరహాలో డ్రైవర్ల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ' డ్రైవర్ల సాధికార సంస్థ ' స్థాపించేందుకు ప్రతిపాదించారు. అందుకు రూ.150 కోట్లు కేటాయిస్తున్నామని తెలిపారు. పెన్షన్లను ఈ ఏడాది జనవరి నుంచి రెట్టింపు చేసి నెలకు రూ.2000, రూ.3000 పెంచామన్నారు. చంద్రన్న బీమా కేటాయింపులు రెండున్నర రెట్లు పెంచుతూ రూ.354 కోట్లు ప్రతిపాదించారు. వైద్యఆరోగ్య శాఖకు రూ.10,032 కోట్లు కేటాయిస్తూ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో ప్రతి కుటుంబానికి ఉన్న పరిమితి ఏడాదికి రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. అందుకు ఈ బడ్జెట్‌లో రూ.1200 కోట్లు కేటాయించామన్నారు. పాలిటెక్నిక్ కాలేజీ విద్యకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరిస్తున్నట్లు ప్రకటించారు. నూతన విశ్వవిద్యాలయాల్లో మౌలిక సౌకర్యాలకు ఒక్కో యూనివర్శిటీకి రూ.40 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. మానవ వనరుల విభాగానికి ఈ బడ్జెట్‌లో రూ.29,955 కోట్లు కేటాయిస్తున్నామని అన్నారు. ఎమ్ఎస్ఎమ్ఇ సెక్టార్‌కు ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.1000 కోట్లు ప్రతిపాదించారు.

అందులో ఒత్తిడిలో ఉన్న ఎమ్ఎస్ఎమ్ఇల పునరుద్ధరణకు రూ.100 కోట్లు, కొత్త సంస్థలకు ప్రోత్సాహకాలకు రూ.400 కోట్లు, ఎమ్ఎస్ఎమ్ఇ పార్కుల అభివృద్ధికి రూ.500 కోట్లు కేటాయించినట్లు వివరించారు. 2014 తర్వాత నీటిపారుదలకు రూ.64,334 కోట్లు వెచ్చించామని, అందులో పోలవరం ప్రాజెక్టుకు రూ.10,499 కోట్లు ఖర్చు చేశామన్నారు. అమరావతిలో వివిధ స్టార్ హోటల్స్‌కు స్థలాలు కేటాయించామని, మారియట్, ఐటిసి, తాజ్ వంటి సంస్థలకు స్థలాల కేటాయింపు పరిశీలనలో ఉందన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్లను ప్రోత్సహించేందుకు ఒక యూనిట్ విద్యుత్‌కు ఒక రూపాయి సబ్సిడీ ప్రతిపాదించారు. అయితే వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఇది అమలులోకి వస్తుందన్నారు. దాదాపు గంట 45 నిమిషాలపాటు కొనసాగిన బడ్జెట్ ప్రసంగంలో యనమల పలుమార్లు తడబడ్డారు.

ఓట్ల కోసం అంకెల గారడీ

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రజలను మోసగించేలా ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు అన్నారు. విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాస్తవ విరుద్ధంగా కేటాయింపులు చేసి ప్రజలను మోసగించే విధంగా బడ్జెట్ రూపొందించారని, ఎన్నిక లను దృష్టిలో పెట్టుకుని అనేక తాయిలాలు ప్రకటించారని అన్నారు. అన్నదాత సుఖీభవతో పాటు ఆరు కొత్త పథకాలను ప్రకటించారని, పాత సంక్షేమ పథకాలకు నిధులు పెంచుతున్నట్లు చూపించారని తెలిపారు. కానీ గతేడాది బడ్జెట్‌లో సంక్షేమ పద్దులకు కేటాయించిన నిధులను ఖర్చు చేయకుండా కోత విధించారన్నారు. దీన్ని బట్టి ఇది ప్రజలను మోసగించే బడ్జెట్ అని స్పష్టమవుతోందన్నారు. గతేడాది బడ్జెట్‌లో బిసి సంక్షేమం కోసం 6,213.17 కోట్లు కేటాయించినా వాస్తవంగా 5,356.70 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని చెప్పారు. పౌర సరఫరాలకు రూ.800 కోట్లు, సాంఘిక సంక్షేమానికి రూ.500 కోట్లు, మహిళా, శిశుసంక్షేమానికి రూ.800 కోట్లు గతేడాది కేటాయించిన దాని కన్నా తక్కువగా ఖర్చు చేశారన్నారు. ప్రాథమిక విద్యకు రూ.3,088 కోట్లు కోత పెట్టారని, ఉన్నత విద్యకు రూ.100 కోట్లు కోత పెట్టారని, మొత్తంగా సంక్షేమ పథకాలకు 5,335 కోట్లు కోత పెట్టారని తెలిపారు. నిరుద్యోగ భృతిని రూ.వెయ్యి నుంచి రూ.2వేలకు పెంచినా గతేడాది బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తే దాన్ని ఈ ఏడాది రూ.1,200 కోట్లకు మాత్రమే పెంచారని, పెంచిన 20 శాతం కేటాయింపులతో భృతి రెట్టింపు ఎలా చేస్తారో వారికే అర్థం కావాలని అన్నారు. పసుపు-కుంకుమ కింద 93 లక్షల మంది మహిళలకు రూ.10వేల చొప్పున ఇచ్చేందుకు సుమారు 9,300 కోట్లు అవసరమవుతుందని, బడ్జెట్‌లో కేవలం రూ.4వేల కోట్లు మాత్రమే కేటాయించడ మంటే మహిళలకిచ్చిన చెక్కులు సగం చెల్లకుండాపోతాయని ఎద్దేవా చేశారు. ఉపాధి హామీ కార్మికులకు రూ.1,872 కోట్లు బకాయిలు ఉంటే బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించారని, అవి ఏ మూలకూ సరిపోవని అన్నారు. రాష్ట్రంలో సగానికి పైగా జిల్లాలు తీవ్రమైన కరువును ఎదుర్కొంటుంటే ఆ సమస్య పరిష్కారానికి ఈ బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులూ చేయలేదన్నారు. చాలీ చాలని వేతనాలతో కునారిల్లి పోతున్న అసంఘటిత రంగ కార్మికుల కోసం బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులూ లేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మోసగించి ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తోందని, ప్రభుత్వ అంకెల గారడీని ప్రజలు విశ్వసించరని చెప్పారు.

మరో వంచనకు ప్రతిరూపం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మరో వంచనకు ప్రతిరూపమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ పేర్కొన్నారు. చంద్రబాబును స్తుతించే స్తోత్రంలా బడ్జెట్ ప్రసంగం ఉందన్నారు. ఊహాజనిత గణాంకాలతో భారీ కేటాయింపులతో వండివార్చిన ఈ బడ్జెట్‌లో ఆదాయ వనరుల వాస్తవ పరిస్థితిని విస్మరించారని, ఈ కేటాయింపులన్నీ కాగితాలకే పరిమితం కావడం తప్ప ఆచరణలో అమలయ్యే అవకాశం కనిపించడం లేదని పేర్కొన్నారు. వాస్తవ ద్రవ్యోల్బణాన్ని కూడా పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. గత ఐదేళ్లుగా రైతుల రుణమాఫీ పూర్తిగా అమలు చేయని చంద్రబాబు ఎన్నికల ముందు రైతులను మభ్యపెట్టేందుకు అన్నదాత సుఖీభవ అంటూ మరో కొత్త పథకాన్ని తెరపైకి తెచ్చారన్నారు.



బడ్జెట్ ప్రసంగాన్ని ఆలకిస్తున్న సిఎం చంద్రబాబు ఇతర సభ్యులు

ఓటమి భయంతో పెట్టిన బడ్జెట్

కొలుసు పార్థసారథి



ఓటమి భయంతో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ పెట్టినట్లు ఉందని వైసిపి అధికార ప్రతినిధి కొలుసు పార్థసారథి తెలిపారు. ఎలాగూ ఇంటికెళుతున్నామనే భయంతో అంకెల గారడీ చేసి ఎన్నికల్లో లబ్దిపొందాలనే కుట్ర బడ్జెట్లో కనిపిస్తోందని పేర్కొన్నారు. లెక్కల్లో ఎక్కడా జవాబుదారీతనం కనిపిచండం లేదని. సంక్షేమ రంగాలకు నిధులు నామమాత్రంగా ఇచ్చారని విమర్శించారు. రెండు లక్షల కోట్ల అప్పుతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నారని, బలహీనవర్గాలను మోసం చేశారని వివరించారు. మూల నిధులు కేటాయించకుండా బిసిలపై కపట ప్రేమను చూపారని అన్నారు. 40 ఏళ్ల అనుభవమని చెప్పిన చంద్రబాబు వ్యవసాయరంగాన్ని నాశనం చేశారని విమర్శించారు.

అప్పుల ఊబిలోకి దించిన టిడిపి

కాంగ్రెస్ అధ్యక్షులు రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్రాన్ని టిడిపి ప్రభుత్వం అప్పుల ఊబిలోకి దించిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇప్పటి వరకు రాష్ట్రాన్ని పరిపాలించిన ముఖ్యమంత్రులు రూ.96వేల కోట్లు అప్పు చేశారని, నాలుగున్నరేళ్లల్లో టిడిపి ప్రభుత్వం రూ.1,53,435కోట్ల అప్పును మిగిల్చిందన్నారు. ఇంతమంది ముఖ్యమంత్రులు ఉమ్మడి రాష్ట్రాన్ని పరిపాలించినా చేయని అప్పు చంద్రబాబు ఒక్కరే చేశారని విమర్శించారు. అశాస్త్రీయంగా విభజన చేశారని పల్లవి పాడుతునే మళ్లీ ఆచట్టంలోని అంశాల్ని అమలు పరచాలని చంద్రబాబు డిమాండ్ చేస్తున్నారని, కనీసం అవి తెచ్చుకునే శక్తి లేని అసమర్థత ఆయనలో ఉందని విమర్శించారు.

వ్యవసాయ కార్మికులను మోసగించారు : వ్యకాస

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంకెల గారడీ బడ్జెట్‌తో వ్యవసాయ కార్మికులను మోసం చేశారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు విమర్శించారు. రాష్ట్రంలో కరువు తీవ్రంగా ఉందని 350 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించారని అయినా కరువు నివారణా చర్యలు లేవని తెలిపారు. ఇళ్లస్థలాలకు రూ.500 కోట్లు కేటాయించారని, ఇది ఏ మూలకు చాలదని పేర్కొన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థను కుదిస్తున్నారని వివరించారు.

వాస్తవ సాగుదారులకు ఇవ్వాలి : ఎపి కౌలు రైతుల సంఘం

అన్నదాత సుఖీభవ పథకం కింద కేటాయించిన నిధులు రూ.5 వేల కోట్లు పెట్టుబడి సాయం మొత్తాన్ని వాస్తవంగా సాగు చేసుకుంటున్న కౌలు రైతులకే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జమలయ్య కోరారు. రుణమాఫీ జరగక రోజురోజుకూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అయినా బడ్జెట్లో వారి సంక్షేమం రక్షణ చర్యల గురించి ప్రస్తావించలేదని తెలిపారు.ధరల స్థిరీకరణ నిధి కోసం రూ.1000 కోట్లు చాలవని, ఇది రైతులను మోసగించడమే అవుతుందని పేర్కొన్నారు.

దళితులను దగా చేస్తున్న చంద్రబాబు : కెవిపిఎస్

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టిస్తూ దళితులను చంద్రబాబు దగా చేస్తున్నారని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపియస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి విమర్శించారు. 2019 ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో దళితుల సంక్షేమానికి రూ.11,367కోట్లు కేంటాయించి, 27శాతం బడ్జెట్ పెంచామని ముఖ్యమంత్రి చెప్పుకోవడం దళితులను మోసం చేయడమేనని పేర్కొన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం 2014లో అధికారానికి వచ్చిన తరువాత బడ్జెట్ కేటాయింపుల్లో రూ.1882 కోట్లు ఖర్చు చేయలేదని తెలిపారు. వాటిని పక్కదారి పట్టించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు.

బడ్జెట్‌లో ఎస్సీలకు 17 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా, కేవలం నాలుగు శాతం మాత్రమే కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. 2018-19 బడ్జెట్‌లో పసుపు-కుంకుమ కింద కేటాయించిన రూ.2137 కోట్లపై వస్తున్న విమర్శలపై సిఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

జీవాల సంరక్షణకు కేటాయింపులు లేవు : జిఎంపిఎస్

జీవాల సంరక్షణకు ఈ బడ్జెట్లో నిర్దిష్టంగా నిధుల కేటాయింపు లేదని ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం(జిఎంపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ విమర్శించారు. తెలుగుదేశం మ్యానిఫెస్టోలో 2014లోనే పెట్టినా ఇంతవరకు కేటాయింపులు జరగలేదని పేర్కొన్నారు. 50 సంవత్సరాలు దాటిన ప్రతి గొర్రెల కాపరికి రెండువేల రూపాయల వృద్ధాప్య పింఛన్ మంజూరు చేస్తానని చెప్పారని చేయలేదన తెలిపారు. జీవాల మేత కోసం ప్రతి గ్రామంలో ఐదు ఎకరాలు కేటాయిస్తామన్నా చేయలేదని పేర్కొన్నారు. వృత్తిదారులను మోసం చేసే విధంగా బడ్జెట్ ఉందని వివరించారు.

యువతను వంచించారు : డివైఎఫ్ఐ

రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ యువతను వంచించే విధంగా ఉందని డిఐఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సూర్యారావు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం 18 వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేన్ ఇచ్చి 42 వేల పోస్టులు భర్తీ చేస్తున్నట్లు ప్రకటించిందని, 11 లక్షల మంది నిరుద్యోగ భృతికి దరఖాస్తు చేసుకుంటే నాలుగు లక్షల మందికి మాత్రమే ఇచ్చిందని పేర్కొన్నారు. క్రీడా యువజన శాఖలకు అతి తక్కువ కేటాయింపులు చేశారన్నారు. కియో పరిశ్రమ దగ్గర 359 కుటుంబాల నుండి భూములు తీసుకుని 150 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చిందన్నారు. సోలార్ పవర్ ప్లాంట్లలో ఆరువేల మందికి ఉద్యోగాలిచ్చామని ప్రకటించారని, 120 మందికి సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలిచ్చి చేతులు దులుపుకున్నారని పేర్కొన్నారు.

రైతులను అవమానించారు : రైతు సంఘం

బడ్జెట్ ప్రతిపాదనలు రాష్ట్ర ప్రయోజనాలను బలితీసుకుంటాయని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.కేశవరావు, పూల పెద్దిరెడ్డి, ఉపాధ్యక్షులు పి.నరసింహారావు తెలిపారు. తాత్కాలిక ప్రయోజనాల కోసం పెట్టిన బడ్జెట్లో మౌలిక, వ్యవసాయరంగాల ప్రగతిని ఫణంగా పెట్టిందని చెప్పారు.

గతేడాది రూ.19071 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఈ ఏడాది పెంచాల్సింది పోయి తగ్గించిందని పేర్కొన్నారు. అన్నదాతా సుఖీభవ పథకానికి విధివిధానాలు రూపొందించలేదని వివరిం చారు. రాష్ట్రంలో ఉన్న 84 లక్షల మంది రైతుల కుటుంబాలకు బడ్జెట్లో ప్రతిపాదిం చిన అరకొర నిధులతో ఏమి చేయగలుగుతుందని ప్రశ్నించారు.

మౌలిక రంగాలను విస్మరించారు

పిడిఎఫ్ ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బడ్జెట్ మౌలిక రంగాలకు నిరాశాజనకంగా ఉందని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రహ్మణ్యం, బొడ్డు నాగేశ్వరరావు, రాము సూర్యారావు, యండపల్లి శ్రీనివాసులు రెడ్డి విమర్శించారు. సిపిఎస్ రద్దుపై కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్న ప్రభుత్వ విధానాలపై పోరాడతామని తెలిపారు. విద్య, వైద్య, సాంఘిక సంక్షేమం, మహిళా సంక్షేమానికి నిధుల కేటాయింపులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. విద్యా రంగానికి గతేడాది 12.79 శాతం నిధులు కేటాయించగా, ఈ బడ్జెట్‌లో 11.48 శాతం మాత్రమే కేటాయించారని తెలిపారు. ఉన్నత విద్యకు రూ. మూడు వేల కోట్లు మాత్రమే కేటాయించడం బాధాకరమని తెలిపారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌కు లోటు బడ్జెట్ కేటాయించారన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ రంగానికి 50 శాతం నిధులు కేటాయించారని, ఈ బడ్జెట్‌ను ఎన్నికల బడ్జెట్‌గా అభివర్ణించారు.



విద్య, సంక్షేమ రంగాలకు తగ్గింపు

విద్య సంక్షేమ రంగాలకు బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గాయని పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ వి బాలసుబ్రహ్మణ్యం విమర్శించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్ 18.38 శాతం పెరిగిందని, కీలకమైన విద్యారంగానికి కేటాయింపులు నానాటికి తగ్గడం బాధాకరమని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది బడ్జెట్‌లో 13 శాతం కేటాయించగా, ఈ ఏడాది 11.5 శాతానికి తగ్గిపోయిందన్నారు. రిజర్వు బ్యాంకు ప్రకటించిన గణాంకాల ప్రకారం రాష్ట్రాలు విద్యకు కేటాయిస్తున్న బడ్జెట్ సరాసరి 15.8 శాతమని, రాష్ట్రం మాత్రమే 11.5 శాతమేనని తెలిపారు. ఉన్నత విద్యకు కేవలం రూ.3,171 కోట్లు కేటాయించి సరిపెట్టడం దీన్ని ప్రైవేట్ రంగానికి అప్పజెప్పడమేనని విమర్శించారు. ఆరోగ్యానికి ఏమాత్రం కేటాయింపుల్లో పెరుగు దల లేదని, 4.43 శాతం వద్దే నిలిచిపోయింద న్నారు. విద్యతోపాటు, సాంఘిక సంక్షేమ, మహిళా శిశు సంక్షేమాలకు బడ్జెట్‌లో కేటాయింపు శాతం తగ్గిందని పేర్కొన్నారు. యువ జనులకు నైపుణ్యాభివృద్ధికి బడ్జెట్ మొత్తం కూడా బాగా తగ్గిందన్నారు. వ్యవసాయానికి, వెనుకబడ్డ తరగతుల బడ్జెట్ పెరగడం కొంత ఊరటని తెలిపారు. సిపిఎస్, ఐఆర్‌పై గానీ ప్రస్తావనే ఈ బడ్జెట్‌లో లేదని పేర్కొన్నారు. ప్రజల మౌలిక అవసరాలకు, దీర్ఘకాలిక ప్రయోజనాలకు, వ్యవస్థల పటిష్టలకు ఈ బడ్జెట్ ఏ మాత్రం ఉపయోగపడదని విమర్శించారు.

వ్యవసాయానికి కేంద్రం అన్యాయం : చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా కుమారుడు తన ఆస్తులను 16 వేల రెట్లు పెంచుకున్నారని, దీనిపై దర్యాప్తు జరపరా అని కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. రాఫెల్ కుంభకోణంపై ఎందుకు విచారణకు ఆదేశించ లేదన్నారు. శాసనసభలో వ్యవసాయం, అనుబంధ రంగాలపై చర్చలో భాగంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ పలాసలో బిజెపి జాతీయ అధ్యక్షులు అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. తనపై అవినీతి ఆరోపణలు చేయడాన్ని తప్పుబట్టారు. తాను 35 ఏళ్ల రాజకీయాల్లో ఉన్నానంటూ, అభివృద్ధి అంటే మీకు తెలుసా... నాలుగేళ్ల కిందట మీరెక్కడ అని షాను ప్రశ్నించారు. రాష్ట్రానికి న్యాయం చేయమని, విభజన హామీలు అమలు, హోదా ఇవ్వాలని అడిగితే ఎదురుదాడి చేస్తున్నారన్నారు. తాను వెళ్లి ఎన్డీఎలో కలుస్తాననలేదని, బిజెపి నాయకులు హైదరాబాదు వచ్చి తనను ఆహ్వానిస్తేనే ఎన్డీఎతో కలిసినట్లు చెప్పారు. 14 అంశాల్లో పదింటిని అమలు చేశామని అమిత్ షా చెప్పడాన్ని తప్పుబడుతు ఎవరి చెవులో పువ్వులు పెడతారన్నారు. నితిన్ గడ్కరి వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ కుటుంబాన్ని సరిదిద్దుకోలేని వ్యక్తులు దేశాన్ని ఏ విధంగా ఉద్ధరిస్తారన్నారు. ప్రస్తుతం ఉన్నది పాత బిజెపి కాదని, మోడీ, షాల బిజెపి అన్నారు. విశాఖలో ఒక ఎమ్మెల్యేను, ఎంపిని గెలిపిస్తే రైల్వే జోన్ తెచ్చుకోలేకపోయారన్నారు. ఉపాధి నిధులు ఇప్పటికే రూ.2 వేల కోట్లు బకాయిలు ఉన్నాయని, తాజాగా ఈ మొత్తం మరో రూ.2 వేల కోట్లకు చేరిందన్నారు. మీరు రాష్ట్రానికి వచ్చి పుండుమీద కారం జల్లి ఆనందించాలనుకోవడం సాధ్యం కాదన్నారు. జాతీయ రహదారుల కేటాయింపులపై తాను చర్చకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. తిరుపతి సభలో వైసిపి గురించి మోడీ మాట్లాడుతూ అది అవినీతి పార్టీ అని, ఆ పార్టీతో కలిసేది లేదని చెప్పారన్నారు. మళ్లీ తాను ఎన్డీఎకు వెళతానని చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు.

కేంద్ర నిధులే ఆధారం : సోము వీర్రాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా కేంద్రంపై ఆధారపడిన బడ్జెట్. 54 ప్రాయోజిత కార్యక్రమాల ద్వారా కేంద్రం రాష్ట్రానికి కోట్లాది రూపాయలు సాయం చేస్తోందని బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. ఎన్నికల సందర్భంగా అంకెల గారడీ చేసి రాష్ట్ర ప్రభుత్వం అమలు సాధ్యం కాని హామీలను ఇస్తోందని, ఇందుకు అవసరమైన నిధుల కేటాయింపు బడ్జెట్‌లో కనిపించలేదన్నారు.

ఐఆర్‌కు బడ్జెట్ కేటాయించకపోవడం అన్యాయం : ఎస్టీయు

రాష్ట్ర ప్రభుత్వ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన మధ్యంతర భృతి మంజూరుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం అన్యాయమని ఎస్టీయు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ జోసఫ్ సుధీర్ కుమార్, గాజుల నాగేశ్వరరావు విమర్శించారు. విద్యారంగానికి కేవలం రూ.29,955 కోట్లతో పరిమితమైందని, బడ్జెట్‌లో 25 శాతం విద్యారంగానికి కేటాయించకపోవడం అన్యాయమన్నారు. ప్రాథమిక విద్యారంగం బలోపేతానికి, మధ్యాహ్న భోజన పథకానికి ప్రత్యేకంగా నిధులు పెంచకపోవడాన్ని విమర్శించారు.

జివిఎల్‌పై చర్యలు తీసుకోవాలి : శ్రావణ్

ముఖ్యమంత్రి చంద్రబాబు శాసనసభలో 'అసెంబ్లీ రౌడీ'లా వ్యవహరిస్తు న్నాడని వ్యాఖ్యలు చేసినందుకు బిజెపి అధికార ప్రతినిధి జివిఎల్ నరసింహారావుపై సభా హక్కుల ఉల్లంఘన కింద చర్యలు తీసుకోవాలని తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ స్పీకర్ కోడెల శివప్రసాద్‌కు విన్నవించారు. ఈ అంశాన్ని శాసనసభలో ప్రస్తావిస్తూ రూరల్ నెంబరు 169 ప్రకారం జివిఎల్‌పై ఆయన నోటీస్ ఇచ్చారు. ఈ నోటీసుపై తదుపరి చర్యలు తీసుకుంటామని స్పీకర్ తెలిపారు.

స్థూల ఉత్పత్తిలో 32 శాతం వ్యవసాయ రంగానిదే : సోమిరెడ్డి



రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 32 శాతం వ్యవసాయ రంగానిదేనని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్పష్టం చేశారు. లోటు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రం, మిగులు బడ్జెట్‌లో ఉన్న తెలంగాణ రాష్ట్రంతో సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల అమల్లో పోటీపడుతోందన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రైతులకు పెట్టుబడి పెట్టడానికి రూ.5వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయించినట్లు తెలిపారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకానికి రూ.వెయ్యి కోట్లు బడ్జెట్‌లో కేటాయించి రైతులకు వెన్నుదన్నుగా ప్రభుత్వం నిలుస్తుందన్నారు. వ్యవసాయ రంగానికి గతేడాది రూ.19 వేల కోట్లు కేటాయించిగా, ఈ బడ్జెట్‌లో రూ.21,481 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

కేటాయింపుల మాయాజాలం : ఎపిడికెఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ కేటాయింపుల మాయాజాలమని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం (ఎపిడిఎస్‌కె) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి క్రాంతి కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. డప్పు కళాకారుల పెన్షన్‌ల కోసం రూ.108 కోట్లు కేటాయించిందని, రాష్ట్ర వ్యాప్తంగా 34137 మంది దరఖాస్తులు చేసుకుంటే కేవలం 27599 మందికి మాత్రమే ఇచ్చేందుకు నిర్ణయించడం అన్యాయమన్నారు. అర్హులైన ప్రతి కళాకారునికి గతంలో ప్రకటించిన విధంగా అక్టోబర్ నుంచే పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్యానికి అరకొరే : ప్రజారోగ్య వేదిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ ఏడాది బడ్జెట్‌లో వైద్యఆరోగ్య రంగానికి ప్రభుత్వం అరకొర నిధులే కేటాయించిందని ప్రజారోగ్య వేదిక అభిప్రాయపడింది. మొత్తం బడ్జెట్‌లో ఆరోగ్యానికి కేవలం 4.43 శాతమే కేటాయించారని వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎమ్‌వి. రమణయ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ వైద్యసేవ పథకం పరిమితి రెట్టింపు చేసినా బడ్జెట్‌లో కేవలం రూ.200 కోట్లు పెంచారని విమర్శించారు. స్వాస్థ్య విద్యావాహినికి సరిపడా నిధులు కేటాయించలేదని తెలిపారు. గ్రామీణ ఆరోగ్య వ్యవస్థలను పటిష్టపరచకుండా ఉన్న కొద్దిపాటి నిధులను కూడా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేలా కేటాయింపులు ఉన్నాయని పేర్కొన్నారు.

సభకు ఏడు బిల్లులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనసభలో ప్రభుత్వం ఏడు బిల్లులను మంగళవారం ప్రవేశపెట్టింది. శ్రీ సింహాచలం వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం పంచగ్రామాలు, చుక్కల భూముల (సవరణ), అసైన్డ్ భూముల(బదిలీ నిషేదం) సవరణ బిల్లులను ఉపముఖ్యమంత్రి కె.ఈ కృష్ణ మూర్తి సభలో ప్రవేశపెట్టారు. శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ విశ్వవిదాలయ (సవరణ) బిల్లును వైద్య విద్యా శాఖ మంత్రి ఎన్.ఎండి ఫరూఖ్, ఆంధ్రప్రదేశ్ కర్మాగారాల (సవరణ) బిల్లు, పారిశ్రామిక వివాదలు (సవరణ), కార్మిక శాసనాల (అపరాధాల రాజీ కోసం సవరణ) బిల్లును కార్మిక శాఖ మంత్రి పితాని సత్యనారయణ ప్రవేశపెట్టారు.


సిపిఎస్‌పై విధానం ప్రకటించకపోవడం శోచనీయం : యుటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగులు, ఉపాధ్యాయులను ఆందోళన పరుస్తున్న సిపిఎస్‌పై ప్రభుత్వ విధానమేంటనేది బడ్జెట్‌లో ప్రకటించకపోవడం శోచనీయమని యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ సాబ్జీ, పి బాబురెడ్డి విమర్శించారు. యుటిఎఫ్ విమర్శించింది. సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలు చేసేందుకు విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యారంగానికి కేటాయింపులు తగ్గాయని విమర్శించారు. రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్‌గా మారుస్తామని, 2022కి దేశంలోనే మొదటి స్థానంలోకి తీసుకొస్తామని ప్రకటించినప్పటికీ బడ్జెట్ ఆ విధంగా లేదని తెలిపారు.

ఎన్నికల బడ్జెట్టే

- రూ.2,26,177 కోట్లతో ప్రతిపాదన
- ఓట్ ఆన్ అక్కౌంట్ రూ.76,816 కోట్లు
- ఆరు కొత్త పథకాల ప్రతిపాదన



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఎన్నికల బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. రూ.2,26, 177.53 కోట్ల అంచనా వ్యయంతో బడ్జెట్‌ను శాసనసభ లో ఆర్థిక మంత్రి యనమల రామ కృష్ణుడు, శాసన మండలిలో మున్సి పల్ మంత్రి నారాయణ ప్రవేశపెట్టారు. ఇది గత బడ్జెట్ కన్నా దాదాపు 32 వేల కోట్ల రూపాయలు అధికంగా ఉంది. బడ్జెట్‌లో ఓట్ ఆన్ అక్కౌంట్‌గా రూ.76,816 కోట్లను నాలుగు నెలల్లో వినియోగించుకునేందుకు ప్రతిపాదించారు. వ్యవసాయం, సంక్షేమ రంగాలకు భారీగా నిధులను కేటాయింపు చూపింది. కొన్ని కొత్త పథకాలు ప్రవేశపెట్టగా, మరికొన్ని పథకాలకు గత ఏడాది కన్నా ఎక్కువ నిధులు కేటాయించింది. రెవెన్యూ ఖర్చుగా రూ.1,80,369 కోట్లు ప్రతిపాదించగా, పెట్టుబడి వ్యయంగా రూ.29596 కోట్లు ప్రతిపాదించింది. రాష్ట్ర సొంత పన్నుల ఆదాయాన్ని గత ఏడాది రూ.65,535 కోట్లుగా చూపించగా, ఈసారి రూ.75 వేల కోట్లు చూపించారు. గత ఏడాది లక్ష్యం పూర్తిగా సిద్ధించకపోయినప్పటికీ, కొత్త బడ్జెట్‌లో భారీగా పెంపు చూపించడం చర్చనీయాంశమ వుతోంది. అలాగే కేంద్రం నుంచి 97,081 కోట్లు వస్తుందని బడ్జెట్‌లో చూపించారు. ఇది గత బడ్జెట్ కన్నా దాదాపు 16వేల కోట్లు అదనంగా ఉంది. కేంద్రం నుంచి నిధులు రావడం లేదని పదేపదే చెబుతున్న ప్రభుత్వం అదనంగా నిధులు వస్తాయని బడ్జెట్‌లో చెప్పడం కూడా ఆశ్చర్యం కలిగిస్తోంది. అలాగే మద్యం ఆదాయంపైనా భారీగానే ఆశలు పెంచుకుంటోంది. గత ఏడాది కన్నా రూ.1200 కోట్ల రూపాయలు అదనంగా రూ.8518 కోట్లను ఆదాయంగా చూపించారు. అంటే మద్యం వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నట్లుగానే భావించాల్సి వస్తోంది. రాష్ట్ర వ్యాప్తం గా రిజిస్ట్రేషన్లు పడిపోయి నప్పటికీ, నిర్మాణ రంగం ఊపందుకోకపోయిన ప్పటికీ రిజిస్ట్రేషన్ల ఆదాయం గత ఏడాది కన్నా రూ.1600 కోట్లు అదనంగా ఉండడం విశేషం. ఇలా ఉండగా, వ్యవసాయం, ఇళ్ల నిర్మాణం, చిన్న పరిశ్రమలు వంటి వాటిల్లో ఆరు కొత్త పథకాలను బడ్జెట్‌లో ప్రతిపాదిస్తూ రూ.6200 కోట్లను కేటాయించారు. ఇదే సమయంలో వ్యవసాయ ఆధారిత పథకాలకు గతంలో ఇచ్చిన నిధుల కన్నా అదనపు నిధులు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మార్కెట్ ఇటర్‌వెన్షన్ నిధులను రెట్టింపు చేయడం, పసుపు కుంకుమ నిధులను రూ.1,700 కోట్ల నుంచి రూ.4వేల కోట్లకు పెంచడం, బిసి కార్పొరేషన్ నిధులను రూ.1,337 కోట్ల నుంచి మూడు వేల కోట్లకు పెంచడంతోపాటు మరికొన్ని పథకాలకు కూడా భారీగానే నిధులు పెంచారు. చంద్రన్న బీమాలు, పెళ్లికాను కలు, ముస్లిం, క్రిస్టియన్ మతాలకు సంబంధించిన వారికి ఇచ్చే నిధులపైనా బడ్జెట్‌లో కేటాయింపు పెరిగాయి.

కొత్త పథకాలివే ...	
పథకం	కేటాయింపులు (రూ. కోట్లలో)
అన్నదాతా సుఖీభవ	5,000
ఇళ్లస్థలాల కోసం భూ సేకరణ	500
ఎంఎస్ఎంఇలకు ప్రోత్సాహకాలు	400
డ్రైవర్ల సాధికార సంస్థ	150
పట్టణాలలో మౌలికసదుపాయాలు	100
క్షత్రియుల సంక్షేమం	50

మొత్తం పింఛన్లకు గత ఏడాది రూ.5,012 కోట్లు కేటాయించగా, కొత్త బడ్జెట్‌లో రూ.12,819 కోట్లు కేటాయించారు. ఇది 155 శాతం అధికంగా ఉండడం విశేషం.

ఓట్ ఆన్ అక్కౌంట్‌కు

మొత్తం వార్షిక బడ్జెట్‌లో ఓట్ ఆన్ అక్కౌంట్‌గా రూ.76,816 కోట్ల రూపాయలకు ప్రతిపాదించారు. ఇందులో అత్యధికంగా ఆర్థికశాఖ అవసరాల కోసం రూ.8,670 కోట్లు ప్రతిపాదించగా, ఓటు చేసిన బడ్జెట్ కేటాయింపుల విభాగంలో గ్రామీణాభివృద్ధికి రూ.8,397 కోట్లు, విద్య కోసం రూ.7,594 కోట్లు, నీటిపారుదలకు రూ.5,049 కోట్లు, వ్యవసాయానికి రూ.4,179 కోట్లు, పంచాయితీరాజ్ కోసం రూ.3,353 కోట్లు, వైద్య ఆరోగ్యం కోసం రూ.3,343 కోట్లు, పట్టణాభివృద్ధికి రూ.2,659 కోట్లు, రోడ్లు భవనాలకు రూ.1,891 కోట్లు, సాంఘి క సంక్షేమానికి రూ.1,517 కోట్లు, బిసి సంక్షేమానికి రూ.2,747 కోట్లు, మహిళా సంక్షేమానికి రూ.1,136 కోట్లు, ఇంధనం, మౌలికాభివృద్ధికి రూ.1,826 కోట్లు, పరిశ్రమలకు రూ.1,371 కోట్లు చొప్పున కేటాయించాలని ఓట్ ఆన్ అక్కౌంట్‌లో ప్రతిపాదించారు.

'పరిశోధన'లో 'అన్నదాత సుఖీభవ'

- వ్యవసాయానికి మళ్లీ కోతలే
- రూ. 1,270 కోట్లు తగ్గుదల
  విపత్తుల మాటేంటి?




ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

వచ్చే ఏడాదికి చంద్రబాబు సర్కారు ప్రతిపాదించిన బడ్జెట్‌లో ఎప్పటికి మల్లేనే వ్యవసాయం, అనుబంధ రంగాలకు భారీగా కోతలు పెట్టింది. అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు పెట్టుబడి రాయితీ చెల్లిస్తానంటూ కొత్త పథకం ప్రకటించినప్పటికీ ఈ ఏడాది కంటే కూడా వ్యవసాయ పద్దుకు ప్రతిపాదించిన బడ్జెట్ రూ.1,270 కోట్ల మేర తగ్గించింది. కొత్త పథకం అన్నదాత సుఖీభవకు రూ.5 వేల కోట్లు చూపినప్పటికీ దాన్ని వ్యవసాయ పరిశోధన పద్దు కింద వేశారు. మామూలుగా అయితే రైతులకు చేసే సాయాన్ని ఆర్థికంగా మేలు చేసేందుకు ఉద్దేశించిన ఎకనామిక్ సపోర్టు కింద చూపుతారు. కానీ చంద్రబాబు సర్కారు పరిశోధన ఖాతా కింద చేర్చిందంటే భవిష్యత్తులో ఆ స్కీం అమలుపై ఇప్పుడే నీలి నీడలు అలముకున్నాయన్న ఆందోళన రైతులు, రైతు సంఘాల్లో వ్యక్తమవుతోంది. కౌలు రైతులకు కూడా సాయం చేస్తామని లీకులివ్వగా బడ్జెట్‌లో దానిపై స్పష్టతనివ్వలేదు. రేఖామాత్రంగా నైనా కొత్త పథకం విధి, విధానాల్లేకపోవడం గమనార్హం. రుణ మాఫీ కిస్తులను నడుస్తున్న ఏడాది బడ్జెట్ నుంచి ఖర్చు చేసి దాని స్థానంలో 'అన్నదాత'ను తీసుకొచ్చినట్లు కనిపిస్తోంది.

ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాలకు 2019-20లో రూ.15,246 కోట్లు ప్రతిపాదించింది. మొత్తం బడ్జెట్‌లో వ్యవసాయం వాటా 6.74 శాతం. జరుగుతున్న ఏడాదికి రూ.12,355 కోట్లు (6.47 శాతం) కేటాయించగా సవరించిన అంచనాల దగ్గరకొచ్చేసరికి రూ.16,775 కోట్లు (8.52 శాతం) అయింది. కొత్త పథకాలు పెట్టినా వచ్చే సంవత్సరంలో ఆ మాత్రం కూడా బడ్జెట్ కేటాయింపుల్లేవు. ప్రస్తుత సంవత్సరానికి సంబంధించి సవరించిన అంచనాలతో పోల్చినట్లయితే మొత్తం బడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాల వాటా 8.52 నుంచి 6.74 శాతానికి తగ్గింది. కోత పడింది 1.78 శాతం. ప్రభుత్వం కేటాయిం చిన, సవరించిన అంచనాల మేరకైనా ఖర్చు చేస్తోందా అంటే అదేమీ లేదు. బడ్జెట్‌లో పేర్కొనే 'లెక్కల'ను పరిశీలిస్తే ఈ విషయం బోధ పడుతుంది. 2017-18లో వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.9,090 కోట్లు (5.79 శాతం) ప్రతిపాదించగా సవరించిన అంచనాల దగ్గరకొచ్చేసరికి రూ.8,842 కోట్లు (6.16 శాతం) అయింది. ఖర్చు మాత్రం రూ.7,666 కోట్లు (4.03 శాతం). అంటే ఆర్భాటంగా బడ్జెట్‌లో, సవరించిన బడ్జెట్‌లో ప్రతిపాదనలు, కేటాయింపులు పెంచడం వ్యయం దగ్గరకొచ్చే సరికి చేతులెత్తేయడం సర్కారుకు పరిపాటిగా మారింది. వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించి ప్రముఖంగా ప్రకటించిన పథకం మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం. ప్రస్తుత ఏడాదిలో దానికి రూ.500 కోట్లు కేటాయించగా వచ్చే ఏడాది రూ.వెయ్యి కోట్లు ప్రతిపాదించి ఇంకేముంది రెట్టింపు స్థాయిలో నిధులు కేటాయించేశామని సర్కారు గొప్పలకు పోయింది. కానీ ఎన్నికల్లో టిడిపి మార్కెట్ ఇంటర్వెన్షన్‌కు ప్రత్యేకంగా రూ.5 వేల కోట్ల నిధి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. చివరి ఓటాన్ బడ్జెట్‌లో కూడా ఆ హామీ నెరవేర్చలేదు. ఆంధ్రప్రదేశ్‌ను కరువు, తుపాన్లు ప్రతి ఏడాదీ పట్టి పీడిస్తూ రైతులను, పంటలను నష్ట పరుస్తున్నాయి. అయితే వైపరీత్యాల సహాయ పునరావాస చర్యల అంశాన్ని బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదు.

వ్యవసాయరంగానికి కేటయింపులు (రూ. కోట్లలో)		
పథకం	2018-19 (అంచనాలు)	2019-20 (అంచనాలు)
అన్నదాత సుఖీభవ		5,000
మార్కెట్ ఇంటర్‌వెన్షన్ ఫండ్	500.00	1,000
విత్తన సరఫరా	220.00	300
యాంత్రీకరణ	258.17	300.17
లైవ్ స్టాక్ ఇన్సూరెన్స్	50.00	200.00
డిజిటల్ సాయిల్ మ్యాపింగ్, ఐటి	30.00	50.00
కరువు, ప్రకృతి వైపరీత్యాల నివారణ	100.00	200.00
ఉద్యానవన పంటలు	102.00	124.00
మత్స్య పరిశ్రమ	81.68	100.00



భారీ ఖర్చు... భారీగా లోటు

- ద్రవ్య లోటు 32,391 కోట్లు
- జీఎస్‌డిపి 10.67 లక్షల కోట్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ అంకెల గారడీగానే కనిపిస్తోంది. ప్రధానంగా అంచనాలకు మించిన వ్యయం, భారీగా పెరిగిపోయిన లోటు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 2018-19 ఆర్థిక సంవత్సరంలో చేయని ఖర్చులను కూడా చేసినట్లుగా చూపించి, కొత్త బడ్జెట్‌లో అంతకు మించిన ఖర్చును చూపించారు. ఆదాయ, ద్రవ్య లోటు కూడా పెరిగిపోయాయి. ఒక్కసారిగా జిఎస్‌డిపిని కూడా పది లక్షలు దాటి చూపించారు. కొనసాగుతున్న ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ మొత్తం కన్నా ఖర్చును ఐదు వేల కోట్లకు పైగా అధికంగా చేసినట్లు ప్రకటించారు. వాస్తవానికి అంత ఖర్చు జరగలేదని అధికారులే లోపాయికారీగా చెబుతుండడం విశేషం. అయినప్పటికీ కొత్త బడ్జెట్‌లో 2.26 లక్షల కోట్లను ఖర్చు చేసేందుకు ప్రతిపాదించడం గమనార్హం. ఇదే సమయంలో ఆదాయాన్ని కూడా ఎక్కువగా వచ్చినట్లు చూపించడం విశేషం. కేంద్రం నుంచి నిధులురావడం లేదని, రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం కూడా వంద శాతం రాలేదని ఇన్నాళ్లూ చెబుతూ వచ్చిన ప్రభుత్వం చివరిలో మాత్రం బడ్జెట్ ప్రతిపాదనకు మించిన ఆదాయం వచ్చినట్లు సవరణ బడ్జెట్‌లో చూపించారు. ఇలా ఉండగా, లోటు కూడా భారీగానే ఉంటుందని ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించింది. ద్రవ్య లోటు గత బడ్జెట్‌లో రూ.24,205 వేల కోట్లు ఉంటుందని ప్రతిపాదించగా తాజా బడ్జెట్‌లో రూ.32,390 కోట్లకు పెరుగుతుందని అంచనా వేశారు. ఇది ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపించే ప్రమాదం ఉంటుందని అధికారులు అంటున్నారు. అలాగే ఆదాయ లోటు కూడా 2018-19లో రూ.5,235 కోట్లు మిగులు ఉంటుందని ప్రతిపాదించారు, వార్షికాంతంలో రూ.2,494 కోట్ల రూపాయల లోటుగా ఖరారు చేశారు. అయితే తాజా బడ్జెట్‌లో కూడా రూ.2,099 కోట్ల లోటు ఉంటుందని అంచనా వేశారు. ఇలా అనేక రంగాల ఆదాయ, వ్యయాల్లో సవరణ అంచనాలు పెంచి చూపించడం ఆశ్చర్యంగా ఉందని కొందరు ఉన్నతాధికారులు వ్యాఖ్యానిస్తున్నారు.

పర్యావరణ, అటవీ శాఖకు రూ.491 కోట్లు

INDUSTRIAL & INFRASTRUCTURE

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో పర్యావరణ, అటవీ శాఖకు గతేడాది కంటే 6 శాతం తక్కువ నిధులను కేటాయించింది. గతేడాది ఈ శాఖకు రూ. 523.77 కోట్లు కేటాయించగా, ఈ సారి రూ.491.93 కోట్లకు తగ్గించింది. 2029 నాటికి రాష్ట్రంలో యాభై శాతం పచ్చదనం లక్ష్యాన్ని సాధించేందుకు, శాస్త్ర సాంకేతిక పరిశోధన మండలి (అప్‌కాస్ట్)తోపాటు, కాలుష్య నియంత్రణ మండలి, జీవ వైవిద్యం (బయో డైవర్శిటీ), ఎర్రచందనం పరిరక్షణ టాస్క్‌ఫోర్స్, అటవీశాఖ ప్రతిపాదించిన నగరవనాలు, అప్‌కాస్ట్ ప్రాంతీయ కార్యాలయాలు తదితర ప్రాజెక్టులకు కూడా ఈ కేటాయింపుల్లోనే వెచ్చించాల్సి ఉంటుంది.

ఎన్టీఆర్ వైద్య సేవ పరిమితి రూ.5 లక్షలకు పెంపు

HEALTH & FAMILY WELFARE

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైద్యఆరోగ్య శాఖకు ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.10,032.15 కోట్లు కేటాయించారు. గతేడాది కంటే ఈ సారి 18.53 శాతం ఈ శాఖకు కేటాయింపులు పెంచారు. ముఖ్యంగా ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉన్న పరిమితి ఏడాదికి రూ. 2.5 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచి, రెట్టింపు చేశారు. అయితే అందుకు తగినట్లుగా కేటాయింపులు లేవు. వైద్యసేవకు గతేడాది రూ.1000 కోట్లు కేటాయించగా, ఈ బడ్జెట్‌లో రూ.1200 కోట్లు కేటాయించారు. సేవల పరిమితి రెట్టింపు చేసినప్పటికీ కేటాయింపులు మాత్రం రెట్టింపు చేయలేదు.

విద్యకు తగ్గిన బడ్జెట్

గతేడాది 12.98, ఇప్పుడు 11.5 శాతం

SCHOOL EDUCATION

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యాశాఖకు మరోసారి కేటాయింపులు తగ్గాయి. 2018-19 విద్యా సంవత్సరానికి రూ.24,185.75 (12.66 శాతం) కోట్లు కేటాయించి రూ.20,619 (10.47 శాతం) కోట్లకు సవరించింది. 2019-20 సంవత్స రానికి రూ.29,955 కోట్లు (11.5 శాతం) కేటాయించింది. గత ఏడాది కేటాయించిన బడ్జెట్‌లో రూ.3,566 (2.19 శాతం) కోట్లు తగ్గించిన ప్రభుత్వం ఈ దఫా ఎంత కోత పెడుతుందో చూడాలి. సాంకేతిక విద్యకు 2018-19 విద్యా సంవత్సరానికి రూ.818 కోట్లు కేటాయించి రూ.802.89 కోట్లకు సవరించింది. 2019-20కు రూ.870.32 కోట్లు కేటాయించింది. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని కళాశాల విద్య, పాలిటెక్నిక్ కళాశాలలకూ విస్తరించ నున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఆహారంలో మాంసకృత్తుల విలువలను పెంచుతామని తెలిపింది.

మహిళా శిశు సంక్షేమ శాఖకు రూ.3408.66 కోట్లు

WOMEN & CHILD WELFARE

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ ఏడాది బడ్జెట్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖకు రూ.3408.66 కోట్లు కేటాయించారు. ఇది మొత్తం బడ్జెట్‌లో 1.50 శాతం. గతేడాది బడ్జెట్‌లో ఈ శాఖకు రూ. 3007.97 కోట్లు కేటాయించగా, మొత్తం బడ్జెట్‌లో 1.57 శాతం ఉంది. అంటే ఈ శాఖకు కేటాయింపులు గతేడాది కంటే పెరిగి నప్పటికీ మొత్తం బడ్జెట్ కేటాయింపుల్లో గతేడాది కంటే తక్కువ శాతమేనని స్పష్టమవుతోంది. వికలాంగుల కృత్రిమ అవయవాలకు రూ.70 కోట్లు, సఖి కేంద్రాలకు రూ.6.34 కోట్లు, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు రూ.2.97 కోట్లు, బేటీ బచావో బేటీ పడావో పథకానికి రూ.4 కోట్లు కేటాయించారు. స్వయం సహాయక బృందాలకు పసుపు కుంకుమ కింద గతేడాది రూ.1700 కోట్లు నుంచి ఈ సారి రూ.4000 కోట్లు, వడ్డీ లేని రుణాలకు రూ.1000 కోట్లు నుంచి రూ.1100 కోట్లు బడ్జెట్ అంచనాలు పెంచారు.

WELFARE PENSIONS

సంక్షేమ ఫెన్షన్లు (రూ. కోట్లలో)		
పథకం	2018-19	2019-20
వృద్ధులు, వితంతువులు	4200	10,401
వికలాంగులు	740	2,133
డప్పు కళాకారులు	12	108
ఎయిడ్స్ రోగులు	38	100
కల్లుగీత కార్మికులు	22	76

సంక్షేమ పథకాలకు ఇలా ... (రూ.కోట్లలో)		
పథకం	2018-19	2019-20
పసుపు కుంకుమ	1700	4000
బిసి కార్పొరేషన్లు	1337	3000
నిరుద్యోగయువతకు సాయం	1000	1200
వడ్డీ లేని రుణాలు	1000	1100
సంక్షేమం, అభివృద్ధికి		
ప్రత్యేక నిధి	500	800
చంద్రన్న బీమా	140	350
అన్న క్యాంటీన్లు	200	300
చేనేత కార్మికులకు సాయం	200	225
9,10 తరగతుల విద్యార్థులకు పౌష్టికాహారం	95	156
చంద్రన్న పెళ్ళికానుక (బిసి సంక్షేమం)	100	175
చంద్రన్న పెళ్లికానుక (సాంఘికసంక్షేమం)	100	128
దుల్హాన్ (మైనార్టీల పెళ్లికానుక)	80	100
చంద్రన్నపెళ్లికానుక (గిరిజన సంక్షేమం)	8	15
చంద్రన్న పెళ్లికానుక (వికలాంగులు)	8	10
ఎన్‌టిఆర్ విదేశీ విద్యాదరణ	68	100
క్రిష్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్	75	100
ఇమామ్స్, మౌజన్లకు ప్రోత్సహకాలు	75	100
బ్రాహ్మణ సంక్షేమం	75	100
వికలాంగులకు కృత్రిమ		
అవయవాలుఇతర ఉపకరణాలు	35	70
ఇంటర్ విద్యార్థులకు పౌష్టికాహారం	23	58
వైశ్య కార్పొరేషన్	30	50

రెండేళ్ల కేటాయింపులు ఖర్చుల్లో పొంతనలేని గణాంకాలు (రూ.కోట్లలో)			
సెక్టార్	2018-19 ప్రతిపాదన	2018-19 రివైజ్‌డ్	2019-20 ప్రతిపాదన
వ్యవసాయం	12,355	16,775	15,246
గ్రామీణాభివృద్ధి	20,815	29,033	32,288
నీటిపారుదల	16,978	14,862	16,852
పరిశ్రమలు	3,074	6,290	4,114
విద్య	24,185	20,619	25,591
క్రీడలు, యువత	1,635	1,110	1,471
సాంకేతిక విద్య	818	802	870
తాగునీరు	2,623	2,175	2,894
గృహ నిర్మాణం	3,679	3,810	4,079
పట్టణాభివృద్ధి	7,740	7,934	7,979
సంక్షేమం	13,722	12,047	16,412
సామాజిక భద్రత	3,029	2,245	3,429

విద్యామండలి ఒంటరి పోరాటం

బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్సిటీలోని అధ్యాపక పోస్టులపై ఉన్న కేసులపై రాష్ట్రఉన్నత విద్యామండలి ఒంటరి పోరాటం చేస్తోందని పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ వి బాలసుబ్రహ్మణ్యం అన్నారు. శాశ్వత ప్రాతిపదికపై ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో లెక్చరర్లను నియమించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏంటని సభ్యులు ఎఎస్ రామకృష్ణ మంత్రి గంటాను అడిగారు. ఈ సందర్భంగా బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కోర్టు కేసుల పరిష్కారానికి రాష్ట్రప్రభుత్వం మండలికి మద్దతు ఇవ్వడం లేదని విమర్శించారు. కోర్టు కేసులు ఉన్నాయనే పేరుతో రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. వర్సిటీలోని పోస్టుల భర్తీకి మధ్యప్రదేశ్ ఆలస్యంగా నోటిఫికేషన్ ఇచ్చి ముందుగా భర్తీ చేసిందని అన్నారు. కోర్టు కేసులు అక్కడ ఉన్నా ఎదుర్కొనే యంత్రాంగం ఉండటం వల్ల భర్తీ ప్రక్రియ ముగిసిందన్నారు. కేసులను ఎదుర్కొనే యంత్రాంతం రాష్ట్రంలో లేదన్నారు. టిడిపి ఎమ్మెల్సీ శమంతకమణి మాట్లాడుతూ ఎస్‌కెయు యూనివర్సిటీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ కింద 64 పోస్టులు ఎస్సిలకు వచ్చాయని, అందరూ దళితులనే అక్కసుతో దీనిపై కోర్టుకు వెళ్లారని తెలిపారు.

గృహనిర్మాణానికి అరకొరే!

- మంజూరు చేసిన ఇళ్లు పూర్తి చేసేందుకు
- రూ.23,395 కోట్లు అవసరం
- కేటాయించింది రూ.4,079.11 కోట్లే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 2022 నాటికి అందరికీ ఇళ్లు నినాదం ఇస్తున్న ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణానికి బడ్జెట్ కేటాయింపుల్లో ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఈ ఏడాది నాలుగు లక్షల ఇళ్లు మంజూరు చేసిన ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులను అరకొరగానే పెంచింది. ఈ ఏడాది బడ్జెట్‌లో గృహనిర్మాణానికి ప్రభుత్వం రూ.4,079.11 కోట్లు కేటాయించింది. ఒటాన్ అకౌంట్ ప్రకారం జూన్ వరకూ కేటాయించిన మొత్తం రూ.1,359.70 కోట్లు. గత ఏడాది ఈ మొత్తం రూ.3,679.53గా ఉంది. సవరించిన అంచనా రూ.3,810.87 కోట్లు, పెంపు కేవలం రూ.399,58 కోట్లు మాత్రమే. వివిధ గృహ నిర్మాణ పథకాల్లో రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఇప్పటి వరకూ 20.18 లక్షల ఇళు మంజూరు చేయగా పూర్తి చేసింది. ఇందుకు రూ.34,632.48 కోట్లు ఖర్చవుతుందని గృహనిర్మాణ శాఖ అంచనా వేసింది. ఇప్పటి వరకూ 7,63,585 ఇళ్లను పూర్తి చేసిన అబ్ధిదారులకు రూ.11,236.72 కోట్లు చెల్లించింది. ఈ మొత్తంలో గృహనిర్మాణ శాఖ రూ.9,348.68 కోట్లు, ఉపాధి పథకం నుంచి రూ.1,888.64 కోట్లు ఉన్నాయి. ఇప్పటికీ పూర్తి చేయాల్సిన ఇళ్లు 12,54,805 ఉండగా వీటి నిర్మాణానికి రూ.23,395.76 కోట్లు వ్యయం అవుతోందని అంచనా. ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ వ్యయం అవుతున్న మొత్తంలో కేవలం 17 శాతం మాత్రమే ఉంది. గత ఏడాది 2,88.871ఇళ్లను నిర్మించిగా రూ.3,810.87 కోట్లు ఖర్చవుతుందని బడ్జెట్ అంచనాలను సవరించిన ప్రభుత్వం ఈ ఏడాది కొత్తగా 4 లక్షల ఇళ్లు మంజూరు చేయడంతోపాటు, గత మూడేళ్లుగా వివిధ దశల్లో ఉన్న ఇళ్లను పూర్తి చేయాల్సి ఉంది. ఇందుకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ఎటూ చాలని పరిస్థితి ఏర్పడనుంది. ఎన్నికల కారణంగా ఆగమేఘాల మీద కొత్తగా ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేసి చేతులు దులుపుకుందని విమర్శలు వినిపిస్తున్నాయి.

గిరిజన యూనివర్సిటీపై వివక్షత

- పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించాలి
- మండలిలో ఎమ్మెల్సీలు డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గిరిజనులపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని, అందుకే గిరిజన యూనివర్సిటీ బిల్లును పార్లమెంట్‌లో పెట్టడం లేదని పలువురు శాసన మండలి సభ్యులు మంగళవారం విమర్శించారు. రాష్ట్రంలో గిరిజన విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేయడంలో అసాధారణ జాప్యం జరుగుతున్న విషయం వాస్తవమేనా అని టిడిపి శాసన మండలి సభ్యులు జి సంధ్యారాణి శాసనమండలి ప్రశ్నోత్తరాలలో మానవ వనరుల అభివృద్ధి శాఖమంత్రి గంటా శ్రీనివాసరావును అడిగారు. గిరిజన వర్సిటీ కలగానే మిగిలిపోతుందని, ఐదేళ్ల నుంచి నిర్మించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రహరీ గోడ నిర్మాణం కోసం కేవలం రూ.5కోట్లను కేంద్రప్రభుత్వం కేటాయించి చేతులు దులుపుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటాయించిన నిధులను ఖర్చు చేస్తే గిరిజన యూనివర్సిటీకి కేంద్రం నిధులు విడుదల చేస్తుందని బిజెపి సభ్యులు సోము వీర్రాజు అన్నారు.

ప్రజలను మభ్య పెట్టే బడ్జెట్

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

టిడిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన చివరి బడ్జెట్ అంకెల గారడిలా, ఎన్నికల జిమ్మిక్కులతో ప్రజలను మోసం చేసేలా ఉందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు అన్నారు. వాస్తవ ఆదాయానికి, ప్రకటించిన కేటాయింపులకు సంబంధం లేకుండా రూ.2.26 లక్షల కోట్ల బడ్జెట్ పెట్టామని గొప్పలు చెబుతున్నారని అన్నారు. రూ.40 వేల కోట్ల లోటు ఉన్న పరిస్థితిల్లో ఎక్కడి నుంచి నిధులు తెచ్చి లోటు పూడ్చుతారని ప్రశ్నించారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన చివరి బడ్జెట్‌పై మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రూ.32 వేల కోట్లు దళితుల సంక్షేమానికి మూడేళ్లలో ఖర్చు పెట్టామని గొప్పలు చెబుతోందన్నారు. నిజానికి సబ్‌ప్లాన్ నిధులు ప్రభుత్వం ఆర్భాట ప్రచారాలకు 3 నెలల్లో రూ. 30 కోట్లు ఖర్చు చేశారన్నారు. 16 శాతం దళితుల జనాభా నిష్పత్తి ప్రకారం ఎస్సీ సబ్‌ప్లాన్ రూ. 32 వేల కోట్లు కేటాయించాల్సి ఉందన్నారు. కేటాయించింది మాత్రం రూ. 14 వేల కోట్లు అన్నారు. రైతులకు 4, 5 విడతల రుణమాఫీ చెల్లించలేదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తాయిలాలతో ప్రజలను ఆకట్టుకోవాలని చూస్తోందని విమర్శించారు. సింగపూర్, మలేసియా విదేశీ పెట్టుబడుల కోసం ముఖ్యమంత్రి తిరుగుతున్నారు తప్ప వెనుకబడిన ప్రాంతాలు, ప్రజల సమస్యలను పట్టించుకోలేదన్నారు. వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చే చెక్కులను చూసి ఓట్లు వేస్తారని ప్రభుత్వం భ్రమ పడితే భ్రమగానే మిగులుతుందన్నారు. సిపిఎస్ రద్దు చేస్తామని ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. పాత పెన్షన్ అమలు చేయాలని ఉపాధ్యాయులు నిరసన తెలియ జేస్తుంటే అరెస్టులు చేస్తూ ఉద్యమాలను అణచి వేస్తోందన్నారు. కియా పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. సిపిఎం ఉత్తర, దక్షిణ ప్రాంత జిల్లా కార్యదర్శులు రాంభూపాల్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

సంపాదకీయం

దొందూ దొందే

శారదా చిట్ ఫండ్ కుంభకోణంపై దర్యాప్తునకు సంబంధించి బిజెపి, తృణమూల్ కాంగ్రెస్ మధ్య రగడ ఈ రెండు పార్టీల దుష్ట రాజకీయాలకు పరాకాష్ట. బెంగాల్, అస్సాం, త్రిపుర, ఒడిషా రాష్ట్రాలకు చెందిన 17.4 లక్షల మంది చిన్న మదుపరులకు చెందిన మూడు వేల కోట్ల సొమ్మును మింగేసిన అక్రమార్కుల భరతం పట్టాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిని కాపాడేందుకు ప్రయత్నించడం సిగ్గు చేటు. అర్ధ పుష్కర కాలం గడిచినా బాధితులకు ఇంతవరకు న్యాయం దక్కలేదు. దీనికి ఈ రెండు పార్టీలదే బాధ్యత. కుంభకోణంలో కీలక పాత్రధారులు ఇద్దరు బిజెపిలోకి ఫిరాయించడంతో తిలా పాపం తలా పిడికెడు అన్న రీతిలో ఈ రెండు పార్టీలకు శారదా పాపంలో వాటా వుంది. అందుకే ఈ స్కామ్‌పై దర్యాప్తును నీరుగార్చేందుకు రెండు పార్టీలు శత విధాలా ప్రయత్నిస్తున్నాయి. శారద, రోజా వ్యాలీ, కుంభకోణాల్లో దోషులను కాపాడుతున్న బిజెపి, తృణమూల్ పార్టీలకు చరమ గీతం పాడాలని ఆదివారం కొల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ మైదానంలో నిర్వహించిన వామపక్షాల ర్యాలీకి హాజరైన అశేష జనవాహిని గర్జించడంతో అవి ఉలిక్కిపడ్డాయి. దీని నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఆదివారం రాత్రి హై డ్రామాకు తెర తీశాయి.. సుప్రీం కోర్టు పదే పదే ఆదేశించినప్పటికీ గత అయిదేళ్లలో దర్యాప్తు ఒక్క అడుగు కూడా ముందుకు సాగకుండా తొక్కిపెట్టిన మోడీ సర్కార్ అప్పటికప్పుడు కొల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్‌పైకి సిబిఐ అధికారులను ఉసిగొల్పారు. ఆ తరువాత గొలుసుకట్టుగా జరిగిన పరిణామాలు బెంగాల్ రాజకీయాలను సంక్షుభితం చేశాయి. ఈ మొత్తం వివాదంలో ప్రజాస్వామ్య పరిరక్షకురాలిగా తృణమూల్ అధినేత్రి ప్రకటించుకోగా, మరో వైపు దేశ ప్రయోజనాల కోసమే సిబిఐ దర్యాప్తును వేగవంతం చేస్తున్నట్లు కేంద్రంలోని మోడీ సర్కార్ ప్రకటించుకుంది. నిజానికి ఈ కేసును సమాధి చేయడంలో రెండు పార్టీలు శక్తివంచనలేకుండా ప్రయత్నిస్తున్నాయి. అవినీతిపై పోరాడుతున్నట్లు పోజుపెడుతున్న బిజెపి నిజానికి అవినీతికి చిరునామాగా మారింది. స్వాతంత్ర్యానంతర భారత దేశ చరిత్రలోనే అతి పెద్దదైన రాఫెల్ కుంభకోణంలో అది పీకల్లోతున కూరుకుపోయింది. సాక్షాత్తూ ప్రధాని మోడీనే ఇందులో భాగస్వామి. అత్యున్నత స్థానంలో వున్న వ్యక్తులకు ప్రమేయం ఉన్నందున సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి)తో దీనిపై విచారణ జరిపించాలని ప్రతిపక్షాలు చేసిన డిమాండ్‌ను బిజెపి పెడచెవినపెట్టింది. జిఎస్‌పిసిఎల్, వ్యాపం, సహారా, బిర్లా డైరీలు, నీరవ్ మోడీ, మైనింగ్ స్కామ్‌లను చాలావరకు బిజెపి తొక్కిపట్టింది. శారద స్కామ్ మకిలి అంటుకున్న ఇద్దరు తృణమూల్ ఎంపీలు ముకుల్ రాయ్, హేమంత్ శర్మలను పార్టీలో చేర్చుకుని, ఈ కేసు నుంచి వారిని బయటపడేసేందుకు యత్నిస్తున్నది. అటువంటి మోడీ సర్కార్ అవినీతిపై పోరాడుతున్నానంటే నమ్మడానికి ఎవరూ సిద్ధంగా లేరు. అవినీతిపై పోరాటం ముసుగులో రాజకీయ ప్రత్యర్థులపైన, రాష్ట్రాల్లోని బిజెపియేతర ప్రభుత్వాలపైన సిబిఐని ఉసిగొలిపి రాజకీయ కక్షసాధింపు చర్యలకు పూనుకుంటున్నది. శారద స్కామ్‌పై దర్యాప్తును అయిదేళ్లుఅడ్డుకుంటూ వచ్చిన మోడీ ప్రభుత్వానికి ఇప్పుడే ఇది గుర్తుకురావడం ఆశ్చర్యంగా వుంది.

బెంగాల్‌లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన మమత సర్కార్ ప్రజాస్వామ్య పరిరక్షకురాలిగా పోజు పెట్టడమే విడ్డూరం. శారద కుంభకోణంలో దోషులను వెనకేసుకొస్తున్న మమత దీనినుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కేంద్ర, రాష్ట్ర సంబంధాల సమస్యగా దీనిని చిత్రీకరించే ప్రయత్నం చేశారు. మమత ప్రతిపక్షంలో ఉండగా కేంద్రం ఆర్టికల్ 356ను ప్రయోగించి బెంగాల్‌లో వామపక్ష సంఘటన ప్రభుత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేయని రోజు లేదు. అధికారంలోకి వచ్చాక వందలాది మంది వామపక్షాల కార్యకర్తలను తృణమూల్ గూండాలు పొట్టన పెట్టుకున్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రత్యర్థులను పోటీ చేయకుండా దాడులు, దౌర్జన్యాలు యథేచ్ఛగా సాగించారు. అటువంటి వ్యక్తి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడడం హాస్యాస్పదం. మంగళవారం నాడు సుప్రీం వెలువరించిన తీర్పులో కొల్‌కతా పోలీస్ కమిషనర్‌ను బెంగాల్ వెలుపల తటస్థ ప్రదేశంలో విచారించాలని, అరెస్టు వంటి నిర్బంధ చర్యలు చేపట్టరాదని సుప్రీం కేంద్ర దర్యాప్తు సంస్థను ఆదేశించింది. అదే సమయంలో శారద కుంభకోణంపై దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని కొల్‌కతా పోలీస్ కమిషనర్‌నూ ఆదేశించింది. విచిత్రంగా బిజెపి, తృణమూల్ కాంగ్రెస్ రెండూ ఇది తమకు లభించిన విజయంగా ప్రకటించుకున్నాయి. నిజానికి శారద స్కామ్‌పై దర్యాప్తును జాప్యం చేయడంలో దొందూ దొందే. ఇప్పటికైనా ఈ కుత్సిత రాజకీయాలకు స్వస్తి పలికి శారదా స్కామ్‌లో దోషులను కఠినంగా శిక్షించాలి. ప్రజల ఆస్తులను లూటీ చేసిన అక్రమార్కుల ఆస్తులను జప్తు చేయాలి. ఈ పని చేసేందుకు బిజెపి, తృణమూల్ సిద్ధపడకుండా ఏం చెప్పినా ప్రజలు విశ్వసించరు.

ఇదీ విషయం



నాది శ్రమైక జీవన సౌందర్య గీతం
మతానికి దోపిడీ, పదానికి పల్లవినీ కాను నేను
బొట్టు బొట్టుగా నా నెత్తుటిని
ఈ నేల విముక్తి కోసం విత్తనంగా చల్లుతాను
బందీనైనా బానిసను కాను
నన్ను కదిపినా ఖండించినా
మళ్లీ మళ్లీ అలలా పుట్టుకొస్తూనే వుంటాను


- చెరబండరాజు

ప్రజా సమస్యలు పరిష్కరించలేని పియూష్ బడ్జెట్

విశ్లేషణ

ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతుకు ఎంత నష్టం జరిగినా 10 శాతం మాత్రమే కేంద్రం ఇస్తున్నది. నాణ్యత లేని ఉపకరణాల వల్ల రైతులు వేల కోట్ల రూపాయల విలువ చేసే పంటలను నష్టపోతున్నారు. ఫలితంగా ఏటా రుణ భారం పెరిగి 12,600 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రైతు రుణ మాఫీ కమిషన్ ఏర్పరచాలని, ఉత్పత్తి ధరపై 50 శాతం ధరలు నిర్ణయించాలన్న చట్టాలు చేయాలని రైతులు అన్ని రాష్ట్రాలలో లక్షల సంఖ్యలో గత రెండు సంవత్సరాలుగా ఆందోళనలు కొనసాగిస్తున్నారు. వాటిని ఆమోదించకుండా కేంద్రం రూ. 6 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది.





సారంపల్లి మల్లారెడ్డి

2019-20 సంవత్సరానికి రూ. 27,84,199 కోట్లతో ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశ పెడుతూ... దేశంలోని 12 కోట్ల మంది 5 ఎకరాల లోపు రైతులకు, 18 కోట్ల ఉద్యోగ, కార్మిక కుటుంబాలకు పెన్షన్ పెంపు ద్వారా అదనపు ఆదాయం కల్పిస్తామని ఆర్థిక మంత్రి పియూష్ గోయల్ ప్రకటించారు. ఈ బడ్జెట్‌ని మంత్రి వర్గం ఆమోదించింది. బడ్జెట్‌ను స్థూలంగా పరిశీలిస్తే ప్రభుత్వ ఆశయాలు నెరవేరుతాయా? అన్న సందేహం కలుగుతోంది. ముఖ్యంగా వ్యవసాయ రంగానికి కేంద్ర పథకాల కింద రూ.1,12,900 కోట్లు కేటాయించారు. అలాగే రాష్ట్రాలకు మరో రూ. 16,112 కోట్లు కేటాయించారు. మొత్తంగా రూ.1,29,012 కోట్లు వ్యవసాయ కేటాయింపుగా చూపారు. స్వాతంత్ర్యం అనంతరం ఇంత పెద్ద బడ్జెట్ ఎప్పుడూ లేదు. గతంలో 1.9 శాతం మాత్రమే కాగా నేడు 4.7 శాతం కేటాయించారు. ఈ కేటాయింపులో రూ. 75,000 కోట్లు రైతు ఆదాయ మద్దతు పథకం కింద చూపారు. 12 కోట్లు మంది 5 ఎకరాల లోపు రైతుల కుటుంబాలకు రూ. 6 వేల చొప్పున మూడు విడతలుగా ఇస్తారు. రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం ఈ సహాయంతో నెరవేరుతుందా? వాస్తవానికి 2018 ఏప్రిల్ 7న ప్రధాని ప్రకటించిన మద్దతు ధరలు మార్కెట్‌లో అమలు కావడం లేదు. ధాన్యం, పత్తి, పప్పుధాన్యాలు, మొక్కజొన్నలు, సోయా పంటలకు నిర్ణయించిన ధరలకన్నా క్వింటాల్‌కు రూ. 200-300 తక్కువకు ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దేశంలో రైతులు ఏటా రూ.2 లక్షల కోట్లు నష్ట పోతున్నారు. తెలుగు రాష్ట్రాలలో రూ.16,300 కోట్లు నష్టపోతున్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏటా 13 రాష్ట్రాలలో 8 కోట్ల ఎకరాల పంటలకు నష్టం వాటిల్లుతున్నది. ఇందుకు 14వ ఆర్థిక కమిషన్ సిఫారసుల ప్రకారం ఇస్తున్న నిధులు కూడా అందడం లేదు. రైతుకు ఎంత నష్టం జరిగినా 10 శాతం మాత్రమే కేంద్రం ఇస్తున్నది. నాణ్యత లేని ఉపకరణాల వల్ల రైతులు వేల కోట్ల రూపాయల విలువ చేసే పంటలను నష్టపోతున్నారు. ఫలితంగా ఏటా రుణ భారం పెరిగి 12,600 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రైతు రుణ మాఫీ కమిషన్ ఏర్పరచాలని, ఉత్పత్తి ధరపై 50 శాతం ధరలు నిర్ణయించాలన్న చట్టాలు చేయాలని రైతులు అన్ని రాష్ట్రాలలో లక్షల సంఖ్యలో గత రెండు సంవత్సరాలుగా ఆందోళనలు కొనసాగిస్తు న్నారు. ముసాయిదా బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. వాటిని ఆమోదించకుండా కేంద్రం రూ. 6 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది.

ప్రాథమిక రంగమైన వ్యవసాయంపై నేటికీ భూమి కలిగిన వారు 52 శాతం, భూమి లేనివారు 20 శాతం మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి ఉన్నారు. నేడు వీరు ఉపాధి కోల్పోయి వలసల బాట పడుతున్నారు. వలస వెళ్ళిన వారిలో అనేక మంది తిరిగి రాకుండా ప్రాణాలు కోల్పోతున్నారు. దేశంలో 40 శాతం ప్రజలు పౌష్టికాహారం లోపం వల్ల రక్తహీనతతో మరణిస్తున్నారు. అయినా దేశం అభివృద్ధి పథంలో ఉన్నట్లు చెప్పడం హాస్యాస్పదం. ప్రస్తుత బడ్జెట్‌లో లక్ష కోట్లతో 12 కోట్ల రైతు కుటుంబాలకు, 10 కోట్ల అసంఘటిత రంగ కార్మికులకు మరో 10 కోట్ల ఉద్యోగులకు లాభదాయక ఆదాయాలు కల్పిస్తామని చెప్పడం విడ్డూరం. ఉత్పత్తి రంగాన్ని నిర్లక్ష్యం చేసి దిగుమతులపై ఆధారపడే స్థితికి దేశాన్ని తెచ్చారు. వంటనూనెలు, పప్పులు, పంచదార, పత్తి, మాంసం దిగుమతులకు ఏటా రూ. 2 లక్షల కోట్లు వ్యయం చేస్తున్నాం. ఉత్పత్తితో పాటు ఉత్పాదకతను దెబ్బ తీసేవిధంగా పరిశోధనల కేటాయింపులను తగ్గించివేశారు. ధనిక దేశాల నుండి టెక్నాలజీని కూడా దిగుమతి చేసుకుంటున్నాము. ఇతర దేశాల టెక్నాలజీ మన వాతావరణానికి సరిపడక పంటలు దెబ్బ తిని వేల కోట్లలో రైతులు నష్టాల పాలవుతున్నారు. ఉత్పత్తి, ఉత్పాదకత దెబ్బతింటున్నాయి.

ఆవులను రక్షించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతూ 'రాష్ట్రీయ గోకుల్ మిషన్' కింద రూ.750 కోట్లు కేటాయించి వారికి 2 శాతం వడ్డీని మాఫీ చేస్తామని, సకాలంలో చెల్లిస్తే మరో 3 శాతం వడ్డీ మాఫీ చేస్తామని చెప్పారు. 1.5 కోట్ల మందికి ఈ పథకం లబ్ధి చేకూరుస్తుందా? ఉపాధి హామీ పథకానికి రూ.55 వేల కోట్లు నుండి రూ.60 వేల కోట్లకు పెంచారు. పై పథకాల ద్వారా 30 కోట్ల కుటుంబాలకు లబ్ధిని చేకూరుస్తామని పార్లమెంట్‌లో ప్రకటించారు. పై పథకాలు ఆదాయాన్ని పెంచుతాయని ఎవరూ విశ్వసించరు. ఎందుకంటే వాటి నిర్వహణ అలా వుంది. ప్రకృతి వైపరీత్యాల బారిన పడిన రైతులు, ఉత్పత్తులకు ధరలు లేక తీవ్రంగా నష్టపోతున్నారు. ఇవేవీ బడ్జెట్‌లో ప్రస్తావించలేదు.

నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారానికి వచ్చిన గత 4 సంవత్సరాల కాలంలో (2014-18) రూ.1,94,647 కోట్ల ప్రభుత్వ ఆస్తులను అమ్మింది. 2018-19కి రూ. 80 వేల కోట్లు లక్ష్యంగా పెట్టుకొని ఇప్పటికే రూ.35,100 కోట్ల ఆస్తులు అమ్మారు. మరో రెండు మాసాలలో మిగిలిన రూ.44 వేల కోట్ల ఆస్తులు అమ్ముతామని, 2019-20లో 35 ప్రభుత్వ సంస్థలను అమ్మడం ద్వారా రూ. 90 వేల కోట్లు ఆర్జిస్తామని ఆర్థికమంత్రి ప్రకటించారు. మొత్తం 57 ప్రభుత్వ సంస్థలను స్టాక్ మార్కెట్‌లో పెట్టారు. వీటి విలువ రూ.13 లక్షల కోట్లుగా ఉంది. వీటిని కూడా రానున్న కాలంలో అమ్ముతారు. ఇంతేకాక గత నాలుగు సంవత్సరాలలో (2014-17 క్యాలెండర్ సంవత్సరంలో) ప్రభుత్వం రూ.3,78,148 కోట్ల రుణం చేసింది. 2018, 2019లో మరో 1.5 కోట్ల రుణం చేయబోతున్నారు. ఈ రుణంపై 2019-20 బడ్జెట్‌లో రూ.6,65,061 కోట్లు వడ్డీ చెల్లింపు చూపారు. మొత్తం బడ్జెట్‌లో 23.8 శాతం వడ్డీలకే పోతుంది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఈ విధంగా ఆస్తుల అమ్మకానికి, రుణం తేవడానికి చేసిన ప్రయత్నం తప్ప మరోటి కాదు.

విద్య, వైద్య రంగాల అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వలేదు. నేటికీ అక్షరాస్యత 74 శాతం దాటలేదు. వామపక్ష ప్రభుత్వాలు కేరళ, బెంగాల్, త్రిపురలో సాధించిన అక్షరాస్యతను మినహాయిస్తే దేశం 68 శాతానికి తగ్గుతుంది. పాఠశాల విద్యకు గత సంవత్సరంపై 6 వేల కోట్లు (రూ.56,386), ఉన్నత విద్యపై 4 వేల కోట్లు (రూ.37,461) అదనంగా కేటాయించారు. రూపాయి విలువ తగ్గింపును బట్టి చూస్తే ఇది పెంపుదల కాదు. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమానికి 18-19 బడ్జెట్‌పై 7 వేల కోట్లు (రూ.61,398) అదనంగా కేటాయించారు. నేటికీ మలేరియా, టి.బి వ్యాధులతో వేలాదిమంది ఏటా మరణిస్తున్నారు. ప్రభుత్వ దవాఖానాలు మూతపడుతున్నాయి. 'కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ' నివేదిక ప్రకారం 61,333 పరిశ్రమలను మూసివేశారు. 8 లక్షల మంది నిరుద్యోగులైనారు. ఏటా కోటి ఉద్యోగాలు కల్పిస్తామన్న ప్రభుత్వం ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టినట్లు ఆక్స్‌ఫామ్ నివేదిక వెల్లడిస్తున్నది. అన్ని రంగాలలో కలిపి ప్రస్తుతం 31 శాతం నిరుద్యోగం కొనసాగుతున్నది. 10 కోట్లమంది అసంఘటిత కార్మికులకు 60 సంవత్సరాల తరువాత నెలకు 3 వేల పెన్షన్ ఇస్తామని బడ్జెట్‌లో చెప్పారు. కాని వారు 25 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వరకు నెలకు 100 రూపాయలు ప్రభుత్వానికి డిపాజిట్ చేయాలి. చివరికి గూడు కరువైన వారికి ఇళ్ల నిర్మాణానికి తగిన నిధులు లేవు. 2006లో ప్రారంభమైన 'ఇందిరమ్మ ఇళ్ల' నిర్మాణాలు ఇంకా కొనసాగుతూనే వున్నాయి. కూడు, గూడు, ఉపాధికి కరువైన వారి సంఖ్య దేశంలో దినదినం పెరుగుతున్నది. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక సంస్కరణల విధానాల ఫలితంగా బిలియనీర్ల సంఖ్యతో పాటు వారి అస్తులు కూడా పెరుగుతున్నాయి. 70 సంవత్సరాల తరువాత కూడా దేశంలో దారిద్ర్యం పెరుగుతున్నది. రంగరాజన్ కమిషన్ చెప్పిన ప్రకారం దేశంలో 29 కోట్ల మంది ప్రజలు దారిద్ర్యంలో ఉన్నారు. అయినా 2025 నాటికి ఆర్థికంగా ప్రపంచంలో 3వ దేశంగా భారత్ నిలుస్తుందని చెప్పడం విస్మయాన్ని కలిగిస్తున్నది. ఈ బడ్జెట్ పేదలకు భ్రమలు పెంచడమే తప్ప సమస్యలను పరిష్కరించదు.

2019-20లో 35 ప్రభుత్వ సంస్థలను అమ్మడం ద్వారా రూ. 90 వేల కోట్లు ఆర్జిస్తామని ఆర్థికమంత్రి ప్రకటించారు. మొత్తం 57 ప్రభుత్వ సంస్థలను స్టాక్ మార్కెట్‌లో పెట్టారు. వీటిని కూడా రానున్న కాలంలో అమ్ముతారు. 2018, 2019లో మరో 1.5 కోట్ల రుణం చేయబోతున్నారు. ఈ రుణంపై 2019-20 బడ్జెట్‌లో రూ.6,65,061 కోట్లు వడ్డీ చెల్లింపు చూపారు. మొత్తం బడ్జెట్‌లో 23.8 శాతం వడ్డీలకే పోతుంది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఈ విధంగా ఆస్తుల అమ్మకానికి, రుణం తేవడానికి చేసిన ప్రయత్నం తప్ప మరోటి కాదు.

(రచయిత సెల్ : 9490098666)

ఇంటర్వ్యూ

అవన్నీ పురాణ కల్పనలు.. పరీక్షకు నిలబడనివే...



'మహాభారత కాలంలోనే ఇంటర్నెట్ వుంది. ప్లాస్టిక్ సర్జరీ జరిగిందనడానికి వినాయకుడే సాక్షి' వంటి విపరీత వాదనలు చూస్తున్నాం. వింటున్నాం. చదువుతున్నాం. భారతీయ శాస్త్ర విజ్ఞానం ఆ కాలంలోనే వెల్లివిరిసిందని కూడా సదరు కుహనా మేధావులు ఉటంకించడం ఇంటర్నెట్‌లో కావాల్సినంత వినోదాన్ని, హాస్యాన్ని సృష్టిస్తోంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మొదలుకొని త్రిపుర బిజెపి ముఖ్యమంత్రి విప్లవ దేవ్ వరకు అనేక మంది అబద్ధాలను ప్రచారం చేసే పనిలో వున్నారు. నిర్మొహమాటంగా చెప్పాలంటే అవన్నీ అర్థం లేనివని, కాల్పనిక విజ్ఞానమని, ఎలాంటి శాస్త్రీయ పరీక్షకు నిలబడనివని రసాయన శాస్త్రంలో నోబెల్ పురస్కారం అందుకున్న భారత సంతతికి చెందిన వెంకీ రామకృష్ణన్ ఇటీవల ఎన్‌డిటివిలో ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. 'జీన్ మెషీన్' గ్రంథ రచయిత కూడా అయిన వెంకీ చెప్పిన కొన్ని ముఖ్యాంశాలు...

'భారతీయ ఇతిహాసం మహాభారతంలో గాంధారి 100 మంది కౌరవులకు జన్మనివ్వడం టెస్టుట్యూబ్ బేబీలకు ఉదాహరణ'గా ఆంధ్రా విశ్వవిద్యాలయం ఉపకులపతి నాగేశ్వరరావు పేర్కొన్నారు. దీనికి మీరేమంటారు?

ఇది పూర్తిగా అర్థం లేని విషయం. అటువంటి కథలను కల్పితాలుగా మాత్రమే చూడాలి. వాస్తవికంగా తీసుకోకూడదు. సైన్స్ అంటే మీరు ప్రతిపాదించిన అంశాన్ని పరీక్షించేదిగా వుండాలి. ప్రయోగం చేయగలగాలి. ప్రయోగం తాలూకు సాక్ష్యాన్ని చూపించాలి. దాన్ని చూపించడమే కాదు, ఆ రంగానికి సంబంధించిన నిపుణులు చదివి తాము కూడా మరోసారి చేయగలిగే విధంగా వుండాలి. ఐవిఎఫ్ గురించి, టెస్టుట్యూబ్ బేబీల గురించి ఆ రోజుల్లోనే వున్నట్టు మాట్లాడుతున్నారు. అయితే అలా మాట్లాడేవారు ఇప్పుడు మనం పుట్టకనిస్తున్న టెస్ట్‌ట్యూబ్ బేబీలను అనాటి పద్ధతుల ప్రకారం ఎలా ఉత్పత్తి చేయవచ్చో వివరంగా ఇవ్వాల్సి వుంటుంది. అప్పుడే అది సైన్స్ అవుతుంది. కానిపక్షంలో అది సైన్స్ కాదు.

గాలిలో ఎగిరే యంత్రాలకు సంబంధించి కూడా అప్పట్లో ఎన్నో స్వైర కల్పనలు చేశారు. కాని విమానానికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన నిర్మాణ నమూనాలు, సూచనలు అవేవీ లేకుండా అది సైన్స్ కాబోదు. సైన్స్ ఒక ప్రయోగం. ఇతరులు ఎవరైనా దాన్ని తిరిగి ఉత్పత్తి చేయగలిగేలా వుండాలి. సైన్స్‌ని, కాల్పనిక విజ్ఞానాన్ని వేరు చేసేది ఈ ప్రాథమిక సూత్రమే.

మహాభారతంలో కర్ణుడు బీజ కణ మార్పిడి ద్వారా పుట్టాడని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇటీవల ప్రస్తావించారు...

కణానికి సంబంధించిన భావన 1600 సంవత్సరం వరకు ఉనికిలో లేదు. ఎందుకంటే అందుకు తగిన సాంకేతిక పరిజ్ఞానం అప్పటి వరకు మనకు అందుబాటులో లేదు. అసలు ఒక కణాన్ని చూసేందుకు కావాల్సిన శక్తివంతమైన మైక్రోస్కోప్ కూడా అప్పటికి లేదు. అలాంటిది ఎన్నో వేల సంవత్సరాల కిందటే కణాల గురించి ఎవరికైనా తెలుసని చెబుతుంటే బుర్ర తిరిగిపోతుంది.

మహాభారతం కాలంలోనే ఇంటర్నెట్ వుందని త్రిపుర బిజెపి ముఖ్యమంత్రి విప్లవదేవ్ అంటున్నారు...

ఒకవేళ అలాంటిది వుండి వుంటే...శాటిలైట్ టెక్నాలజీకి ఆధారమైన న్యూటన్ చలన సూత్రం వంటి అతి మౌలికాంశాల గురించైనా ఎవరూ ఎందుకు చెప్పలేదు? ఈ మొత్తం సాంకేతిక వ్యవహారం 1800 లేదా 19వ శతాబ్దం వరకు నిజంగా అర్థమయ్యేదే కాదు. కనుక ఏవో కొన్ని ఘటనల వర్ణనలను బట్టి అప్పటికే అవి వున్నాయనుకోవడం సరికాదు. అంతమాత్రానే అవి నిజమై పోవు. ఒకవేళ వారు విద్యుత్ అంటే ఏంటి? ఎలా ఉత్పత్తి చేయవచ్చు? ఇంటర్నెట్‌ని, కంప్యూటర్లను ఎలా రూపొందించవచ్చు? వంటి వివరాలను చెప్పివుంటే అది వేరే సంగతి. ఎందుకంటే ఇంటర్నెట్ కంప్యూటర్ మీద ఆధారపడుతుందని, కంప్యూర్ ట్రాన్సిస్టర్ల మీద, అవి క్వాంటమ్ మెకానిక్ సూత్రాల మీద ఆధారపడి పని చేస్తాయని మీకు తెలుసు కదా. 2000 సంవత్సరాల కిందటే వాటి గురించి తెలిసినట్లయితే అవెక్కడున్నాయి? అవేవీ అప్పుడు లేవు. అప్పట్లో వాటి గురించి ఎవరికీ తెలియదు. అంటే ఇవి అప్పట్లో వున్నాయనడం కూడా అర్థంలేని మాటలే. ఇలాంటి పుక్కిటి పురాణాలు చెప్పుకుని ఎందుకు సంతోషపడుతుంటారో అర్థమే కాదు. భారతీయులు ఈ వలసవాద న్యూనతా భావన నుంచి బైటపడాల్సి వుంది.

అభిప్రాయం

పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యమా?

ఇటీవల కాళోజీ యూనివర్శిటీ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఎంబిబిఎస్ ద్వితీయ సంవత్సరంలో ఫార్మాకాలజీ పేపర్-1 ప్రశ్నాపత్రం తారుమారైంది. పరీక్షకు హాజరైన విద్యార్థులకు రెండు రకాల ప్రశ్నాపత్రాలు ఇచ్చారు. ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఒక పేపర్, చల్మెడ ఆనందరావ్ మెడికల్ కళాశాలలో ఇంకో పేపర్ వచ్చింది. పరీక్ష ప్రారంభమయ్యాక పొరపాటును గుర్తించిన అధికారులు పరీక్ష పూర్తయిన కొద్ది సేపటికి పరీక్ష రద్దు చేసినట్లు ప్రకటించారు. ఆ పరీక్షను తిరిగి ఫిబ్రవరి 12న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇది అధికారుల బాధ్యతా రాహిత్యానికి నిదర్శనం. సంవత్సరం పాటు కష్టపడి చదివి రాసిన పరీక్షను, కొన్ని రోజుల తర్వాత మళ్లీ కొత్తగా రాయడమంటే ఎంత మానసిక ఒత్తిడి అనుభవించాల్సి వుంటుంది? ఇటువంటి పొరపాటు గతంలో కూడా జరిగింది. ప్రశ్నా పత్రం లీక్ అవటం వల్ల ఇంటర్ బైపీసీ పూర్తి చేసిన విద్యార్థులు ఆ ప్రవేశ పరీక్షను మూడుసార్లు రాయవలసి వచ్చింది. ఎంతో పకడ్బందీగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించాల్సిన పరీక్షల్లో ప్రశ్నాపత్రాలు లీక్ అవ్వడం సర్వసాధారణమై పోయింది. ఇలాంటి అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోక పోవడంవల్లనే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఒత్తిడికి గురౌతున్నారు. ఇప్పటికైనా సరైన చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఇటువంటి తప్పిదాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

పి రమాదేవి.

వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన చిరునామా
editpageps@gmail.com

కామెంట్

ఆ పది శాతానికి ఉద్యోగాలెక్కడ?

వివిధ వర్గాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం పశువుల నోటికి చిక్కం కట్టి ఎదుట మేత పెట్టడం లాంటిదే. ఆర్థికంగా వెనుకబడి ఉన్న వివిధ వర్గాల వారికి విద్యారంగంలో పది శాతం సీట్లు రిజర్వ్ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం సరిగ్గా ఇలాంటిదే.

ఈ నిర్ణయాన్ని ప్రచారంలో పెట్టడానికి చాలా అట్టహాసం చేశారు. ఇలాంటి వ్యూహాలు ఎన్నికలలో ఓట్లు రాబట్టడానికి ఉపకరిస్తాయనడంలో అనుమానం లేదు. అయితే దీని వల్ల ఉద్యోగావకాశాలు వస్తాయంటే నమ్మలేం. పశువు నోటికి చిక్కం కట్టి ఎదుట మేత పెట్టిన రీతిలో ఆకలి తీరనట్టే ఈ రిజర్వేషన్ విధానం వల్ల కలిగే మేలు ఏమీ లేదు. ఉద్యోగాల కల్పనకూ ఉపకరించదు.

అసలు అవకాశాలు ఎక్కడున్నాయి? భారత్‌లో ఉద్యోగ కల్పన చాలా బలహీనంగా ఉందని ఇటీవల భారత ఆర్థిక వ్యవస్థను పరిశీలించే సి.ఎం.ఐ.ఇ. (సెంటర్ ఫర్ మోనిటరింగ్ ఇండియన్ ఎకానమీ) సంస్థ వెల్లడించింది. మొట్టమొదటిది 2018 డిసెంబర్ నాటికి నిరుద్యోగం 7.4 శాతం పెరిగింది. గత 15 నెలల కాలంలో నిరుద్యోగం ఇంత ఎక్కువగా ఎన్నడూ పెరగలేదు. రెండవది తొలగించిన శ్రామికులు 2017, 2018 డిసెంబర్ నాటికి కోటీ పది లక్షల మంది ఉన్నారు. ఆర్థికంగా బలహీనంగా ఉన్న వారిలోనే నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది.

గ్రామీణ ప్రాంతాలలో ఉద్యోగాలు కోల్పోవడం 82 శాతం దాకా ఉంది. ఇంకో వైపున వ్యవసాయ సంక్షోభం కొనసాగుతోంది. ఉపాధి కోల్పవడంవల్ల ఇబ్బందులు పడ్తున్న వారిలో 80 శాతం మంది మహిళలే. విచిత్రం ఏమిటంటే భారతీయ జనతాపార్టీ ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసమే కృషి చేస్తున్నామని చెబుతోంది.



ఇలాంటి వ్యూహాలు ఎన్నికలలో ఓట్లు రాబట్టడానికి ఉపకరిస్తాయనడంలో అనుమానం లేదు. అయితే దీని వల్ల ఉద్యోగావకాశాలు వస్తాయంటే నమ్మలేం. పశువు నోటికి చిక్కం కట్టి ఎదుట మేత పెట్టిన రీతిలో ఆకలి తీరనట్టే ఈ రిజర్వేషన్ విధానం వల్ల కలిగే మేలు ఏమీ లేదు. ఉద్యోగాల కల్పనకూ ఉపకరించదు.

ఈ అంచనాలు తాత్కాలికమైనవేనని సి.ఎం.ఐ.ఇ. చెప్పినప్పటికీ అసలు లెక్కలు విడుదల చేసినా పరిస్థితి అమాంతంగా మారిపోయేది ఏమీ ఉండదు. ప్రభుత్వోద్యోగాల నియామకం చాలా మందకొడిగా ఉంది. రిజర్వు చేసిన వర్గాల వారిని నియమించవలసిన చోట ఏర్పడిన ఖాళీలే మూడో వంతు ఉన్నాయి.

అదే సమయంలో అసంఘటిత రంగం, లాంఛనప్రాయం కాని రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండేవి. కానీ ఈ రంగంలో పెద్ద నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను విధింపు లాంటి 'దొంగ దెబ్బలతో' ఇప్పటికీ కోలుకోలేదు.

రిజర్వేషన్లు 50 శాతానికే పరిమితం కావాలని సుప్రీం కోర్టు విధించిన నిబంధనను ఉల్లంఘించడం వల్ల బీజేపీకి ఎన్నికలలో ప్రయోజనం కలిగితే కలగవచ్చు. తమకు మద్దతు ఇచ్చే రాజకీయ పక్షాలను చేరదీయడానికి ఉపయోగపడవచ్చు. హిందీ మాట్లాడే రాష్ట్రాలలోని 'బలహీన' ఓటర్లను ఆకట్టుకోవడానికి ఉపకరించవచ్చు.

2018 లో కొన్ని రాష్ట్రాలలో జరిగిన ఎన్నికలలో బీజేపీ ఈ వర్గాల మద్దతు కోల్పోయింది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసమే పాలక పార్టీ పది శాతం ఎత్తుగడ వేసింది. అయితే ఉద్యోగాల కోసం అన్వేషిస్తున్న వారిలో ఎక్కువ మంది రిజర్వేషన్ల పరిధిలోకి రాని ఉద్యోగాలకోసమే పోటీ పడుతున్నారు. అందువల్ల రిజర్వేషన్ల వల్ల లబ్ధి పొందే వారికి ఒరిగేది ఏమీ ఉండదు.

యువత ఆకాంక్షలు బలంగా ఉన్నాయని రోజూ చెప్తూనే ఉంటారు. కాని ఈ ఆకాంక్షలను అర్థం చేసుకోవడం అర్ధ మనస్కంగానే జరిగినట్టు కనిపిస్తోంది. వారికి మేలు చేసే చర్యలు తీసుకోకుండా రిజర్వేషన్ల పేరిట ఏవో తాయిలాలు ఇస్తున్నట్టు స్పష్టంగా కనిపిస్తోంది. వాస్తవానికి నిరుద్యోగం అత్యంత తీవ్రంగా వుంది. అయితే ప్రభుత్వం ఆ విషయమే పట్టించుకోవడం లేదు.

భారత్‌లో అయిదింట నాలుగు వంతుల ఉద్యోగాలు నికర మైనవి కావని అంతర్జాతీయ కార్మిక సంస్థ ఆధీనంలోని 'ప్రపంచ ఉద్యోగిత, సామాజిక దృక్పథం: 2018 ధోరణులు' అన్న నివేదికలో తెలియజేశారు. ఇంకో అయిదింట రెండు వంతుల మంది తమకు తక్కువ వేతనాలు ఇస్తున్నారని అంటున్నారు.

అజీం ప్రేమ్ జీ విశ్వవిద్యాలయం తయారు చేసిన 'స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా-2018'లో కూడా తక్కువ వేతనం అందించే ఉద్యోగాల వల్ల సమస్య ఉందని పేర్కొన్నారు. సంఘటిత రంగంలో కూడా తక్కువ వేతనాల సమస్య ఉంది. ఇక అసంఘటిత రంగంలో ఈ సమస్య గురించి చెప్పక్కర్లేదు.

ద్రవ్యోల్బణం పెరుగుదలలో వేతనాల తీరును 2015లో మూడు శాతం సర్దుబాటు చేసినప్పటికీ ప్రభుత్వేతర రంగాలలో పని చేస్తున్న 82 శాతం పురుషులు, 92 శాతం మహిళల నెలసరి ఆదాయం ఏడవ వేతన సంఘం సిఫార్సు చేసిన కనీస వేతనం కన్న 40 శాతం తక్కువ.

దీనితో పాటు కార్మికుల ఉత్పాదకతకు, వేతనాలకు మధ్య అంతరం పెరుగుతోంది. ఉదాహరణకు సంఘటిత రంగం లోని వస్తూత్పత్తి, ఉత్పాదకత గత మూడు దశాబ్దాల కాలంగా ఆరు రెట్లు పెరిగితే వేతనాలు మాత్రం 1.5 రెట్లు మాత్రమే పెరిగాయి.

ఈ సమాచారం ఆధారంగా దేశంలో నిరుద్యోగం, ముఖ్యంగా యువతలో నిరుద్యోగం 'నిజమైన' ఉద్యోగ కల్పన కన్నా ఎక్కువగా ఉండవచ్చు. తమ అర్హతలకు తగిన ఉద్యోగాలు, వేతనాలు లేనందువల్ల చాలా మంది నిరుద్యోగులు ఉద్యోగాన్వేషణే చేయడం లేదు. చాలా మంది యువకులు నెలసరి జీతాలొచ్చే ఉద్యోగాల కోసం చూస్తున్నారు. అదీ ప్రభుత్వోద్యోగాలు కావాలంటున్నారు.

అందువల్ల నిరుద్యోగ సమస్యకు కారణం నిరుద్యోగులే అని వాదించడానికి అవకాశం ఉంది. అది వాస్తవిక ఉపాధి అయినా, పూర్తి కాలం పని లేని ఉపాధి అయినా, ఉండవలసిన ఉద్యోగం అయినా ఉద్యోగాల కల్పన నామ మాత్రంగానే ఉంది. ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించి ఆర్థికాభివృద్ధిని, ఉద్యోగ కల్పనను బలహీన పరిచే అడ్డంకులను తొలగించవలసిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉంది.

('ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' సంపాదకీయం)



పిల్లల నుంచి పెద్దల వరకు ఎంతో ఇష్టంగా తినే.. అల్పాహారం ఏదైనా ఉందంటే అవి బజ్జీలే. వంటగదిలో నుంచి వచ్చే ఆ కమ్మటి వాసన ముక్కుకి తగిలితే చాలు.. ఎవరికైనా నోరూరాల్సిందే. వాటికుండే కరకరలాడే స్పైసీ టేస్ట్ అలాంటిది. ఎప్పటిలా..మిరప, అరటి, ఆలూతో చేసే బజ్జీలే కాకుండా సొరకాయ, కాకర, పాలకూరతోనూ రుచికరమైన బజ్జీలను తయారు చేయొచ్చు. మీరూ ప్రయత్నించి చూడండి.. మీ ఇంట్లోని బుజ్జాయిలు సైతం ఎంతో.. ఇష్టంగా తినకపోతే అడగండి!

జీవన సౌరభం

ఇతరుల మనసును గాయపరచాలంటే నిమిషం పట్టదు. ఆ మనసును గెలవాలంటే జీవితకాలం సరిపోదు.



మీ కోసం

నిమ్మ ఆకులను నీటిలో ఉడకబెట్టి ఆ నీటిని నోట్లో వేసుకొని పుక్కిలిస్తే పంటినొప్పి తగ్గుతుంది.

జలుబు నివారణ ఇలా!

చలికాలం ప్రధానంగా ప్రతి ఒక్కరూ జలుబు సమస్యను ఎదుర్కొంటూ ఉంటారు. దీన్ని తగ్గించుకోవడానికి ఏవేవో మందులు వాడుతుంటారు. అయితే మన ఇంట్లోనే మనకు అందుబాటులో ఉండే వాటితోనే జలుబును తగ్గించుకోవచ్చు.

- జలుబును తగ్గించడంలో తులసి ఆకులు చాలా బాగా పనిచేస్తాయి. గుప్పెడు తులసి ఆకులకు, చిటికెడు రాళ్ల ఉప్పును కలిపి బాగా నమిలి మింగాలి. తులసి టీ తాగినా జలుబు తగ్గుముఖం పడుతుంది.
- వేడిపాలలో చిటికెడు పసుపు కలుపుకుని, రాత్రి పడుకునే ముందు తాగితే జలుబుకు ఉపశమనం లభిస్తుంది.
- రెండు కప్పుల నీటిలో చిన్న అల్లం ముక్క, దాల్చిన చెక్క వేసి బాగా మరిగించాలి. తర్వాత దాన్ని వడగట్టి, కొద్దిగా తేనె కలిపి తాగితే మంచిది.
- ప్రతిరోజూ నీటిని బాగా మరగబెట్టి చల్లార్చి, తాగితే జలుబు నుంచి త్వరగా ఉపశమనం కలుగుతుంది.
- పాలల్లో జాజికాయ, అల్లం, కుంకుమపువ్వు వేసి ముందుగా తీసుకున్న పాలు సగం అయ్యేంతవరకూ మరగబెట్టాలి. గోరువెచ్చగా ఉన్నప్పుడే వీటిని తాగాలి.
- ఏడు ఎనిమిది మిరియాలు నెయ్యిలో వేయించుకుని తినాలి. తర్వాత గోరువెచ్చని పాలను తాగాలి. దీంతో వ్యాధి నిరోధకశక్తి పెరిగి, జలుబు తగ్గుముఖం పడుతుంది. తమలపాకు రసంలో లవంగాలు, అల్లం రసాన్ని తేనెలో కలుపుకుని, తాగినా ప్రయోజనం ఉంటుంది.



చర్మ సంరక్షణ కోసం..

కొందరు తరచూ ముఖం కడుక్కోవడం, మర్దన చేసుకోవడం వంటివి చేస్తుంటారు. ఈ క్రమంలో కొన్ని పొరపాట్లు చేస్తుంటారు. అలాంటివి జరగకుండా ఉండాలంటే...



- ముఖం కడుక్కోవడానికి, మేకప్ వేసుకోవడానికి ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలి. లేదంటే చేతులకున్న మురికి, పైన పేరుకొన్న బ్యాక్టీరియా వంటివి చర్మంపై ప్రభావం చూపుతాయి.
- పొడి చర్మతత్వం గలవారు ముఖాన్ని సబ్బుతో శుభ్రం చేసుకోకపోవడం మంచిది. దానిలో ఉండే ఘాటైన రసాయనాలు చర్మం ఇంకా పొడిబారేలా చేస్తాయి. అందుకే తేనె, అరటిపండుతో మర్దన చేసుకుని, స్నానం చేయడం మంచిది. తరచూ మాయిశ్చరైజర్లు రాయాలి. నిపుణుల సలహాతో నాణ్యమైన ఫేస్‌వాష్‌ని ఎంచుకోవాలి.
- ప్రతిరోజూ చర్మం మెరవాలని అందరికీ ఉంటుంది. అయితే అదే పనిగా క్లెన్సర్లు, స్క్రబ్‌లు వాడటం వల్ల ఆ మెరుపు సాధ్యం కాకపోగా, చర్మం ఇంకా నిర్జీవంగా మారుతుంది. అందుకే అప్పుడప్పుడూ వాటిని వాడుతూ ఆవిరి పట్టుకోవాలి.
- ఈ కాలంలో ముఖం శుభ్రం చేసుకోవడానికి అతి చల్లగా, మరీ వేడిగా ఉన్న నీళ్ల జోలికి వెళ్లకపోవడం మంచిది. గోరువెచ్చగా ఉన్న నీటినే ఎంచుకోవాలి. ★

వెరైటీగా వెజ్ బజ్జీలు

వంకాయతో..



కావాల్సిన పదార్థాలు : వంకాయలు – ఐదు, ఉల్లిపాయ ముక్కలు – అరకప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్ – టీ స్పూను, శనగపిండి – కప్పు, వంట సోడా – చిటికెడు, జీలకర్ర – టీ స్పూను, వాము – అర టీ స్పూను, పచ్చి మిరపకాయలు – నాలుగు, కారం – టీ స్పూను, ఉప్పు – తగినంత, నూనె – సరిపడా.

తయారుచేసే విధానం : వంకాయల్ని శుభ్రంగా కడిగి గుత్తి వంకాయల్లా కోసుకోవాలి. స్టౌ మీద గిన్నె పెట్టి ఒక గ్లాసు నీళ్లు పోసి వంకాయల్ని వేసి ఓ పదినిమిషాలు ఉడికించి, దించేయాలి. స్టౌ మీద మరో గిన్నె పెట్టుకుని సరిపడా నూనె వేసి బాగా కాగాక ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిరపకాయ ముక్కలు, జీలకర్ర, అల్లంవెలుల్లి పేస్ట్ వేసి బాగా వేయించుకోవాలి. ఇందులో ఉప్పు, పసుపు, గరంమసాలా వేసి బాగా కలిపి దించేయాలి. దీన్ని వంకాయల మధ్యలో పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక గిన్నెలో శనగపిండి, కారం, ఉప్పు, వంటసోడా, సరిపడా నీళ్లు పోసి జారుగా కలుపుకోవాలి. స్టౌపై పాన్ పెట్టి సరిపడా నూనె పోసి బాగా వేడెక్కాక మసాలా పెట్టిన వంకాయల్ని శనగపిండిలో ముంచి నూనెలో వేసుకోవాలి. ఎర్రగా వేగాక తీసేయాలి. వీటిని టమాటా సాస్‌తో తింటే చాలా రుచిగా ఉంటాయి.

పాలకూర బజ్జి

కావాల్సిన పదార్థాలు : పాలకూర – ఒక కట్ట, శనగపిండి – కప్పు, బియ్యం పిండి– రెండు టేబుల్ స్పూన్స్, అల్లంవెల్లుల్లి పేస్ట్ – స్పూన్, కారం – స్పూన్, ఉప్పు – తగినంత, వాము – కొంచెం, సోడా ఉప్పు – చిటికెడు, ఆయిల్ – డీప్ ఫ్రైకి సరిపడా, ఉల్లిపాయ ముక్కలు – సర్వింగ్ కోసం.

తయారుచేసే విధానం: శనగపిండిలో బియ్యం పిండి, ఉప్పు, కారం, అల్లం వెల్లుల్లి పేస్ట్, సోడా ఉప్పు, వాము వేసి నీళ్లు పోసుకొని బజ్జి పిండిలా కలుపుకోవాలి. పాలకూర ఆకులు శుభ్రం చేసుకొని, కడిగి ఆరబెట్టుకోవాలి. డీప్ ఫ్రైకి ఆయిల్ పెట్టి ఆరిన పాలకూర ఆకులు బజ్జీల పిండిలో ముంచి తీసి నూనెలో వేసి బాగా వేయించుకోవాలి. వేగిన బజ్జిలు ఉల్లిపాయ ముక్కలుతో సర్వ్ చేసుకోవాలి. అంతే ఎంతోటేస్టీగా ఉండే పాలకూర బజ్జీ రెడీ.



సొరకాయతో..

కావాల్సిన పదార్థాలు : సొరకాయ ముక్కలు – అరకప్పు, పచ్చి శనగపప్పు – అరకప్పు, శనగపిండి – కప్పు, పచ్చిమిర్చి – మూడు, ఎండు మిరపకాయలు – నాలుగు, కొత్తిమీర – కొద్దిగా, వాము – పావు టేబుల్ స్పూను, నీరు – కొద్దిగా, నూనె – డీప్ ఫ్రైకి సరిపడా, ఉప్పు – రుచికి సరిపడా.

తయారుచేసే విధానం : సొరకాయను మీకిష్టమైన షేప్‌లో కట్ చేసుకోవాలి. ముందుగా పచ్చిశనగపప్పును నీటిలో వేసి, నాలుగు గంటలు నానబెట్టాలి. ఇప్పుడు నానబెట్టుకున్న పచ్చిశనగపప్పు, ఉప్పు, ఎండుమిరపకాయలు, సన్నగా తరిగిన పచ్చిమిర్చి ముక్కలు వేసుకుని మిక్స్ చేసుకుని పేస్ట్‌లా చేసుకోవాలి. ఇప్పుడు ఒక గిన్నె తీసుకుని, అందులో పచ్చిశనగపప్పు పేస్ట్, కొత్తిమీర, వాము వేసుకుని కలుపుకోవాలి. ఇప్పుడు ఇందులోనే శనగపిండి అవసరమనుకుంటే ఉప్పు కూడా వేసుకుని నీటిని యాడ్ చేసుకుని బజ్జీల పిండిలా కలుపుకోవాలి. ఇప్పుడు స్టౌపై పాన్ పెట్టుకుని, నూనె పోసి వేడెక్కాక సొరకాయ ముక్కలకు బజ్జీలా పిండి బాగా పట్టేలా చూసుకుని నూనెలో వేసి వేయించుకోవాలి. అంతే సొరకాయ బజ్జీ రెడీ అయినట్టే. వీటికి గ్రీన్ చట్నీ కానీ, టమాటా సాస్‌తో అయితే టేస్టీగా ఉంటుంది.



కాకరకాయతో..



కావాల్సిన పదార్థాలు : కాకరకాయ – ఒకటి, శనగపిండి – అరకప్పు, వెల్లుల్లి రెబ్బలు – మూడు, వాము – టేబుల్ స్పూను, పసుపు – అర టేబుల్ స్పూను, కారం – అర టేబుల్ స్పూను, ఇంగువ – కొద్దిగా, ఉప్పు – రుచికి సరిపడా.

తయారుచేసే విధానం : ముందుగా కాకరకాయని లైట్‌గా పైనున్న తొక్క తీసుకోవాలి. ఇప్పుడు దాన్ని రౌండ్‌గా మీడియం సైజ్‌లో ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఇప్పుడు ఒక గిన్నె తీసుకుని అందులో ముందుగా వెల్లుల్లిని చిన్న ముక్కలుగానైనా కట్ చేసుకోవచ్చు. లేదా వాటిని పేస్ట్‌లా చేసుకోనైనా వేసుకోవచ్చు. తరువాత శనగపిండి, ఉప్పు, కారం, ఇంగువ, వాము వీటన్నింటిని వేసుకుని బజ్జీ పిండిలా కలుపుకోవాలి. ఇప్పుడు స్టౌపై పాన్ పెట్టుకుని, అందులో నూనె పోసి వేడెక్కాక ముందుగా కట్ చేసి పెట్టుకున్న కాకరకాయ ముక్కల్ని ముందుగా కలిపిపెట్టుకున్న పిండిలో ముంచి, నూనెలో వేసి వాటిని వేయించుకోవాలి. అంతే కాకరకాయ బజ్జీ రెడీ! వేడివేడిగా ఉండే కాకరకాయబజ్జీలను గ్రీన్ చట్నీతో తింటే చాలా బాగుంటుంది. ఈ బజ్జీలకు మసాలా ఛాయ్ చక్కటి రుచికరమైన కాంబినేషన్.

పౌష్టికాహారం

కూరగాయలతో చేసే బజ్జీలు మంచి పౌష్టికాహారమైన స్నాక్స్. వీటిద్వారా విటమిన్లు, ఫైబర్, మినరల్స్ మన శరీరానికి అందుతాయి. శనగపిండితో చేసే బజ్జీలు నెలసరి సమయంలో మంచి ప్రొటీన్లను అందిస్తాయి. ఇవి పిల్లలకూ మంచి స్నాక్స్. లంచ్‌కు, డిన్నర్‌కు మధ్య సమయంలో ఇలాంటి స్నాక్స్ తీసుకోవచ్చు. పాలకూర బజ్జీలో పాలిక్ యాసిడ్, ఫైబర్, క్యాల్షియం, ఐరన్ అధికంగా ఉంటుంది. వీటిని తినడం వల్ల శరీరంలో హిమోగ్లోబిన్ శాతం పెరుగుతుంది.



జానకి బడుగు
పోషకాహార నిపుణులు

అరటికాయతో..

కావాల్సిన పదార్థాలు : పచ్చి అరటి – ఒకటి, శనగపిండి – అరకప్పు, బియ్యం పిండి – రెండు టేబుల్ స్పూన్లు, కారం – అర టేబుల్ స్పూను, ఫుడ్ కలర్ – కొద్దిగా, ఇంగువ – కొద్దిగా, వంటసోడా – చిటికెడు, ఉప్పు – రుచికి తగినంత, నీరు – కొద్దిగా, నూనె – డీప్ ఫ్రైకి సరిపడినంత.

తయారుచేసే విధానం : ముందుగా పచ్చి అరటికాయను పైతొక్క తీసేసి మీకు కావల్సిన షేప్‌లో కట్ చేసుకుని, నీటిలో వేసుకోవాలి. ఇప్పుడు బజ్జీల పిండిని సిద్ధం చేసుకోవాలి. ఒక గిన్నె తీసుకుని అందులో శనగపిండి, బియ్యంపిండి, ఉప్పు, కారం, ఇంగువ, వంటసోడా వేసుకుని నీటిని కలుపుకుంటూ బజ్జీలా పిండిలా కలుపుకోవాలి. స్టౌపై పాన్ పెట్టి డీప్ ఫ్రైకి సరిపడా నూనె వేసుకుని అది వేడెక్కాక ముందుగా కట్ చేసుకుని పెట్టుకున్న అరటికాయ ముక్కల్ని బజ్జీల పిండిలో ముంచి, ముక్కకి రెండువైపులా పిండి పట్టేలా చూసుకుని, నూనెలో వేసుకోవాలి. అవి వేగాక ఒక ప్లేట్‌లోకి తీసుకుని, ఉల్లిపాయ చట్నీతో తింటే చాలా బాగుంటుంది.





సానుకూల ఆలోచనతోనే ఒత్తిడికి చెక్!

తలనొప్పి, జలుబు, జీర్ణసంబంధ సమస్య ఏదైనా వాటిని నివారించే పరిష్కారాలు ఆలోచిస్తాం కానీ అవి ఒత్తిడి వల్ల ఎదురవుతున్నాయని అనుకోము. ఒత్తిడి ఉద్యోగినులకు మాత్రమే కాదు ఇంటిదగ్గర ఉండే మహిళల్నీ ఇబ్బందిపెడుతుంది. పెరిగిన వాతావరణం, శారీరకంగా జరిగే మార్పులూ, సామాజిక పరిస్థితులు వంటివి ఒత్తిడికి దారితీస్తాయి. ఇంట్లో ఇద్దరు పిల్లల్నీ సమానంగా చూస్తున్నాం అనుకుంటారు చాలామంది తల్లిదండ్రులు. కానీ తమకు తెలియకుండానే అబ్బాయిలతో పోల్చి, చాలా సందర్భాల్లో అమ్మాయిల్ని చిన్నచూపు చూస్తారు. వీటికి తోడు పెళ్లయ్యాక పెరిగే బాధ్యతల గురించి చెప్పక్కర్లేదు. భార్యగా, ఉద్యోగినిగా, తల్లిగా.. ఎన్నో బాధ్యతలు నిర్వర్తించాలి. గృహిణులకూ ఉద్యోగ విధులతో పాటు ఇంచుమించు ఇలాంటి సమస్యలన్నీ ఉంటాయి. రకరకాల పనులూ, శక్తికి మించి చేయాల్సి వచ్చినా 'తప్పదు మరి' అనుకుంటూ చేసుకుపోవడం వంటివి తెలియకుండానే ఒత్తిడికి లోనుచేస్తాయి.

మనసు బాగా లేకపోతే ఆ ప్రభావం ముందుగా శరీరంపైనే పడుతుంది. తరచూ తలనొప్పి, వికారం, నిస్సత్తువ, రోగనిరోధక శక్తి తగ్గడం, జలుబూ, జ్వరం, గుండె దడా, అజీర్ణం, అధిక రక్తపోటూ, థైరాయిడ్, ఎసిడిటీ వంటి మరికొన్ని సమస్యలన్నీ ఒత్తిడి వల్లే అని అధ్యయనాలు చెబుతున్నాయి. దీనివల్ల నెలసరిలోనూ సమస్యలొస్తాయి. ఒత్తిడితో కొందరు అతిగా తింటే, మరికొందరు అసలు తీసుకోరు. దీనివల్ల ఊబకాయం, రక్తహీనతకు గురవుతారు. సరిగ్గా నిద్ర పట్టకపోవడానికి కారణం కచ్చితంగా ఒత్తిడే. సైనస్, ఉబ్బసం లాంటివి శాశ్వతంగా తగ్గకపోవచ్చు కానీ ఒత్తిడిని తగ్గించుకోవడం వల్ల వాటి తీవ్రత చాలామటుకు అదుపులోకి వచ్చేస్తుంది. ఒత్తిడిలో ఉండే గర్భిణులకు తక్కువ బరువున్న పిల్లలు పుడతారు. ఒత్తిడి వినడానికి చిన్న పదమే. కానీ చిక్కు సమస్యలకు కారణమవుతుంది. అధ్యయనాల ప్రకారం విపరీతంగా ఒత్తిడి ఉన్నవారిలో మధుమేహం, రొమ్ము, గర్భాశయ, ముఖద్వార క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువ. అందుకే సాధ్యమైనంత త్వరగా ఒత్తిడిని అదుపు చేసుకోవాలి.

- ఇల్లూ, ఆఫీసూ, పిల్లల బాధ్యతలూ వంటి పనుల జాబితా చాలానే ఉంటుంది. ముఖ్యమైన పనులు చేస్తూనే, వ్యక్తిగత అభిరుచులకూ కొంత సమయం కేటాయించుకోవాలి.
- చాలామంది ఒత్తిడితో బాధపడతారు కానీ ఎవరితో పంచుకోరు. శక్తికి మించిన పనులు ఉన్నాయి అనిపించినప్పుడు.. తగ్గించుకునే మార్గం ఆలోచించాలి. ఇంట్లో అయితే కుటుంబసభ్యుల సాయం తీసుకోవాలి. ఆఫీసులో సహోద్యోగుల సహకారం కోరాలి. ఎలాంటి సమస్య ఉన్నా జీవిత భాగస్వామితో చర్చించాలి. మనసులో భారంగా మాత్రం మిగుల్చుకోకూడదు. ఉదయం పూట టిఫిన్, వేళకు భోజనం, తగినంత నిద్ర ఇవి ముఖ్యం.
- జీవితమే కాదు చుట్టూ ఉండే పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా 'నేను సానుకూలంగా ఉండేందుకు ప్రయత్నిస్తాను' అనే అనుకోవాలి. అది సెల్ఫ్ కౌన్సెలింగ్‌గా పనిచేస్తుంది. ఆ దిశగా ఆలోచనలు చేస్తే ఒత్తిడికి లోనయ్యే అవకాశం తగ్గుతుంది.

ఇవన్నీ పాటించడం వల్ల ఒత్తిడి తగ్గాలి. ఆ సానుకూల పరిస్థితి కనిపించకపోతే మానసిక నిపుణుల్ని సంప్రదించాలి. ★

సెన్సెక్స్ ⬆ 34
36,616

నిఫ్టీ ⬆ 22
10,934

రూపాయి ⬆ 24 పై
అమెరికా డాలరుకు రూ.
71.56

యోనో ఎస్‌బిఐ అవార్డులు..

ప్రముఖ చెల్లింపుల యాప్ యోనో ఎస్‌బిఐ అండర్ ట్వంటీ పేరుతో 20 మంది యువ నైపుణ్యవంతులను సత్కరించింది. బెంగళూరులో జరిగిన ఈ వేడుకలో ఎపి, తెలంగాణకు చెందిన ఇద్దరు యంగ్ ఎచీవర్స్ ఉన్నట్లు ఆ సంస్థ తెలిపింది. జ్యూరీ ఎంపిక చేసిన 60 మంది నామినేషన్లలో 20 మందిని గుర్తించేందుకు 1.7 లక్షల ఓట్లను నమోదు చేసినట్లు పేర్కొంది.



ఫ్లిప్‌కార్ట్ నుంచి వాల్‌మార్ట్ వైదొలగాలి..!

● లాభాలు రాకపోతే ఆలోచించాలి ● మోర్గాన్ స్టాన్లే సూచన

న్యూఢిల్లీ : ఫ్లిప్‌కార్ట్‌లో లాభాలు రాకపోతే వాల్‌మార్ట్ వైదొలగడమే మంచిదని ప్రముఖ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ మోర్గాన్‌స్టాన్లీ సూచించింది. కొత్తగా అమల్లోకి వచ్చిన నిబంధనలకు అనుగుణంగా తన వ్యూహాన్ని మార్చుకొని వాల్‌మార్ట్ భారత్‌లో కొనసాగొచ్చని పేర్కొంది. అయితే కొత్త నిబంధనలు ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌లను విక్రయాలను దెబ్బతీస్తాయని అంచనా వేసింది. గతంలో ఈ రెండు సంస్థలు భారీ ఎత్తున పోటాపోటీగా డిస్కౌంట్‌లో వస్తువులను విక్రయించేవి. భారత్‌లో కొత్తగా అమల్లోకి వచ్చిన ఇకామర్స్ నిబంధనలు వ్యాపారాన్ని కష్టంగా మార్చే అవకాశం ఉందని ఇది వరకు రిపోర్టులు వచ్చాయి. అసెసింగ్ ఫ్లిప్‌కార్ట్ రిస్క్ టు డబ్ల్యుఎంటి ఇపిఎస్ అనే నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. 2017 మేలో వాల్‌మార్ట్ కంపెనీ దాదాపు 16 బిలియన్ డాలర్లు (దాదాపుగా రూ.లక్ష కోట్లు) వెచ్చించి ఫ్లిప్‌కార్ట్‌లో 77శాతం వాటా కొనుగోలు చేసింది. ఈ ఒప్పందంతో వాల్‌మార్ట్ భారతీయ మార్కెట్లో నేరుగా అమెజాన్‌తో పోటీకి దిగినట్లయ్యింది. చైనాలో వ్యాపారం లాభదాయకంగా లేదని 2017లో అమెజాన్ అక్కడి వ్యాపారం నుంచి వైదొలిగింది.

పిఎన్‌బి ఆశ్చర్యకర ఫలితాలు

● క్యూ3లో రూ.247 కోట్ల లాభాలు
● నీరవ్ మోసం తర్వాత తొలిసారి.. ● పెరిగిన షేర్ విలువ




న్యూఢిల్లీ : దేశంలో రెండో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు పిఎన్‌బి క్రితం త్రైమాసికంలో అంచనాలకు భిన్నంగా ఫలితాలు ప్రకటించింది. మొండి బాకీలకు కేటాయింపులు భారం తగ్గడంతో లాభాలను నమోదు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో పంజాబ్ నేషనల్ బ్యాంకు (పిఎన్‌బి) 7.12 శాతం వృద్ధితో రూ.246.51 కోట్ల లాభాలు సాధించింది. గతేడాది ఫిబ్రవరిలో ఈ బ్యాంకుకు నీరవ్ మోడీ రూ.13,000 కోట్ల పైగా ఎగ్గొట్టిన తర్వాత తొలిసారి లాభపడినట్లయ్యింది. 2017-18 ఇదే క్యూ3లో రూ.230.11 కోట్ల లాభాలు నమోదు చేసింది. కాగా 2018-19 సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏకంగా రూ.4,532.35 కోట్ల నష్టాలు చవి చూసింది. 2018-19 క్యూ3లో మొండి బాకీల కోసం కేటాయింపులు ఏడాదికేడాదికి 38.35 శాతం.. త్రైమాసికానికి త్రైమాసికానికి 71.78 శాతం చొప్పున తగ్గి రూ.2,753.84 కోట్లుగా నమోదయ్యాయి. ఇదే సమయంలో బ్యాంకు స్థూల నిరర్ధక ఆస్తులు 16.33 శాతానికి తగ్గాయి. 2017-18 ఇదే క్యూ3లో 12.11 శాతంగా జిఎన్‌పిఎ నమోదయ్యింది. ఈ సమయంలో 8.90 శాతంగా ఉన్న నికర నిరర్ధక ఆస్తులు.. క్రితం క్యూ3లో 8.22 శాతానికి తగ్గాయి. మంగళవారం బిఎస్‌ఇలో పిఎన్‌బి షేర్ ఇంట్రా ట్రేడింగ్‌లో కొనుగోళ్ల మద్దతుతో ఏకంగా రూ.76.50 గరిష్ట స్థాయిని తాకింది. తుదకు 0.55 శాతం పెరిగి రూ.73.55 వద్ద ముగిసింది.

క్రితం క్యూ3లో బ్యాంకు మొత్తం ఆదాయం రూ.14,854.24 కోట్లకు తగ్గింది. 2017-18 ఇదే క్యూ3లో రూ.15,257.5 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సాధ్యమైనంత వరకు రికవరీ పెంచడంతో తిరిగి పుంజుకున్నామని పిఎన్‌బి సిఇఒ, ఎండి సునీల్ మెహతా పేర్కొన్నారు. క్రితం మూడు త్రైమాసికాల్లో రూ.16,608 కోట్లు రికవరీ చేయగలిగామన్నారు. క్రితం ఆర్థిక సంవత్సరం రికవరీలతో పోల్చితే మూడు రెట్లు ఎక్కువని అన్నారు. నీరవ్ మోడీ మోసంలో 100 శాతం కేటాయింపులు పూర్తి అయ్యాయన్నారు. గతేడాది ఫిబ్రవరిలో నీరవ్ మోడీ కుంభకోణం బయటికి రావడంతో ఈ బ్యాంకు లాభాలకు భారీగా గండి కొట్టిన విషయం తెలిసిందే.

కార్పొరేట్ల అప్పుల గుదిబండ

● మరో రూ.3.5 లక్షల కోట్లు
● 2020 సెప్టెంబర్ నాటికి అదనం
● ఇది వరకే రూ.14 లక్షల కోట్ల కుప్ప
● బ్యాంకులపై తీవ్ర ఒత్తిడి
● ఇండియా రేటింగ్స్ రిపోర్టు..



న్యూఢిల్లీ : భారత బ్యాంకింగ్ రంగానికి కార్పొరేట్ల మొండి బాకీలు ఉరితాళ్లలా మారుతున్నాయి. బడా పారిశ్రామిక వర్గాలకు ఇచ్చిన అప్పుల్లో మరో రూ.3.5 లక్షల కోట్లు నిరర్ధక ఆస్తులుగా మారనున్నాయని ఓ రిపోర్టు హెచ్చరించింది. కార్పొరేట్లకు ఇచ్చిన మొత్తం అప్పుల్లో 40 శాతం రాని బాకీలుగా మారొచ్చని అంచనా వేసింది. బడా బాబులకు ఇచ్చిన మొత్తం 19.3 శాతం అప్పుల్లో మరో 3.9 శాతం రుణాలు రాని బాకీల ఖాతాల్లోకి చేరొచ్చని ఇండియా రేటింగ్స్ ఫైనాన్సియల్ ఇన్స్టూట్యూషన్స్ అండ్ బ్యాంకింగ్ అసోసియేట్ డైరెక్టర్ జిందాల్ హరినా విశ్లేషించారు. బ్యాంకు రుణ పుస్తకాల్లో ఇప్పటికీ వీటిని గుర్తించలేదన్నారు. 2019-20 ద్వితీయార్థంలో కొత్తగా రూ.1.5-2 లక్షల కోట్లు మొండి బాకీలుగా మారొచ్చన్నారు. సెప్టెంబర్ 2018 నాటికి రూ.13.5-14 లక్షల కోట్ల కార్పొరేట్ల నుంచి రాని బాకీలు ఉన్నాయని, అయితే ఇందులో రూ.10 లక్షల కోట్లను మాత్రమే బ్యాంకులు గుర్తించాయన్నారు. కాగా ఈ రూ.1.5-2 లక్షల మొండి బాకీల కోసం బ్యాంకులు రూ.40,000 కోట్ల కేటాయింపులు చేయాల్సి రావొచ్చని జిందాల్ తెలిపారు.

పెద్ద ప్రయివేటు బ్యాంకుల రేటింగ్ స్థిరంగా ఉండొచ్చని ఈ ఎజెన్సీ అంచనా వేసింది. అదే విధంగా ప్రభుత్వం రంగంలోని 19 బ్యాంకుల్లో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, బ్యాంకు ఆఫ్ బరోడా ప్రతికూల రేటింగ్ నుంచి బయటపడొచ్చని పేర్కొంది. 2019-20లో కార్పొరేట్ల ఆస్తుల కోసం చేసే కేటాయింపులు, పరిష్కారాలను బట్టి ఆ బ్యాంకుల స్థిరత్వం ఆధారపడనుందని పేర్కొంది. ఎన్‌సిఎల్‌టి ఉన్న రూ.4.50 లక్షల కోట్ల విలువ చేసే అతిపెద్ద 40 మొండి బాకీల ఆస్తుల కోసం బ్యాంకులు 70-75 శాతం కేటాయింపులు చేయాల్సిన పరిస్థితి రావొచ్చని ఈ రిపోర్టు పేర్కొంది. 2018-19, 2019-20లో పరిష్కారం, లిక్విడేషన్ అంశాలపై ఆధారపడి బ్యాంకుల రుణ వ్యయం నమోదు కానుంది. 2017-18, 2018-19లో కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ బ్యాంకులకు అందించే రూ.1.94 లక్షల కోట్ల మూల ధనం కేవలం కార్పొరేట్ల ఎన్‌పిఎల కోసం కేటాయింపులు చేయడానికి సరిపోతుందని ఈ ఎజెన్సీ పేర్కొంది.

ఒత్తిడిలో ఎన్‌బిఎఫ్‌సిలు..

ఎన్‌బిఎఫ్‌సిలపై ఇండియా రేటింగ్స్ మరో రిపోర్టును వెల్లడించింది. 2019-20లో బ్యాంకింగేతర విత్త సంస్థల (ఎన్‌బిఎఫ్‌సి) రాబడిలో ఒత్తిడి కొనసాగొచ్చని విశ్లేషించింది. ఆటో, రియల్ ఎస్టేట్ రంగాల లావాదేవీల్లో తగ్గుదల చోటు చేసుకోవడం ద్వారా ఎన్‌బిఎఫ్‌సిలపై మరింత తీవ్ర ప్రభావం పడొచ్చని తెలిపింది.కాగా ఎంఎస్ఎంఇ రుణాల్లోనూ తగ్గుదల చోటుచేసుకోనుందని అంచనా వేసింది. ఈ రంగం రుణాలు ప్రతికూలత నుంచి స్థిరత్వానికి చేరొచ్చని పేర్కొంది. ఇది వరకు ప్రభుత్వం చేపట్టిన నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) వల్ల ఇంకా ఎగవేతల పర్వం కొనసాగుతుందని ఇండియా రేటింగ్స్ విశ్లేషించింది.

పిఎస్‌బిలకు రూ.60వేల కోట్లు..

2018-19 నాలుగో త్రైమాసికంలో రూ.66,000 కోట్ల మూలధనం అవసరమని ఈ ఎజెన్సీ పేర్కొంది. ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరాల్లో రుణల జారీలో 10-11 శాతం వృద్ధి నమోదు కావచ్చొని అంచనా వేసింది. ప్రభుత్వం అందించే మూలధనం కూడా ఏమాత్రం సరిపోదని పేర్కొంది. 2019-20లో చాలా వరకు ప్రభుత్వ రంగ బ్యాంకులు లాభాల్లోకి రావొచ్చని అంచనా వేసింది. డిపాజిట్లలో తీవ్ర పోటీ ఉండొచ్చని.. వీటిలో 6 శాతం వృద్ధి మాత్రమే నమోదయ్యే అవకాశాలున్నాయని తెలిపింది.

అమరావతిలో మాలక్ష్మీ ఫైవ్ స్టార్ హోటల్

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

అమరావతిలో ఐదు నక్షత్రాల హోటల్‌తో పాటు అంతర్జాతీయ ప్రమాణాలతో ఒక విద్యాసంస్థను కూడా నిర్మించనున్నట్లు మా లక్ష్మీ గ్రూప్ సంస్థ వ్యవస్థాపకులు వై హరిశ్చంద్ర ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్ణీత కాలంలోనే ఈ రెండు ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన కార్యాచరణ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులకు సీడ్ యాక్సిస్ రోడ్డు ప్రక్కన బుధవారం భూమిపూజ చేపట్టనున్నామని వివరించారు. రూ.200 కోట్ల అంచనా వ్యయంతో మాలక్ష్మి డబుల్ ట్రీ బై హిల్టన్ పేరిట ఐదు నక్షత్రాల హోటల్ రూపుదిద్దుకోనుందని వివరించారు. 2000 మంది ఏకకాలంలో వీక్షించగలిగేలా కన్వెన్షన్ సెంటర్, వరల్డ్ క్లాస్ స్విమ్మింగ్ పూల్, సర్వీస్ అపార్ట్‌మెంట్స్ సైతం ఈ నిర్మాణంలో అంతర్భాగంగా ఉంటాయని తెలిపారు. ఐదు నక్షత్రాల హోటల్ రంగంలో అగ్రగామి బ్రాండ్‌గా పేరు గాంచిన హిల్టన్‌తో తాము భాగస్వామ్యమైనట్లు మాలక్ష్మి ముఖ్య కార్యనిర్వహణ అధికారి సందీప్ మండవ తెలిపారు.

అనంతపురంలో స్విగ్గీ సేవలు

హైదరాబాద్ : ప్రముఖ ఫుడ్ ఆర్డరింగ్, డెలివరీ సేవల సంస్థ స్విగ్గీ తాజాగా అనంతపురంలో విస్తరించినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. ఈ జిల్లా కేంద్రంలోని 75 రెస్టారెంట్లతో ఇప్పటికే ఒప్పందం చేసుకున్నట్లు స్విగ్గీ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీవాట్స్ టిఎస్ పేర్కొన్నారు. తొలి ఐదు ఆర్డర్లపై వినియోగదారులకు 50 శాతం డిస్కౌంట్ అందిస్తున్నామన్నారు. అదే విధంగా దేశంలోని ముఖ్యమైన 75 నగరాలకు తమ సేవలను విస్తరించినట్లయ్యిందన్నారు.

ఉపాధి

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

కీటకాల ద్వారా జరిగే పరపరాగ సంపర్కాన్ని ఏమంటారు?

(జనరల్ సైన్స్) మొక్కలు - శాఖీయ భాగాలు



ఎస్‌పి మనోహర్ కుమార్,
టీచర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
నున్న, కృష్ణా జిల్లా.
సెల్ : 9490300637

మొక్కల్లో శాఖీయభాగాలైన వేరు, కాండంతోపాటు పత్రాలూ **'శాఖీయ ప్రత్యుత్పత్తి'** ని జరుపుతాయి. రణపాల మొక్కల్లో పత్రం ద్వారా శాఖీయ ప్రత్యుత్పత్తిని జరిపి, కొత్త మొక్కలను ఏర్పరుస్తాయి.

✧ **పత్రం :** కాండం, శాఖలపై ఏర్పడే పార్శ్వ ఉపాంగాలను **'పత్రాలు'** అంటారు. పత్రాలు కిరణజన్య సంయోగక్రియను జరుపుతాయి. పత్రరంధ్రాల ద్వారా వాయువుల మార్పిడి, భాష్పోత్సేకాన్ని జరుపుతాయి. అతి పొడవైన మొక్క రాఫియా వినిఫెరా. దీని పత్రాలు 10 మీటర్ల నుంచి 15 మీటర్ల వరకూ పెరుగుతాయి. అతి వెడల్పయిన పత్రం విక్టోరియా అమెజోనికా. ఇది 15 మీటర్ల నుంచి 18 మీటర్ల వెడల్పు వరకూ పెరుగుతుంది. ఒకే పత్రం గల మొక్క మోనోఫిల్లియా, రెండు పత్రాలు గల మొక్క వెల్‌విట్చియో, అతిచిన్న ఆవృతబీజ మొక్క ఉల్ఫియా, అతిపొడవైన ఆవృత బీజం యూకలిప్టస్. ఇది 114 మీటర్ల పొడవు వరకూ పెరుగుతుంది.

పత్రాల్లో ఉండే గీతల వంటి నిర్మాణాలను 'ఈనెలు' అంటారు. వీటి నుంచి పార్శ్వ ఈనెలు, పిల్ల ఈనెలు ఏర్పడతాయి. ఇలా ఈనెల అమరిక కలిగి ఉండటాన్ని **'ఈనెల వ్యాపనం'** అంటారు. ఈనెల వ్యాపనం రెండు రకాలుగా ఉంటుంది.

1. జాలాకార ఈనెల వ్యాపనం : పత్రంలో ఒక మధ్యఈనె, దాని నుంచి పార్శ్వ ఈనెలు ఏర్పడి వలలాంటి అమరిక ఏర్పడటాన్ని 'జాలాకార ఈనెల వ్యాపనం' అంటారు.

2. సమాంతర ఈనెల వ్యాపనం : ఇది సాధారణంగా ఏకదళ బీజ మొక్కల్లో ఏర్పడి ఉంటుంది. పత్రంలో ఒక మధ్యఈనె దాని నుంచి సమాంతరంగా పార్శ్వ ఈనెలు ఏర్పడి ఉంటాయి.
ఉదా : వరి, గోధుమ, అరటి.

✧ **పత్ర రూపాంతరాలు :** పత్రం వివిధ క్రియలు నిర్వర్తించడానికి రకరకాలుగా మార్పు చెందుతుంది. దీనిని పత్రరూపాంతరాలు అంటారు.

1. ప్రత్యుత్పత్తి పత్రాలు : ఇవి కొత్త మొక్కలు ఏర్పడటానికి ఉపయోగపడతాయి.
ఉదా : రణపాల (బ్రయోఫిల్లమ్)

2. కీటకాహార పత్రాలు : వీటిని బోను పత్రాలు లేదా మాంసాహార పత్రాలు అంటారు. ఈ మొక్కలు స్వయం పోషకాలు. కిరణజన్య సంయోగక్రియను జరుపుతాయి. కానీ నత్రజని లోపించిన నేలల్లో పెరగడం వల్ల ప్రోటీన్ల ఉత్పత్తి లేకపోవడం వల్ల మొక్క పెరుగుదల మందగిస్తుంది. కాబట్టి ఇవి కీటకాలను ఆహారంగా తీసుకుంటాయి. ఇవి అస్సాం అడవుల్లో ఎక్కువగా పెరుగుతాయి. నెపంథిస్ అనే మొక్కను **పిచ్చర్ ప్లాంట్** (కూజా మొక్క) అని, డ్రాసిరా మొక్కను **సన్‌డ్యూ ప్లాంట్** అని, యుట్రిక్యులేరియా మొక్కను **బ్లాడర్ వర్ట్** అని, డయోనియా అనే మొక్కను **వీనస్ ఫ్లై ట్రాప్** అని అంటారు.

3. పొలుసాకులు : ఇవి పలుచగా గానీ, రసభరితంగా గానీ ఉంటాయి. పసుపు, అల్లంలో పలుచగా, తెల్లగా ఉంటాయి. ఉల్లి, వెల్లుల్లిలో ఈ పొలుసాకులు రసభరితంగా ఉంటాయి.

4. నులితీగలు : బఠానీ వంటి మొక్కల్లో సన్నగా, పొడవుగా ఉండి ఎగబాకడానికి తోడ్పడతాయి.

✧ **మొక్కల్లో వివిధ శాఖీయ ప్రత్యుత్పత్తి నిర్మాణాలు :** పిలక మొక్కలు ఏర్పడటం ద్వారా అరటి, చేమంతిలో కొత్త మొక్కలు ఏర్పడతాయి. మొక్క కొమ్మల ద్వారా స్పైరోగైరా, అనబినా, నాస్టాక్, వేరు నుంచి కరివేపాకు, వేప, కాండం కణుపుల నుంచి గులాబి, చెరకు, మందారంలో, కొమ్ము నుంచి, అల్లం, పసుపు, బంగాళాదుంపలో కన్నులద్వారా, అంతర తామర, గుర్రపు డెక్కల్లో ఆఫ్‌సెట్ ద్వారా, గడ్డిజాతుల మొక్కల్లో రన్నర్స్ ద్వారా కొత్తమొక్కలు ఏర్పడతాయి.

✧ **మొక్కలలో లైంగిక భాగాలు :** మొక్కల్లో పుష్పం లైంగిక భాగంగా పేర్కొంటారు. పుష్పాలు విన్యాసాక్షంపై అమరి ఉండే విధానాన్ని **'పుష్ప విన్యాసం'** అని అంటారు. ఈ పుష్ప విన్యాసం వివిధ మొక్కల్లో వివిధ రకాలుగా ఉంటుంది. ఆవాలు, ముల్లంగిలో సామాన్య అనిశ్చితంగానూ, వరి, జొన్నలో కంకి రూపంలోనూ, మల్బరీలో కాట్‌కిన్‌గా, అరటిలో స్పాడిక్స్‌గా, కొత్తిమీర, కారట్‌లో అంబెల్‌గా, గడ్డిచామంతి, పొద్దుతిరుగుడులో శీర్షవత్ పుష్పవిన్యాసంగా, మర్రిలో హైపన్‌థోడియంగానూ, యూఫర్బియాలో సయాథియంగానూ, తులసిమొక్కలో వర్టిసిల్లాస్టర్‌గానూ పుష్పవిన్యాసాలు ఉంటాయి. అతిపెద్ద పుష్పవిన్యాసం అమార్ఫోఫాలస్ టైటానంలో, అతిపెద్ద శాఖీయ మొగ్గ క్యాబేజీలోనూ ఉంటుంది.

పుష్పాలను ఇచ్చే మొక్కల పెంపకాన్ని **'ఫ్లోరికల్చర్'** అని, పుష్ప అధ్యయనాన్ని **'అంథాలజీ'** అని అంటారు. పుష్పానికి ఉండే కాడను 'పుష్పాసనం' అంటారు. పుష్పంలోని భాగాలు నాలుగు రకాలు :

1. రక్షక పత్రాలు
2. ఆకర్షణ పత్రాలు
3. కేసరావళి
4. అండకోశం.

✧ **రక్షక పత్రాలు :** పుష్పం మొగ్గ దశలో రక్షించడానికి అనువుగా ఉండే ఆకుపచ్చ నిర్మాణాలు.

✧ **ఆకర్షణ పత్రాలు :** ఇవి వివిధ రంగుల్లో ఉంటాయి. కీటకాలను ఆకర్షిస్తాయి. రక్షక పత్రాలు, ఆకర్షణ పత్రాలు రెండింటినీ అనావశ్యక అంగాలు అంటారు.


✧ **కేసరావళి :** ఇవి పురుష ప్రత్యుత్పత్తి నిర్మాణాలు. ఇవి సూక్ష్మ, గుండ్రని నిర్మాణాలను ఉత్పత్తిచేస్తాయి. వీటిని పరాగరేణువులు అంటారు. వీటిని అధ్యయనం చేసే శాస్త్రాన్ని **'పేలినాలజి'** అంటారు.


✧ **అండకోశం :** ఇవి స్త్రీ ప్రత్యుత్పత్తి నిర్మాణాలు. వీటిలో అండాలు నిల్వ ఉండే అండాశయం, నాళాకార కీలం, కీలం చివర ఉబ్బిన కీలాగ్రం ఉంటాయి. కేసరావళి, అండాశయాన్ని అవశ్యక అంగాలు అంటారు.

✧ ఏకలింగ పుష్పాల్లో కేసరావళి లేదా అండకోశంలో ఏదో ఒకటి మాత్రమే ఉంటుంది. **ఉదా :** బొప్పాయి, వాలిస్‌నేరియా

✧ ద్విలింగ పుష్పాల్లో కేసరావళి, అండకోశం రెండూ ఉంటాయి. **ఉదా :** మందార, టమాటా, వంకాయ, బెండ, ఉమ్మెత్త

✧ **పరాగ సంపర్కం :** ఒక మొక్కలోని లేదా మరొక మొక్కలోని పరాగరేణువులు కీలాగ్రాన్ని చేరడాన్ని 'పరాగ సంపర్కం' అంటారు. ఒక మొక్కలోని పరాగరేణువులు అదే మొక్కలోని





కీలాగ్రాన్ని చేరితే **'ఆత్మపరాగ సంపర్కమనీ'** ఒక మొక్కలోని పరాగ రేణువులు మరొక మొక్కలోని కీలాగ్రాన్ని చేరితే **'పరపరాగ సంపర్కమని'** అంటారు. పరపరాగ సంపర్కం వివిధ పద్ధతుల్లో జరుగుతుంది.

✧ గాలిద్వారా జరిగే పరపరాగ సంపర్కాన్ని **'ఎనిమోఫైలీ'** అంటారు. **ఉదా :** వరి, గోధుమ

✧ నీటి ద్వారా జరిగే పరపరాగ సంపర్కాన్ని **'హైడ్రోఫైలీ'** అంటారు. **ఉదా :** వాలిస్‌నేరియా.

✧ జంతువుల ద్వారా జరిగే పరపరాగ సంపర్కాన్ని **'జూఫైలీ'** అంటారు.

✧ పక్షుల ద్వారా జరిగే పరపరాగ సంపర్కాన్ని **'ఆర్నితోఫైలీ'** అంటారు. **ఉదా :** బిగ్నోలియా

✧ కీటకాలద్వారా జరిగే పరపరాగ సంపర్కాన్ని **'ఎంటమోఫైలీ'** అంటారు. **ఉదా :** నైట్‌క్వీన్

✧ గబ్బిలం ద్వారా జరిగే పరపరాగ సంపర్కాన్ని **'కైరాప్టిరోఫైలీ'** అంటారు. **ఉదా :** కదంబము

✧ నత్తల ద్వారా జరిగే పరపరాగ సంపర్కాన్ని **'మొలకోఫైలీ'** అంటారు. **ఉదా :** అరాయిడ్స్.

✧ పాముల ద్వారా జరిగే పరపరాగ సంపర్కాన్ని 'ఒఫియోఫైలీ' అంటారు. **ఉదా :** అరిసీమ

✧ మాత్‌ల ద్వారా జరిగే పరపరాగ సంపర్కాన్ని **'కెథరాంథోఫైలీ'** అంటారు. **ఉదా :** యుక్కా

✧ ఏనుగుల ద్వారా జరిగే పరపరాగ సంపర్కాన్ని **'ప్రోబోసీడియోఫైలీ'** అంటారు. **ఉదా :** రఫ్లీషియా

✧ **ఫలదీకరణం :** పరాగరేణువులో రెండు ఏకస్థితిక పురుషబీజాలు ఏర్పడతాయి. ఇవి అండంలోని పిండకోశంలో ఉన్న స్త్రీ బీజంతో కలవడం వల్ల ఫలదీకరణం అంటారు. దీని వల్ల **ద్వయస్థితిక సంయుక్త బీజం** ఏర్పడుతుంది. అదేవిధంగా ద్వితీయ కేంద్రకాలతో ఒకటి కలవడం వల్ల జరిగే ఫలదీకరణం వల్ల **త్రయస్థితిక అంకురచ్ఛదం** ఏర్పడుతుంది. ఫలదీకరణ అనంతరం రక్షక పత్రాలు, ఆకర్షణ పత్రాలు, కీలం, కీలాగ్రం, కేసరాలు, సహాయకణాలు, ప్రతిపాదక కణాలు నశిస్తాయి. అండాశయం ఫలంగా.. అండాలు విత్తనాలుగా, సంయుక్తబీజం పిండంగా మార్పు చెందుతాయి. ఫలధీకరణ అనంతరం ఏర్పడిన ఫలాలు రెండురకాలుగా చెప్పవచ్చు.

1. అనృత ఫలం : ఇందులో అండాశయం కాకుండా ఇతర భాగాలు ఫలంగా మారతాయి. యాపిల్ ఫలంగా పుష్పాసనం మారుతుంది. జీడిమామిడిలో పుష్పవృంతం ఫలంగా మారుతుంది. అందువల్ల వీటిని అనృత ఫలాలు అంటారు.

2. నిజ ఫలం : అండాశయం ఫలంగా మారితే వాటిని నిజ ఫలం అంటారు.

✧ ఫలాల అధ్యయనం చేయడాన్ని **'పోమాలజి'** అంటారు. ఫలాల పెంపకాన్ని **'పోమికల్చర్'** అనీ అంటారు.

✧ టమాటా, జామ, వంకాయ, బొప్పాయి, అరటిలో ఏర్పడే ఫలాన్ని **'మృదుఫలం'** అని అంటారు.

✧ దోస, గుమ్మడిలో ఏర్పడే ఫలాన్ని **'పెపో'** అని అంటారు.

✧ సిట్రస్ జాతుల మొక్కల ఫలాన్ని **'హెస్పరిడియం'** అని అంటారు.

✧ బెండలో ఏర్పడే ఫలాన్ని **'గుళిక '** అని అంటారు.

✧ పైనాపిల్, పనసలో ఏర్పడే ఫలాన్ని **'సోరోసిస్'** అని అంటారు.

✧ మర్రిలో ఏర్పడే ఫలాన్ని **'సైకస్'** అని అంటారు.

✧ కొబ్బరి, మామిడిలో ఏర్పడే ఫలాన్ని **'డ్రూప్'** (టెంకెగల ఫలం) అని అంటారు.

✧ వరి, గోధుమలో ఏర్పడే ఫలాలను **'కవచ బీజక ఫలాలు'** (కారయోప్సిస్) అని అంటారు.

✧ ఆపిల్‌లో ఏర్పడే ఫలాలను **'పోమ్'** అంటారు.

★

ఉద్యోగాలు

షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్లో 40 పోస్టులు

ముంబైలోని షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్‌సీఐ)-మారిటైమ్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లోని జీఎంఈ కోర్సు ద్వారా మెరైన్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 40 (జనరల్-20, ఓబీసీ-11, ఎస్సీ-6, ఎస్టీ-3).

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 50% మార్కులతో మెకానికల్ ఇంజనీరింగ్‌లో బీఈ/బీటెక్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత. పదో తరగతి/ఇంటర్ స్థాయిలో ఇంగ్లీష్ సబ్జెక్టులో కూడా 50% మార్కులు తప్పనిసరిగా ఉండాలి.

వయసు: ఏప్రిల్ 1, 2019 నాటికి 28 ఏళ్లకు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు సడలింపు ఉంటుంది.

ఎంపిక: రాత పరీక్ష / ఇంటర్వ్యూ ద్వారా.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీలకు రూ.1000, ఎస్సీ, ఎస్టీలకు రూ.100.

దరఖాస్తుకు చివరితేదీ: ఫిబ్రవరి 11, 2019.

రాత పరీక్ష తేదీ: ఫిబ్రవరి 17, 2019.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో పరిశీలించొచ్చు.

వెబ్‌సైట్: www.shipindia.com

ఓపీఏఎల్‌లో 31 పోస్టులు

వడోదరలోని ఓఎన్‌జీసీ పెట్రో ఆడిషన్స్ లిమిటెడ్ (ఓపీఏఎల్) లో ఖాళీగా ఉన్న 31 ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు...

టెక్నికల్ పోస్టులు: పాలిమర్ ఆపరేషన్స్-6, యుటిలిటీస్ అండ్ ఆఫ్‌సైట్స్-2, సెంట్రల్ టెక్నికల్ సర్వీసెస్-1, ఆపరేషన్స్ కంట్రోల్ గ్రూప్-3, ఫైర్-2, మెకానికల్ మెయింటెనెన్స్-1, సివిల్-1.

బిజినెస్ సపోర్ట్ పోస్టులు: ఫైనాన్స్-4, మెటీరియల్స్ మేనేజ్‌మెంట్-3, ఎస్ఏపీ-3, హ్యూమన్ రీసోర్స్-4, లీగల్-1.

అర్హత, వయసు: సంస్థ నిబంధనల ప్రకారం.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో.

దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 10, 2019.

వెబ్‌సైట్: www.opalin-dia.in

సినీనటి భానుప్రియపై ప్రజాసంఘాల ఫిర్యాదు

ప్రజాశక్తి - కాకినాడ

బాలికలను పనిలో పెట్టుకొని వెట్టిచాకిరీ చేయించుకుంటున్న సినీనటి భానుప్రియతో పాటు ఆమె కుటుంబ సభ్యులపై తూర్పుగోదావరి జిల్లాలోని ప్రజాసంఘాల నేతలు జిల్లా ఉన్నతాధికారులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. బాలికలను పనిలో పెట్టుకున్న భానుప్రియ, ఆమె కుటంబ సభ్యులు గోపాలకృష్ణ, లక్ష్మీకాంతంపై బాలకార్మిక చట్టం, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు, బాలల అక్రమ రవాణా చట్టం, వెట్టిచాకిరీ నిర్మూలన చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ డిఆర్‌ఒ ఎస్‌విఎస్.సుబ్బలక్ష్మికి ఫిర్యాదు చేశారు. మరికొందరు ఇదే ప్రాంతానికి చెందిన బాలికలతో భానుప్రియ ఇంట్లో పని చేస్తున్నట్లు తెలిసిందన్నారు.



గుంటూరులో నిరసన ర్యాలీ చేస్తున్న జనసేన కార్యకర్తలు

జనసేన కార్యాలయంపై దాడి

నిరసనగా జనసైనికుల ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

గుంటూరు జిల్లాలో ఇటీవల పవన్ కల్యాణ్ ప్రారంభించిన జనసేన పార్టీ జిల్లా కార్యాలయంపై గుర్తు తెలియని దుండగులు దాడి చేశారు. దాడిని నిరసిస్తూ జనసైనికులు మంగళవారం ఇన్నర్ రింగురోడ్డులోని జనసేన కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. అనంతరం లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకూ నిరసన ప్రదర్శన చేపట్టారు. పోలీసులు పలుమార్లు అడ్డుకునే ప్రయత్నం చేసినా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు, మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని మండిపడ్డారు. గత సోమవారం అర్ధరాత్రి కార్యాలయంపై మద్యం సీసాలు విసిరి అద్దాలు ధ్వంసం చేసేందుకు యత్నించారని చెప్పారు. ఇందుకు పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జనసేనకు పెరుగుతున్న ఆదరణను టిడిపి, వైసిపి ఓర్వలేకపోతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వంపై ప్రజల్లోని తీవ్ర అసంతృప్తిని చూసిన చంద్రబాబుకు ముచ్చెమటలు పడుతున్నాయని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడలేని స్థితిలో వైసిపి ఉందని ఎద్దేవ చేశారు. గతనెల 27న నిర్వహించిన జనసేన బహిరంగ సభను అడ్డుకునేందుకు ఫ్లెక్సీలను తొలగించి, అడ్డంకులు సృష్టించినా జనం అండతో సభ విజయవంతమైందని, తమ పార్టీని ఎవరూ బెదిరించలేరని పేర్కొన్నారు.

బెంగాల్‌లో సిబిఐ దాడులు అప్రజాస్వామికం : నారాయణ

ప్రజాశక్తి-తిరుపతి సిటీ

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బిజెపికి వ్యతిరేకంగా పోరాడుతున్న సెక్యులర్ పార్టీలపై సిబిఐ దాడులు దారుణమని, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమైన చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. మంగళవారం తిరుపతిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సెక్యులర్ పార్టీలపై మోడీ జరుపుతున్న దాడులను దేశ ప్రజలు హర్షించరన్నారు. 2014లో శారదా స్కాంపై కోర్టు ఉత్తర్వు ఉన్నా ఐదు సంవత్సరాలుగా చర్యలు లేవని, ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో సిబిఐ అతిగా వ్యవహరించడం వాంఛనీయం కాదన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎ.రామానాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు జనార్ధన్, విశ్వనాథ్, చిన్నం పెంచులయ్య. తదితరులు పాల్గొన్నారు.

మత్స్య విశ్వవిద్యాలయం ఏర్పాటుకు అనుమతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న విద్యా సంవత్సరం నుండి రాష్ట్రంలో మత్స్య, సముద్ర విశ్వ విద్యాలయాన్ని ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో ఏర్పాటు చేసేందుకు అనుమతించినట్లు రాష్ట్ర మార్కెటింగ్, గిడ్డంగులు, పశుగణాభివృద్ధిశాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి తెలిపారు. అనుమతి పత్రాలను మంగళవారం మంత్రి ప్రైవేటు యాజమాన్య ప్రతినిధికి అందజేశారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం సమీపంలోని లోసరిలో 150 ఎకరాల్లో రూ.300 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇది దేశంలో మూడోదని, ఇప్పటికే తమిళనాడు, కేరళ తర్వాత రాష్ట్రంలో ఇది ఏర్పాటవుతోందని పేర్కొన్నారు. ఈ యూనివర్శిటీలో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్, పిహెచ్‌డి, ఎంబిఎ, మెరైన్ లా కోర్సులు ఉంటాయని తెలిపారు. పిజి కోర్సులకు ఎంసెట్ ద్వారా ప్రవేశాలు నిర్వహిస్తామని చెప్పారు. దీనిలో 51 శాతం వాటాకు ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ముందుకొచ్చిందని చెప్పారు. ప్రభుత్వం వాటా 49 శాతం ఉంటుందని వివరించారు. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి దమయంతి తదితరులు పాల్గొన్నారు.

12న బోయల చలో ఢిల్లీ

మంత్రి కాలువ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వాల్మీకి, బోయలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని కోరుతూ 12వ తేదీన ఢిల్లీలో ధర్నా నిర్వహించనున్నట్లు రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కాలువ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అత్యంత ప్రాచీన గిరిజన తెగగా ఎప్పటి నుంచో అధారాలున్నా వాల్మీకి, బోయలను నేటికీ గిరిజనులుగా గుర్తించకపోవడం విచారకమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వాల్మీకి, బోయల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై ప్రొఫెసర్ సత్యపాల్ కమిటీ చేత అధ్యయనం చేయించిందన్నారు. వాటి ఆధారంగా క్యాబినెట్‌లో సానుకూల నిర్ణయం తీసుకున్నామని, అసెంబ్లీ తీర్మానాన్ని పంపి 14 నెలలు గడుస్తున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో 12వ తేదీన ఢిల్లీలో ధర్నా నిర్వహించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

చెట్టుపై నుండి చిరుత పరారీ

ప్రజాశక్తి - ఆత్రేయపురం (తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురం మండలం అంకంపాలెంలో సోమవారం అర్ధరాత్రి అటవీ వన్యప్రాణి అధికారుల నిర్లక్ష్యంతో తప్పించుకున్న చిరుత ఆచూకీ మంగళవారం రాత్రి వరకూ లభ్యం కాలేదు. ఇంతవరకూ చిరుత ఆచూకీ దొరక్కపోవడం అధికారుల వైఫల్యమేనంటూ అంకంపాలెం గ్రామస్తులు మండిపడ్డారు. మంగళవారం ఉదయం నుంచి పొలాల్లో అటవీశాఖ, వన్యప్రాణి అధికారులు, పోలీసులు జల్లెడ పట్టినా ఫలితం లేకపోయింది. ఇదిలా ఉండగా అన్ని గ్రామాల్లో దండోరా వేయించి, అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులను అధికారులు హెచ్చరించారు.

రుణమాఫీ కోసం కౌలు రైతుల నిరసన

- విజయవాడ ప్లానింగ్ బోర్డు కార్యాలయం వద్ద ఆందోళన
- రైతులపై ఒత్తిడి చేయకుండా బ్యాంకులకు ఆదేశాలివ్వాలని డిమాండ్
- గుంటూరులో కౌలు రైతులపై టిడిపి నేత ఆగ్రహం



విజయవాడలోని ఎపి స్టేట్ ప్లానింగ్ బోర్డు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కౌలు రైతులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ఆర్‌ఎంజి, జెఎల్‌జి గ్రూపులు, చిన్న, సన్న కారు రైతులకు తక్షణమే రుణమాఫీ అమలు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యాన కౌలు రైతులు మంగళవారం ఆందోళన చేపట్టారు. విజయవాడ బెంజిసర్కిల్ వద్ద గల ఎపి స్టేట్ ప్లానింగ్ బోర్డు కార్యాలయం, గుంటూరు జిల్లా కొల్లూరులోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వద్ద కౌలు రైతులు నిరసనలు తెలిపారు.

విజయవాడ బెంజిసర్కిల్ వద్ద గల ఎపి స్టేట్ ప్లానింగ్ బోర్డు కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడారు. జెఎల్‌జి, ఆర్‌ఎంజి గ్రూపు రైతులకు రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సర్వే నెంబరు లేకపోయినా రుణమాఫీ అని గతంలో హామీ ఇచ్చారని, కానీ ఇప్పటి వరకు రుణమాఫీ జరగలేదన్నారు. దీంతో డబ్బులు చెల్లించాలని బ్యాంకర్లు రైతులపై ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించి రుణాలను మాఫీ చేయాలని, రైతులపై ఒత్తిడి చేయకుండా బ్యాంకులకు ఆదేశాలివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు, నాయకులు పంచకర్ల రంగారావు, కొల్లి వెంకట రాము, చేబ్రోలు భాస్కరరావు, ఎన్.కొండలు, మెట్లపల్లి రవి, వాకా రామచంద్రరావు, బి.వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు టిడిపి బెదిరింపు

రుణాల కోసం గుంటూరు జిల్లా కొల్లూరులోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వద్ద ఆందోళన చేస్తున్న కౌలుదారులపై టిడిపి మండల నాయకుడు, కృష్ణా, పశ్చిమ డెల్టా చైర్మన్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక బ్యాంకు శాఖ వద్ద కౌల్దార్లు సోమవారమే ధర్నా చేసినా ఎస్‌ఐ హామీ మేరకు విరమించారు. అది అమలు కాకపోవడంతో మంగళవారం మరోసారి ఆందోళన చేపట్టారు. దీంతో బ్యాంకు సిబ్బంది బ్యాంకును మూసేసి బయటకు రావడంతో సమీపంలోని రహదారిపై కౌల్దార్లు రాస్తారోకో చేపట్టారు. ఇది తెలిసిన జిడిసిసిబి చైర్మన్ ముమ్మనేని వెంకటసుబ్బయ్య, టిడిపి నాయకులు, కృష్ణా పశ్చిమ డెల్టా చైర్మన్ మైనేని మురళీకృష్ణ అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. హామీల్లేకుండా రుణాలివ్వాలనే ఆదేశాల్లేవని, ఇప్పుడున్న టర్నోవర్ రైతులకు రుణాలు, ఉద్యోగుల జీతాలకే సరిపోతుందని చెప్పారు. ఏప్రిల్ తర్వాత చూద్దామని వెంకటసుబ్బయ్య చెప్పి అందర్నీ పక్కకు తీసుకెళ్లి మాట్లాడే ప్రయత్నం చేశారు. టిడిపి నాయకులు మురళీకృష్ణ కౌలుదారులు, మహిళలపై ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు సంఘం గుంటూరు తూర్పు జిల్లా అధ్యక్షులు టి.సురేష్‌తో వాగ్వాదానికి దిగారు. నిన్ను ఏమి చేయాలో అది చేస్తానని సురేష్‌ను, మీ పనులు ఎలా అవుతాయో చూస్తానని కౌలు రైతులను బెదిరించాడు. ఒక దశలో కలబడ్డానికి వచ్చారు. అయితే పోలీసులు, కౌలు రైతులు సర్ది చెప్పారు. ఏప్రిల్ తర్వాత రుణాలిచ్చే ప్రయత్నం చేస్తామని జిడిసిసిబి చైర్మన్ చెప్పడంతో ఆందోళన ముగిసింది.



కార్యక్రమంలో మాట్లాడుతున్న శాసనమండలి పిడిఎఫ్ ఫ్లోర్‌లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం

సిపిఎస్ రద్దు చేయకపోతే ఉద్యమం

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల హెచ్చరిక

రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని వెల్లడించాలని ఎమ్మెల్సీల డిమాండ్

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

రాష్ట్ర ప్రభుత్వం కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ సంఘం (యుటిఎఫ్) ఆధర్యంలో సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ చేపట్టిన పాదయాత్ర మంగళవారం విజయవాడలో ముగిసింది. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో ఆదివారం ప్రారంభమైన పాదయాత్ర మంగళవారం సాయంత్రం విజయవాడ ధర్నా చౌక్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా అక్కడ నిర్వహించిన ముగింపు సభలో శాసనమండలిలో పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడారు. సిబిఐని రాష్ట్రంలో అడుగుపెట్టనీయబోమని కేంద్రంతో పోరాటం చేస్తున్న చంద్రబాబు ప్రభుత్వం అదే స్ఫూర్తితో రాష్ట్రంలో కేంద్రం ప్రవేశపెట్టిన సిపిఎస్ విధానాన్ని కూడా రద్దు చేస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులను భ్రమలకు గురిచేయకుండా సిపిఎస్‌పై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలిలో సిపిఎస్ అంశాన్ని ప్రధాన ఎజెండాగా తీసుకొస్తామన్నారు. మరో ఎంఎల్‌సి యండవల్లి శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ సిపిఎస్ జీవోలు 652, 653, 654లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ పాలకులు ఎన్నికల ముందు కంటితుడుపు చర్యలు తీసుకోకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఏపీ ఎన్‌జీవోస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సిపిఎస్ రద్దుకు అవసరమైతే సమ్మెకు కూడా సిద్ధమన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సాబ్జీ, ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి, కార్యదర్శులు సుందరరావు, గిరిధర్, మహిళా కన్వీనర్ విజయగౌరీ, కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు జోసఫ్ సుధీర్, హృదయరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకూ పోరాటం ఆపొద్దు : మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

పాత పెన్షన్ విధానం అమలు చేసే వరకు పోరాటం ఆపొద్దని పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. యుటిఎఫ్ పాదయాత్ర గన్నవరం నుండి బయలుదేరి గూడవల్లి, ప్రసాదంపాడు, రామవరప్పాడు మీదుగా విజయవాడ చేరింది. గన్నవరంలో పాదయాత్రకు మద్దతుగా లక్ష్మణరావు మాట్లాడారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల భవిష్యత్తుకు సిపిఎస్ విధానం గొడ్డలి పెట్టు వంటిదని అన్నారు.

పంచ గ్రామాల భూ సమస్యను పరిష్కరించాలి

ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు



ధర్నాలో మాట్లాడుతున్న మధు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ జిల్లా పంచగ్రామాల భూ సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, సమస్య పరిష్కారానికి తక్షణమే అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి. మధు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్‌తో మాట్లాడి కార్యాచరణను నిర్ణయిస్తామని ఆయన తెలిపారు. సమైక్య ప్రజా, రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విజయవాడ అలంకార్ సెంటర్‌లో మంగళవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. పంచగ్రామాల ప్రజలు చేస్తున్న పోరాటానికి ఆయన మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచగ్రామాల సమస్య ప్రభుత్వం పరిష్కరించాలనుకుంటే పది నిమిషాల్లో పరిష్కరించగలదన్నారు. ప్రభుత్వం, అధికారులు సమస్యను సృష్టించారని ఆయన ఆరోపించారు. 1996-97 సంవత్సరంలో సింహాచలం దేవస్థానానికి పెందుర్తి, చినగదిలి తహసీల్దార్లు మొత్తం భూమిని రైత్వారీ పట్టాలు ఇవ్వడంతో ఈ సమస్య ఉత్పన్నమైందన్నారు. రెవెన్యూ భూములను ఆయా గ్రామాల ప్రజలు కొనుగోలు చేశారని, వారిపైన వేధింపులు ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయా గ్రామాల్లో 12వేలకు పైగా కుటుంబాలు, లక్షమందికి పైగా ప్రజలు ఈ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజ శర్మ మాట్లాడుతూ పంచగ్రామాల సమస్యను 100 రోజుల్లో పరిష్కరిస్తామని 2014 జూన్ 12న విశాఖలో జరిగిన మొదటి క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నప్పటికీ నేటికీ ఈ సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇంటి య జమాని అయినప్పటికీ ఇళ్లు రిపేరు చేసుకోవడానికి , క్రయ, విక్రయాలు చేసుకోవడానికి వీల్లేకుండా ఉందన్నారు. 2008 ప్రభుత్వ సర్వే ప్రకారం 12,149 కుటుంబాలు ఈ సమస్యలో ఉన్నట్లు గుర్తించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పంచ గ్రామలైన అడవివరం, వెంకటాపురం, వేపగుంట, పురుషోత్తమ పురం, చీమలా పురం గ్రామాల ప్రజల న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. 96,97లో దేవస్థానానికి ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలని, హైకోర్టు ఆదేశానుసారం యథాతథ స్థితిని కొనసాగిస్తూ ఇళ్ల స్థలాల యజమానులకు కూడా నిర్మాణాలకు అనుమతించాలని డిమాండ్ చేశారు. 275 సర్వే నెంబర్‌లో అందరికీ పట్టాలివ్వాలని, కలెక్టర్ సూచనకు అనుగుణంగా ఈ భూమిని ఇనాం భూమిగా కాకుండా ఎస్టేట్ భూమిగా పరిగణించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమైక్య ప్రజా, రైతు సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వైకెనాయుడు, టివి కృష్ణంరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.రమణి, కోశాధికారి కె.సన్యాసిరావు పాల్గొన్నారు.

అప్పు చెల్లించలేదనే హత్య

జయరాం హత్యకేసులో వీడిన చిక్కుముడి

నిందితుల అరెస్ట్ : ఎస్‌పి సర్వశ్రేష్ట త్రిపాఠి

ప్రజాశక్తి - నందిగామ (కృష్ణా)

ప్రముఖ పారిశ్రామికవేత్త, కోస్టల్ బ్యాంక్ ఎండి చిగురుపాటి జయరామ్ హత్యకేసులో ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేశామని జిల్లా ఎస్‌పి సర్వశ్రేష్ట త్రిపాఠి తెలిపారు. కృష్ణాజిల్లా నందిగామలోని డిఎస్‌పి కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ముద్దాయిలను మీడియా ముందు ప్రవేశపెట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హత్య వివరాలను వెల్లడించారు. గతనెల 31వ తేదీ ఉదయం 11 నుంచి 12 గంటల మధ్యలో దస్పల్ హోటల్ నుంచి జయరామ్ వెళ్లిపోయేందుకు ప్రయత్నించగా నిందితుడు రాఖేష్‌రెడ్డి చేత్తో దవడపై గట్టిగా పలుమార్లు కొట్టాడు. దీంతో ముక్కు, నోటి నుంచి రక్తం కారుతూ హోటల్ రూమ్‌లోని సోఫోలో జయరామ్ పడిపోయాడు. ఆ తర్వాత మొహం మీద గట్టిగా చేతులు వేసి సోఫా కేసి రాకేష్ నొక్కేశాడు. ఆ సమయంలో వాచ్‌మెన్ శ్రీనివాస్ జయరామ్ కాళ్లు పట్టుకొని కదలకుండా చేశాడు. జయరామ్ మృతి చెందినట్లు ధృవీకరించుకున్న తర్వాత జయరామ్ కారులోనే అతని మృతదేహాన్ని ఉంచి ఒక్కడే హైదరాబాదు నుంచి బయలుదేరి నందిగామ మండలం ఐతవరం శివారులోకి తీసుకువచ్చాడు. ప్రమాదం జరిగినట్లుగా మృతదేహాన్ని స్టీరింగ్ వద్ద ఉండేలా పడేశాడు. దగ్గరలో మద్యం బాటిళ్లు ఉండేలా ఏర్పాటు చేశాడు. ఆ తర్వాత మృతదేహంతో కారును అక్కడే వదిలి హైదరాబాద్ పారిపోయాడు. ఈ కేసు నుంచి రాఖేష్‌రెడ్డి బయట పడటానికి హైదరాబాద్ నల్లకుంట సిఐ శ్రీనివాస్, ఇబ్రహీంపట్నం ఎసిపి మల్లారెడ్డి సలహాలు తీసుకున్నాడని ఎస్‌పి వివరించారు. హత్య కేసు దర్యాప్తు ఇంకా పూర్తికాలేదన్నారు. హత్యకు సహకరించిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో నందిగామ డిఎస్‌పి ఎస్‌సి బోస్, సిఐ పివి రమణ, ఎస్ఐలు పరిమి కిషోర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

శిఖానే ప్రధాన సూత్రధారి పద్మశ్రీ ఫిర్యాదు

తన భర్త హత్య కేసులో ప్రధాన సూత్రధారి శిఖా చౌదరి అని జయరామ్ భార్య పద్మశ్రీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఈ కేసులో నిందితుడికి సహకరించిన సిఐ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేశారు. ఎసిపి మల్లారెడ్డిపై బదిలీ వేటు వేశారు.

హమాలీ, ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గఫూర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

హమాలీ కార్మికులకు గుర్తింపుకార్డులు, పిఎఫ్, ఇఎస్ఐ పథకాలతో కూడిన సమగ్ర చట్టం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం ఎపి హమాలీ రాష్ట్ర ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ముఠా, జట్టు, కళాసీ కార్మికుల సమస్యలపై ఛలో విజయవాడ కార్యక్రమం నిర్వహించారు. తొలుత విజయవాడ రైల్వేస్టేషన్ నుంచి అలంకార్ సెంటర్ వద్ద ధర్నాచౌక్ వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ముజఫర్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిధిగా ఆయన పాల్గొని ప్రసంగించారు. లక్షల కోట్ల రూపాయలు బడ్జెట్‌లు ప్రవేశ పెడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముఠా కార్మికుల సంక్షేమం గాలికోదిలేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. హమాలీలంతా సంఘటితంగా పోరాడి సమగ్ర చట్టాన్ని సాధించుకోవాలని పిలుపునిచ్చారు. హమాలీ రాష్ట్ర ఫెడరేషన్ (సిఐటియు) కన్వీనర్ కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల మాదిరిగా ముఠా కార్మికులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని, అధిక బరువులను నిషేధించాలని డిమాండ్ చేశారు. ఫెడరేషన్ కో కన్వీనర్ ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ హమాలీలకు పనిభద్రత లేదని, ప్రమాదాలకు గురైతే పట్టించుకునే దిక్కులేదని, వెంటనే వీరికి చట్టం తేవాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర నాయకులు యం సీతారాములు, బ్రహ్మయ్య, రంగారావు, సుబ్బారావు, సుబ్రహ్మణ్యం, బేవరేజ్ హమాలీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి కొండలరావు, సివిల్ సప్లైయిస్ హమాలీ యూనియన్ అధ్యక్షు, కార్యదర్శులు ఆర్ కృష్ణ, ఎస్ ఉదయభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న గఫూర్

ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే ఆందోళనలు ఉధృతం

ప్రజాశక్తి - ఒంటిమిట్ట(కడప)

కడప జిల్లా సోమశిల ప్రాజెక్టు ముంపు వాసులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అన్వేష్ హెచ్చరించారు. మంగళవారం మాధవరం-1లో జరుగుతున్న దీక్షలు మూడవ రోజుకు చేరుకున్న సందర్భంగా జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దవటం రెవెన్యూ యంత్రాంగం పేదల పట్ల వివక్ష చూపుతుందని పేర్కొన్నారు. భూ కబ్జాదారులు పేదల గుడిసెలు కూల్చి, కాల్చిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పేదల సమస్యలు పరిష్కరించకపోతే రానున్న కాలంలో పోరాటాలు తప్పవని హెచ్చరించారు.

రైల్వే కాంట్రాక్టు కార్మికుల ధర్నా

జీతాలు చెల్లించాలంటూ ర్యాలీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జీతాలు చెల్లించాలని కోరుతూ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో కాంట్రాక్టు రైల్వే కార్మికులు ధర్నా చేపట్టారు. విజయవాడ కోచింగ్ డిపోలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఎజిల్ అనే సంస్థ రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడానికి వ్యతిరేకంగా మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. రైల్వే డిఆర్‌ఎం కార్యాలయం ముందు చేపట్టిన ధర్నాలో రాష్ట్ర నాయకులు వివిఎల్ నరసింహులు, ఎస్‌ఎమ్ సుభాని మాట్లాడుతూ రైల్వే యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై జోక్యం చేసుకుని జీతాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. సకాలంలో జీతాలిచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పిఎఫ్, ఇఎస్ఐ తదితర సదుపాయాలను చట్టబద్ధంగా అమలు చేయించే బాధ్యతను రైల్వే అధికారులు తీసుకోవాలని, అధికారుల నిర్లక్ష్యం వల్ల కార్మికులకు సకాలంలో జీతాలు లభించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నా అనంతరం విజయవాడ డిఆర్‌ఎంకు వినతిపత్రాన్ని అందించారు. ధర్నాలో సిఐటియు నాయకులు సత్తిబాబు, యూనియన్ నాయకులు కె వి రమణమ్మ, బుజ్జమ్మ, చందు, సునీల్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



విజయవాడ డిఆర్‌ఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

ఆశా వర్కర్ల ఆందోళన

ప్రజాశక్తి- అరకురూరల్ (విశాఖపట్నం)

సమస్యలను పరిష్కరించాలని విశాఖ జిల్లా అరకులోయ మండలం సుంకరమెట్ట, గన్నెల పిహెచ్‌సిల వద్ద ఆశా వర్కర్లు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు, గిరిజన సంఘం నాయకులు రామారావు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఆశావర్కర్ల సుదీర్ఘ పోరాట ఫలితంగా జీతాలను ప్రభుత్వం పెంచిందని, తక్షణమే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గౌరవ వేతనం రూ.6 వేలు దాటకుండా సీలింగ్ విధించి మోసం చేసిందని విమర్శించారు. ఆంక్షలు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ ఆశా వర్కర్లకు జీతాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

మరోసారి పాక్ కాల్పుల ఉల్లంఘన

భారత శిబిరాలపై రాకెట్ లాంచర్ల ప్రయోగం

జమ్మూ : కాల్పుల విరమణ ఒప్పందాన్ని పాక్ మంగళవారం మరోసారి ఉల్లంఘించింది. జమ్మూకాశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో ఉన్న క్రిష్ణగటి సెక్టార్ పరిధిలోని భారత సైనిక శిబిరాలపై రెండు రౌండ్ల రాకెట్ లాంచర్లు ప్రయోగించిందని సైనిక అధికారులు వెల్లడించారు. పాక్ ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టేందుకే ఇటువంటి చర్యలకు దిగిందన్నారు. సరిహద్దు ప్రాంతాల ప్రజలను దృష్టిలో ఉంచుకొని తమ దళాలు ప్రతిఘటించలేదని, అయితే ఈ దాడిలో ఎటువంటి నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. ఇటీవల పాక్ తరచుగా కాల్పులకు దిగుతోందన్నారు. జనవరి 15న జరిగిన కాల్పుల్లో బిఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వినయ్ చంద్, 11న మరో ముగ్గురు మృతిచెందారని తెలిపారు. గత 15 సంవత్సరాల కాలంలో ఒక్క 2018 లోనే పాక్ 2,936 సార్లు కాల్పుల ఉల్లంఘనకు పాల్పడిందని వెల్లడించారు.



నిరసన

ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా మంగళవారం ప్రసంగిస్తున్న గవర్నర్‌కు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న ప్రతిపక్ష శాసనసభ్యులు

సైన్యాన్ని వేధిస్తున్న నిధుల కొరత...!

అధికారుల టిఎ, డిఎలకు కూడా డబ్బుల్లేవట...

న్యూఢిల్లీ: సైన్యానికి సంబంధించిన ఖర్చుల కోసం చెల్లించేందుకు రక్షణ శాఖ వద్ద అవసరమైన నిధులు లేవన్న విషయం వెలుగు చూసింది. క్షేత్ర స్థాయి విన్యాసాలు, లేదా శిక్షణా కార్యక్రమాలకు తాత్కాలిక ప్రాతిపదికన విధులు కేటాయించబడిన అధికారులకు రవాణా, దినసరి భత్యాలు చెల్లించేందుకు అవసరమైన నిధులకు తీవ్ర కొరత ఏర్పడిందని ప్రిన్సిపల్ కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్ (పిసిడిఎ) తన వెబ్‌సైట్‌లో వెల్లడించింది. తదుపరి నిధులు విడుదల అయ్యే వరకూ ఎటువంటి అడ్వాన్స్‌లు, క్లయిమ్‌ల చెల్లింపునకు సంబంధించిన ప్రోసెసింగ్ వుండదని పిసిడిఎ స్పష్టం చేసింది. రక్షణ శాఖలో నిధుల కొరత అన్నది తాత్కాలికమేనని, ప్రస్తుత బడ్జెట్ కేటాయింపుల నుండి తిరిగి కేటాయించటం (రి అప్రోప్రియేషన్) ద్వారా ఈ సమస్య పరిష్కారం అవుతుందని రక్షణశాఖ అధికారి ఒకరు వివరించారు. ప్రత్యేక విధులు కేటాయించబడిన అధికారులకు చెల్లించే రవాణా, దినసరి భత్యాలకు ఏటా రు.4 వేల కోట్లు అవసరమవుతాయని రక్షణశాఖ వర్గాలు తెలిపాయి. దీనికి అదనంగా మరో రు.800 కోట్లు కేటాయిస్తారని, క్లిష్ట సమయాల్లో ఇవి సైన్యాన్ని ఆదుకుంటాయని ఈ వర్గాలు వివరించాయి.

హజారే దీక్ష విరమణ



న్యూఢిల్లీ : ప్రముఖ సామాజిక కార్యకర్త , అవినీతి వ్యతిరేక ఉద్యమ కారుడు అన్నా హజారే (81) తన నిరవధిక దీక్షను మంగళవారం విరమించారు. ఆయన డిమాండ్లు అన్నింటినీ నెరవేరుస్తామని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఇచ్చిన హామీతో హజారే దీక్ష విరమించారు. దీక్ష విరమించిన తరువాత అక్కడ ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ, లోకాయుక్త ఏర్పాటుపై ఈ నెల 13న నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పిందని, దీంతో తాను దీక్ష విరమిస్తున్నట్లు ప్రకటించారు. కాగా, లోక్‌పాల్ నియామకం కోసం ఉమ్మడి ముసాయిదా కమిటీని ఏర్పాటు చేస్తామని ఫడ్నవీస్ అన్నారు. ఫడ్నవీస్ మంగళవారం హజారే సొంత గ్రామమైన రాలేగావ్ సిద్ధి వెళ్ళి ఆయనతో మాట్లాడారు.. లోక్‌పాల్ నియామక ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుందని ఫడ్నవీస్ ఈ సందర్భంగా తెలిపారు. కేంద్ర మంత్రులు రాధా మోహన్ సింగ్, సుభాష్ భమ్రే, మహారాష్ట్ర మంత్రి గిరీష్ మహాజన్ తదితరులు కూడా హజారేతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. హజారే మాట్లాడుతూ లోక్‌పాల్, లోకాయుక్త, రైతులకు గిట్టుబాటు ధరలపై వారిచ్చిన హామీలు సంతృప్తికరంగా ఉన్నాయని చెప్పారు. లోక్‌పాల్‌పై కొత్త బిల్లును రూపొందించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ హామీ ఇచ్చారు. లోక్‌పాల్ నియామకానికై ఏర్పడిన సెర్చ్ కమిటి ఈ నెల 13న సమావేశమవుతుందని ఆయన చెప్పారు. ఉమ్మడి ముసాయిదా కమిటీనొకదానిని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ కమిటీ కొత్త బిల్లును రూపొందిస్తుందని, దానిని తాము వచ్చే అసెంబ్లీ సమావేశాలలో ప్రవేశపెడతామని హజారే అన్నారు.

లోకాయుక్త, లోక్‌పాల్‌లను ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో హజారే జనవరి 30న త స స్వగ్రామమైన రాలేగావ్ సిద్ధిలో నిరవధిక దీక్షను ప్రారంభించిన సంగతి తెలిసిందే. వారం రోజులుగా ఆయన దీక్షలో ఉన్నారు. ఈ వారం రోజులో 4.30 కిలోల బరువు తగ్గారని వైద్యులు తెలిపారు. వ్యవసాయ రంగంలో నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించేందుకు స్వామినాధన్ కమిషన్ సిఫార్సులను కూడా అమలు చేయాలని, ఎన్నికల సంస్కరణలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

బిజెపి, టిఎంసి తోడు దొంగలే

- శారదా స్కాంలో ఇరు పార్టీలు భాగస్వాములే
- సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పారదర్శకంగా విచారణ
- సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి డిమాండ్



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిజెపి, టిఎంసి రెండూ తోడు దొంగలేనని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. దేశంలోని అతి పెద్ద చిట్‌ఫండ్ స్కాం(శారదా చిట్‌ఫండ్ కుంభకోణం)లో ఆ రెండు పార్టీలకు చెందిన నేతలకు వాటాలున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఆ పార్టీలు డ్రామాలు ఆడుతున్నాయని వ్యాఖ్యానించారు. మంగళవారం పార్లమెంట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం లోక్‌సభా పక్ష ఉపనేత ఎండి సలీం, రాజ్యసభ పక్షనేత టి.కె రంగరాజన్‌లతో కలిసి ఏచూరి మాట్లాడారు. శారదా స్కాం కేసును విచారించాలని భారత సర్వోన్నత న్యాయస్థానం కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ కేసుకు సంబంధించి పురోగతిని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పక్కదారి పట్టించేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. సుప్రీం ఆదేశాల మేరకే విచారణకై కలకత్తా పోలీసు కమిషనర్‌కు సిబిఐ నోటీసులు అందజేసిందని అన్నారు. అయితే, వాటికి ఆయన స్పందించకపోవడంతో ఈ విషయం ఇంత వరకు వచ్చిందని తెలిపారు. కాగా, దీనిని కేంద్ర, రాష్ట్ర సంబంధాలకు చెందిన సమస్యగా సిఎం మమతా బెనర్జీ ప్రచారం చేసుకోవడం అనుచితమని, ఆమె చర్యలు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేశారు. సుప్రీం ఆదేశాలతో విచారణ చేపడుతున్న సిబిఐ అధికారులను అడ్డగించడంపై ఏచూరి ఆగ్రహం వ్యక్తం చేశారు. కుంభకోణంపై విచారణ అంశాన్ని ప్రక్కదోవ పట్టించేందుకే రాజ్యాంగ సంక్షోభం తలెత్తినట్లు ఆమె చిత్రీకరిస్తున్నారని అన్నారు. అలాగే శారదా స్కాంలో ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులు బిజెపిలో చేరారని, వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఏచూరి ఎత్తిచూపారు. మోడీ సర్కార్ ద్వంద వైఖరికి ఇదే నిలువెత్తు నిదర్శమన్నారు. ఈ ఘటనతో దేశ ప్రజానీకానికి ఒక వ్యతిరేక సంకేతం వెళ్తుందని అభిప్రాయపడ్డారు. మమతకు అండగా నిలిచిన ప్రతిపక్షాలన్నింటికీ అవినీతి మరక అంటించే ప్రయత్నం మోడీ ప్రభుత్వం చేస్తుందని వ్యాఖ్యానించారు. ప్రజలను లూటీ చేసిన తృణమూల్ కాంగ్రెస్ అగ్ర నాయకత్వంపై కూడా తప్పనిసరిగా విచారణ జరపాలని, పలువురు టిఎంసి ఎంపిలు ఇప్పటికే అరెస్టులు, చార్జిషీట్లు ఎదుర్కొంటున్నారని అన్నారు. వారిపై విచారణకు బిజెపి ఐదేళ్ల కాలయాపన చేయడాన్ని కూడా ఆయన తప్పుపట్టారు. ఇది అవినీతి నేతలను తమ పార్టీలోకి రప్పించుకునే ప్రయత్నం కాదా అని బిజెపిని నిలదీశారు. ఇప్పటికైనా శారదా స్కాంలో పారదర్శకంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రాఫెల్ విమానాల కొనుగోళ్లలో అవినీతి అందరికీ తెలిసిందేనని, జెపిసి వేయడానికి ప్రభుత్వం నిరాకరించినప్పుడే రాఫెల్ స్కామ్‌లో వాళ్ల ప్రమేయం రుజువైందని ఏచూరి అన్నారు. అవినీతిపై యుద్ధం చేస్తున్నట్లు డాంబికాలు పలుకుతున్న మోడీ సర్కార్ రాఫెల్ స్కామ్‌పై ఎందుకు దర్యాప్తునకు ఆదేశించడం లేదని నిలదీశారు. దాంతోపాటు జిఎస్‌పిసిఎల్, వ్యాపం, సహారా-బిర్లా, నీరవ్ మోడీ, బొగ్గు గనుల కుంభకోణం వంటి వాటిపై ఎందుకు విచారణకు ఆదేశించరని ప్రశ్నించారు. ప్రజలను దోచుకోవడంలో బిజెపి, టిఎంసిలు తీసిపోవని ఏచూరి విమర్శించారు. విదేశాల నుంచి నల్లధనాన్ని రప్పించి ఒక్కో భారతీయుని ఖాతాలో రూ.15 లక్షలు జమచేస్తానని 2014 ఎన్నికల్లో వాగ్దానం చేసిన మోడీ ప్రజలను వెర్రివాళ్లను చేశారని, ఇప్పుడు నల్లధనం వివరాలు బహిరంగంగా చెప్పడానికి కూడా ప్రధాని ఇష్టపడటం లేదన్నారు. దీనికి కారణం తమ పార్టీ ప్రయోజనాలకు నల్లధనాన్ని వాడుకోవాలని చూస్తుండటమేనని అన్నారు.

ఎన్‌ఆర్‌సికి కట్టుబడి ఉన్నాం

హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ : అస్సాంలో ఎన్‌ఆర్‌సి ప్రక్రియపై సుప్రీం కోర్టు చివాట్లతో కేంద్ర హోం శాఖ దారికొచ్చింది. ఎట్టకేలకు నిర్దిష్ట సమయంలో ఎన్‌ఆర్‌సి ప్రక్రియను పూర్తి చేస్తామని హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మంగళవారం తెలిపారు. సుప్రీం కోర్టు వ్యాఖ్యల అనంతరం కొద్ది గంటల వ్యవధిలోనే రాజ్‌నాథ్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. కాగా అస్సాంలో రూపొందించే తుది ఎన్‌ఆర్‌సిలో విదేశీయులను చేర్చడం, భారతీయులను మినహాయించడం ఉండదని రాజ్‌నాథ్ స్పష్టం చేశారు. అస్సాం పౌరుల జాబితాను నిష్పక్షపాతంగా రూపొందిస్తామన్నారు. పౌరసత్వ జాబితాను రూపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులతో సహ అవసరమైన సహాయాన్ని అందిస్తోందని ఆయన చెప్పారు.

లైంగిక దాడులను సహించేది లేదు : కాథలిక్ చర్చి

మార్గదర్శకాలు జారీ చేసిన బిషప్స్ కౌన్సిల్

కొచ్చి : లైంగిక దాడులను సహించేది లేదని కేరళలోని కాథలిక్ చర్చి మంగళవారం స్పష్టం చేసింది. ఇటీవల జలంధర్ చర్చి బిషప్ ఫ్రాంకో ములక్కల్ లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ వచ్చిన ఆరోపణలపై పెద్దఎత్తున ఆందోళన కొనసాగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇటువంటి ఆరోపణలు, విమర్శలు అరికట్టేందుకు కేరళ కాథలిక్ బిషప్స్ కౌన్సిల్ (కెసిబిసి) కొన్ని మార్గదర్శకాలను రూపొందించి మంగళవారం విడుదల చేసింది. లైంగిక నేరాలకు సంబంధించిన కేసులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళడం, దర్యాప్తుకు సహకరించడం, మైనర్ బాలికలలో లైంగిక సంబంధాలను నివారించడం వంటి కొన్ని మార్గదర్శకాలను కెసిబిసి జారీ చేసింది. కెసిబిసి పరిధిలోని చర్చిలు, విద్యా, మత పరమైసంస్థలకు మార్గదర్శకాలు పంపింది. వాస్తవానికి ఈ మార్గదర్శకాలను గత ఏడాది జూన్‌లోనే రూపొందించి సంబంధిత అధికారులకు పంపినట్లు కెసిబిసి అధికారి ఒకరు తెలిపారు. "ఫ్రాంకోపై అత్యాచార ఆరోపణలు రావడానికి ముందే మార్గదర్శకాలను రూపొందించాం. సంబంధిత బిషప్‌లకు, చర్చిలకు వాటిని పంపాం." అని కెసిబిసి సెక్రటరీలలో ఒకరైన ఫాదర్ జాలీ వడక్కెన్ తెలిపారు.

తెల్‌తుంబ్డేను 12 వరకు అరెస్టు చేయం

ముంబయి కోర్టుకు తెలిపిన పూనె పోలీసులు

ముంబయి : సామాజిక కార్యకర్త ఆనంద్ తెల్‌తుంబ్డేను ఈ నెల 12 అర్ధరాత్రి వరకు అరెస్టు చేయబోమని పూనె పోలీసులు మంగళవారం బోంబే హై కోర్టుకు తెలిపారు. పోలీసుల తరుపున కోర్టుకు హాజరైన ప్రభుత్వ న్యాయవాది అరుణ పాయ్ జస్టిస్ ఎన్.డబ్ల్యు. సాంబ్రే నేతృత్వంలోని ధర్మాసనానికి తెలిపారు. ఎల్గార్ పరిషద్ కొరెగావ్ బీమా కేసులో అరెస్టు నుండి రక్షణ కల్పించాలని కోరుతూ తెల్‌తుంబ్డే చేసుకున్న అభ్యర్థనను తోసిపుచ్చుతూ అఫిడవిట్‌ను దాఖలు చేసేందుకు ఎంత సమయం కావాలో తెలియచేస్తూ ముందస్తు షరతుగా ఒక అండర్‌టేకింగ్‌ను ఇవ్వాలని కోర్టు మంగళవారం పాయ్‌ను ఆదేశించింది. జనవరి 1, 2018న పూనె సమీపంలో కొరెగావ్ బీమా గ్రామం వద్ద జరిగిన హింసాత్మక ఘర్షణల కేసులో తెల్‌తుంబ్డేపై చట్ట విరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం (యుఎపిఎ) కింద పలు అభియోగాలు నమోదైన సంగతి తెలిసిందే. తెల్‌తుంబ్డేను పోలీసులు గత వారంలో అరెస్టు చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు విడుదల చేశారు. అరెస్టు నుండి తనకు రక్షణ కల్పించాలని కోరుతూ ఆయన హై కోర్టును ఆశ్రయించారు. ముందస్తు బెయిల్ కోరుతూ తన తరుపు న్యాయవాది మిహిర్ దేశాయ్ ద్వారా అభ్యర్థనను కోర్టుల దాఖలు చేశారు. బీమా కొరెగావ్ కేసులో తన ప్రమేయం లేదని ఈ సందర్భంగా తెల్‌తుంబ్డే తెలిపారు.

ఎన్‌ఆర్‌సి ప్రక్రియను సాగనివ్వండి

హోం శాఖకు సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో జాతీయ పౌరసత్వ నమోదు (ఎన్‌ఆర్‌సి) కోసం అస్సాంలో నియమించిన కేంద్ర బలగాలను ఉపసంహరించాలని విజ్ఞప్తి చేస్తూ హోం శాఖ పిటిషన్ దాఖలు చేయడంపై సుప్రీం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్‌ఆర్‌సి ప్రక్రియను చేపట్టడం ప్రభుత్వానికి ఇష్టం లేదా? అంటూ ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ ప్రశ్నించారు. "ఎన్‌ఆర్‌సి ప్రక్రియను ముందుకు తీసుకెళ్ళడం హోం శాఖకు ఇష్టం లేదనిపిస్తోంది. ఈ ప్రక్రియను అడ్డుకొనేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తోంది." అని గొగోయ్ వ్యాఖ్యానించారు. నామినేషన్ల ఉపసంహరణ చివరి తేది నుండి ఎన్నికల రోజు వరకు ఎన్‌ఆర్‌సి కసరత్తును రద్దు చేయాలని అస్సాం ప్రభుత్వం తరుపు కోర్టుకు హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనం దృష్టికి తీసుకెళ్ళారు. దీనిపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్రం తరుపున కోర్టుకు హాజరైన అటార్ని జనరల్ కె.కె. వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర బలగాలను ఉపసంహరించి వేరే చోట నియమిస్తున్న కారణంగా ఎన్‌ఆర్‌సి ప్రక్రియ గడువును మరో రెండు వారాలు పొడిగించే వకాశముందని తెలిపారు. ఈ విజ్ఞప్తిని ప్రధాన న్యాయమూర్తి నిరాకరిస్తూ అస్సాంలో ఎన్‌ఆర్‌సిని ప్రచురించే తుది గడువును జులై 31 తరువాత పొడిగించేది లేదని ఉద్ఘాటించారు.

ఎస్‌పి-బిఎస్‌పి కూటమితో కలుస్తాం

బిజెపి మిత్రపక్షం ఎస్‌బిఎస్‌పి నేత ఓంప్రకాశ్



బలియా : రానున్న సాధారణ ఎన్నికలకు సంబంధించి యుపిలో తాము ఎస్‌పి-బిఎస్‌పి కూటమితో కలిసి పోటీ చేసే అవకాశం ఉందని బిజెపి మిత్రపక్షం సుహేల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ(ఎస్‌బిఎస్‌పి) అధ్యక్షుడు, కేంద్రమంత్రి ఓంప్రకాశ్ రాజ్‌భర్ తెలిపారు. ఇటీవల ఆయన బిజెపికి వ్యతిరేకంగా పలు వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల్లో తాము బిజెపితో కలిసి ముందుకు పోలేని పక్షంలో అఖిలేష్, మాయావతిల కూటమితో కలిసే అవకాశం తమకు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ విషయంపై వారితో ఇంకా చర్చించలేదని విలేకర్ల ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. కోల్‌కతా వ్యవహారంపై ఓంప్రకాశ్ స్పందిస్తూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీకి మద్దతుగా మాట్లాడారు. ఎటువంటి వారెంట్ లేకుండా సిబిఐ అధికారులు కోల్‌కతాకు ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. ఇటీవల బిజెపిలో చేరిన శారద చిట్‌ఫండ్ స్కామ్‌లో ప్రధాన నిందితుడిగా ఉన్న వ్యక్తి ఇంటిపై అధికారులు ఎందుకు దాడి చేయలేదని అన్నారు.

యుపిలో ఎస్మా ప్రయోగం

అన్ని ప్రభుత్వ శాఖల్లో సమ్మె నిషేధం

లక్నో : అన్నిరాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లోనూ, కార్పొరేషన్లలోనూ 6 నెలల పాటు సమ్మెను నిషేధిస్తూ అత్యవసర సేవల నిర్వహణ చట్టాన్ని (ఎస్మా)ను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రయోగించింది. ఈ చట్టాన్ని అమలులోకి తెస్తూ సోమవారం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ చట్టం ప్రకారం ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లలో ఎవరూ సమ్మె చేయడానికి అవకాశం లేదు. చట్టాన్ని ఉల్లంఘించి సమ్మె చేసిన వారిని ఎటువంటి వారెంట్ జారీ చేయకుండానే పోలీసులు అరెస్టు చేస్తారు. పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం నుండి సమ్మె చేస్తామని పలు సంస్థలు హెచ్చరించిన నేపథ్యంలో యుపి ప్రభుత్వం ఈ ఆదేశాలు జారీ చేసింది. పోస్టల్, టెలిగ్రాఫ్ శాఖలతో పాటు రైల్వేలు, విమానాశ్రయాలు కూడా ఎస్మా పరిధిలోకి వస్తాయి. కాగా 1973 నాటి ఉత్తరప్రదేశ్ రాష్ట్ర విశ్వవిద్యాలయాల చట్టం కింద ఇప్పటికే అన్ని విశ్వవిద్యాలయాలలోనూ బిజెపి ప్రభుత్వం గత ఏడాది జూన్ 5 నుండి ఎస్మాను అమలు చేస్తున్న సంగతి తెలిసిందే.

మరో పోరాటానికి 'మహా' రైతుల సన్నద్ధం

- డిమాండ్లు నెరవేర్చని ఫడ్నవీస్ సర్కారు
- ఈ నెలాఖరులో ఆందోళన..



ముంబయి : సుమారు ఏడాది క్రితం.. పంట చేలల్లో ఆరుగాలం శ్రమించే రైతన్నలు ముంబయి బాట పట్టారు. వేలాది మంది తరలిరావడంతో నగర వీధులు అన్నదాతలతో కిక్కిరిసిపోయాయి. డిమాండ్లను పరిష్కరించాలంటూ వారు చేపట్టిన ఆందోళన దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. ఈ దెబ్బకు దిగి వచ్చిన మహారాష్ట్ర సర్కారు.. రైతుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీనిచ్చింది. కానీ, ఇప్పటికీ రైతుల డిమాండ్లు నెరవేరలేదు. దీంతో మరోసారి పోరాటానికి సిద్ధమవుతున్నారు ఆ రాష్ట్ర రైతులు. ఈ నెలాఖరులో ముంబయిలో చేపట్టబోయే ఆందోళనకు రైతులు వేలాది సంఖ్యలో తరలిరానున్నారని ఆలిండియా కిసాన్ సభ మహారాష్ట్ర జనరల్ సెక్రెటరీ అజిత్ నావలే మంగళవారం అన్నారు. గతసారి కంటే ఈసారి రెండింతలు ఎక్కువ మంది రైతులు ఆందోళనలో పాల్గొంటారని తెలిపారు. రైతుల డిమాండ్లను నెరవేర్చడంలో అటు కేంద్రం, ఇటు మహారాష్ట్ర సర్కారు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేసేది పోయి రైతుకు రోజుకు రూ.3.28 ఇవ్వడమేంటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల బాధలను అర్థం చేసుకునే స్థితిలో లేదని తెలిపారు. రైతు యాత్ర నాసిక్‌లో ఈనెల 20న ప్రారంభం అవుతుందని, ఈ ఆందోళనలో అన్ని జిల్లాల అన్నదాతలు పాల్గొననున్నట్టు చెప్పారు. యాత్ర ఈనెల 27న ముంబయికి చేరుకుంటుందని తెలిపారు. బీజేపీ సర్కారు ఉదాసీనత కారణంగా రైతులు ఎలా కష్టాలను ఎదుర్కొంటున్నారో ఈ యాత్ర ద్వారా తెలియజేస్తామని చెప్పారు.

గతేడాది మార్చిలో మహారాష్ట్ర రైతులు ముంబయికి పాదయాత్రగా బయలుదేరారు. కాళ్లకు బొబ్బలెక్కి రక్తమోడుతున్నా అన్నదాతలు వెనుకడుగు వేయకుండా ఎట్టకేలకు ముంబయి చేరుకున్నారు. దాదాపు 40 వేల మంది ఈ ఆందోళనలో పాల్గొన్నా సామాన్యులకు ఎలాంటి సమస్య తలెత్తకపోవడం గమనార్హం. రోడ్డుకు ఒక పక్క నడుచుకుంటూ, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పాదయాత్ర కొనసాగించారు. అంతేకాక..పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బంది కాకూడదన్న ఉద్దేశంతో ప్రధాన రహదారుల్లో కాకుండా.. చిన్న చిన్న వీధుల గుండా రైతుల పాదయాత్ర కొనసాగింది. ముంబయికి చేరుకున్న రైతులు అక్కడ భారీ ఆందోళనకు సిద్ధమౌతున్న తరుణంలో మహారాష్ట్ర సర్కారు దిగివచ్చి డిమాండ్లను నెరవేరుస్తామని హామీనిచ్చింది.

శుద్ధి అందుకు కాదు..

శబరిమల ఆలయ తంత్రి

తిరువనంతపురం: శబరిమల ఆలయంలోకి మహిళలు ప్రవేశించారనే కారణంగా ఆ ఆలయాన్ని శుద్ధి చేయలేదని ఆలయ తంత్రి వెల్లడించారు. ఈ ఏడాది జనవరి 2న శబరిమల ఆలయంలోకి ఇద్దరు మహిళలు ప్రవేశించారనే విషయం తెలిసిన కొన్ని గంటల్లోనే ఆలయాన్ని మూసి శుద్ధి కార్యక్రమం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ శుద్ధి కార్యక్రమంపై వివరణ ఇవ్వాలని ఆలయ వ్యవహారాలు చూసే ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టిడిబి) తంత్రికి నోటీసులు జారీ చేసింది. దీనికి తంత్రి 'ఆలయం అనేక విధాలుగా అశుభ్రతకు గురవుతుంది. అలాగే అనేక రకాల మలినాలు చేరుతుంటాయి. ఈ కారణంగా రెండు రోజులకు ఒకసారి ఆలయ శుద్ధి కార్యక్రమం చేపడతాం. జనవరి 2న జరిగిన శుద్ధి కార్యక్రమం కూడా అందులో భాగమే" అని వివరణ ఇచ్చారు. దీనిపై స్పందించిన టిబిడి అధ్యక్షుడు పద్మకుమార్ 'శుద్ధి కార్యక్రమం చేస్తున్నాం అని మాత్రమే తంత్రి ఫోన్ ద్వారా తెలిపారు. దీనిపై బోర్డు స్పందించడానికి ముందే శుద్ధి కార్యక్రమం ప్రారంభించారు. ఏది ఏమైనా అనుమతి లేకుండా తంత్రి ఈ శుద్ధి కార్యక్రమం నిర్వహించడం సరైనది కాదు' అని అన్నారు.

ప్రజాస్వామ్యం ఖూనీ

- విభజన హామీలు అమలు చేయాల్సిందే
- టిడిపి ఎంపి మాగంటి బాబు నిరాహార దీక్ష

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మంగళవారం జంతర్ మంతర్ వద్ద టిడిపి ఎంపి మాగంటి బాబు చేపట్టిన నిరాహార దీక్షకు మద్దతు తెలుపుతూ మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి విమర్శించారు. దీక్షకు టిడిపి ఎంపిలు కేశినేని నాని, జెసి దివాకర్ రెడ్డి, మురళీమోహన్, నిమ్మల కిష్టప్ప, కనకమేడల రవీంద్ర కుమార్, కొనకళ్ల నారాయణ, శ్రీరాం మాల్యాద్రి, టిజి వెంకటేష్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా దివాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోడీ డిక్టేటర్‌లా వ్యవహరిస్తున్నారని, దేశాన్ని నడిపించడం కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి చేతకాదని, రాహుల్‌ను ప్రధాని చేయాలన్న చంద్రబాబు కోరిక నెరవేరదని అన్నారు.

విచారణకు హాజరవ్వండి

మొదటి పేజీ తరువాయి

ధర్నాను విరమించుకున్న అనంతరం మమత మాట్లాడుతూ, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, దేశాన్ని రక్షించటం కోసమే తాను ఉద్యమిస్తున్నానని ఆమె అన్నారు. పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్ సిబిఐ విచారణను ఎదుర్కోవాల్సి వస్తుందన్న మీడియా వార్తలను ప్రస్తావించిన మమత విచారణకు సహకరించేందుకు తాము ఎప్పుడూ సిద్ధమేనని స్పష్టం చేశారు. 'పోలీస్ కమిషనర్ సిబిఐ విచారణను ఎదుర్కోవటం కాదు, ఆయన ఆ సంస్థ అధికారులతో మాట్లాడతారు. మీరు నిజాన్ని వక్రీకరించొద్దు!... మేం ఎప్పుడూ సహకరిస్తూనే వుంటాం' అని చెప్పారు. గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో అనేక సమావేశాలు నిర్వహించుకుంటున్న బిజెపి తమను ఒక్క సమావేశం కూడా నిర్వహించుకోనివ్వటం లేదని అబద్ధాలు చెబుతోందని ఆమె విమర్శించారు. బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా ఇటీవల నిర్వహించిన బహిరంగ సభను ఆమె ప్రస్తావిస్తూ 'రాష్ట్రంలో ప్రజలు స్వైన్‌ఫ్లూ వంటి అంటు వ్యాధులతో బాధపడుతున్నా మీరు సభను నిర్వహించుకున్నారుగా'... అని ఆమె బిజెపి నేతలపై మండిపడ్డారు.. శారదా చిట్స్ కుంభకోణంలో అసోం ఉపముఖ్యమంత్రి హిమంత బిశ్వాస్ శర్మకు కూడా వాటా వుందని ఆమె ఆరోపించారు.

తదుపరి కార్యాచరణపై సిబిఐ దృష్టి

కోల్‌కతా సిపిని అరెస్ట్ చేయవద్దన్న సుప్రీం ఆదేశాల నేపథ్యంలో ఆయన్ను విచారించేందుకు ప్రత్యేక బృందాన్ని షిల్లాంగ్‌కు పంపే అంశాన్ని తాము నిశితంగా పరిశీలిస్తున్నట్లు సిబిఐ వర్గాలు చెప్పాయి. షిల్లాంగ్‌లో తమ విచారణకు హాజరు కావాలంటూ సిపి రాజీవ్‌కుమార్‌కు త్వరలోనే నోటీసు పంపనున్నట్లు ఈ వర్గాలు వెల్లడించాయి.

ఇది.. ప్రపంచంలో ఎనిమిదో వింత
: లెఫ్ట్ ఫ్రంట్ చైర్మన్ బిమన్ బసు

ప్రజాశక్తి ప్రతినిధి-కొల్‌కోతా : అవినీతి పోలీస్ అధికారిని రక్షించడానికి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జి ప్రయత్నించడం ప్రపంచంలోనే ఎనిమిదో వింతని లెఫ్ట్ ఫ్రంట్ చైర్మన్ బిమన్ బసు వ్యాఖ్యానించారు. మంగళవారం ఉదయం జరిగిన మీడియా సమావేశంలో బిమన్ బసు మాట్లాడుతూ ఒక కళంకిత పోలీస్ అధికారిని రక్షించడానికి ఒక ముఖ్యమంత్రి ప్రయత్నించడాన్ని ప్రపంచంలోనే ఎనిమిదో వింతగా అభివర్ణించారు. అలాగే ఈ నెల 12 నుంచి 'క్యాచ్ తీఫ్- త్రో థెమ్ టు జైల్' పేరుతో వారం రోజుల నిరసన కార్యక్రమాలు ప్రారంభిస్తునట్లు బిమన్ బసు ప్రకటించారు. అలాగే పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని లెఫ్ట్ ఫ్రంట్ ఎప్పుడూ డిమాండ్ చేయదని బిమన్ బసు స్పష్టం చేశారు.

బేటీ బచావో ప్రచారానికే పరిమితం

మొదటి పేజీ తరువాయి

కార్యదర్శి మరియం దావలే మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో మోడీ సర్కార్ చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును చట్టంగా రూపొందిస్తామని హామీనిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఆ బిల్లుపై కనీసం చర్చ కూడా జరపలేదని వ్యాఖ్యానించారు. మహిళా సాధికారితపై మోడీ సర్కార్‌కు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే బిల్లును చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న సమావేశాల్లోనే బిల్లు ఆమోదానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ధర్నాలో పాల్గొన్న మాజీ ఎంపి, ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి హన్నన్ మొల్లా మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో మహిళా రైతులను ప్రభుత్వం ప్రత్యేకంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా రైతు కూలీలకు గుర్తింపు నివ్వాలని సూచించారు. మొమునా మొల్లా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అచ్చేదిన్ కోసమే మహిళలంతా మోడీ ప్రభుత్వానికి ఓటేశారని, అయితే, అచ్చేదిన్ బదులు సచ్చేదిన్ తీసుకువచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బేటీ బచావో... బేటీ పడావో పథకం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని అన్నారు. ఐద్వా ఉపాధ్యక్షురాలు ఎస్.పుణ్యవతి మాట్లాడుతూ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోడీ సర్కార్, తన హామీని నిలుపుకోవడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. విద్యా వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేస్తోందని దుయ్యబట్టారు. అసంఘటిత రంగంలో ఎంతోమంది మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆ రంగంలోని మహిళల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రిటైర్డ్ జనరల్ సాబీర్ సింగ్, ఆశా శర్మ, మహిళా సంఘాల నేతలు పాల్గొన్నారు.

అన్నాడిఎంకె సర్కార్ కుప్పకూలితే ఎన్నికలకే వెళ్తాం : స్టాలిన్



శివగంగా : రాష్ట్రంలోని అన్నా డిఎంకె ప్రభుత్వం పడిపోయినా తాము ఎన్నికల ద్వారా ప్రజాభిప్రాయం కోరేందుకే మొగ్గు చూపుతామని డిఎంకె అధ్యక్షుడు స్టాలిన్ తెలిపారు. మంగళవారం శివగంగలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2017, డిసెంబర్‌లో పళనిస్వామి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్టీ విప్ ధిక్కరించి ఓటు వేసిన ప్రస్తుత ఉపముఖ్యమంత్రి పన్నీర్ సెల్వంతో పాటు మరో 10 మంది ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు త్వరలో అనర్హత వేటు వేసే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ఇప్పటికే మైనారిటీలో ఉందన్నారు. అయితే తాము అధికార పీఠం ఆశించడం లేదని, ప్రజల మద్దతుతోనే అధికారంలోకి వస్తామన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

అప్పులు చేసే అర్హత ఏపికి లేదు

- కేంద్ర మంత్రి పొన్ రాధాకృష్ణ
- కేంద్ర పథకాల కింద ఏపికి రూ.62వేల కోట్లిచ్చాం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆర్థిక సంఘం విధించిన షరతులకు లోబడని ఆంధ్రప్రదేశ్‌కు 2018-19లో 3 శాతం ఎఫ్‌ఆర్‌బిఎం పరిమితికి మించి అదనంగా అప్పులు చేసే అర్హత లేదని, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద 2014-15 నుంచి 2019 ఫిబ్రవరి 2 వరకు ఆంధ్రప్రదేశ్‌కు రూ.62,168 కోట్లు విడుదల చేసినట్లు మంగళవారం రాజ్యసభలో వైసిపి ఎంపి విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పొన్ రాధాకృష్ణ స్పష్టం చేశారు. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద 2014-15 నుంచి 2019 ఫిబ్రవరి 2 వరకు ఆంధ్రప్రదేశ్‌కు రూ.62,168 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. కేంద్రం ప్రభుత్వం రాష్ట్రానికి ప్రకటించిన ప్రత్యేక ఆర్థిక చర్యల్లో (ప్యాకేజీ) భాగంగా ఈ ప్రాయోజిత పథకాల అమలులో కేంద్రం వాటా 90 శాతం, రాష్ట్ర వాటా 10 శాతం ఉంటుందని పేర్కొన్నారు. ప్రత్యేక ప్యాకేజీని ఆమోదిస్తూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్నందుకు ధన్యవాదాలు తెలుపుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి 2017 మే 2న తమకు లేఖ రాశారని ఆర్థిక మంత్రి వెల్లడించారు.

'గోవధ' ఆరోపణపై ముగ్గురు అరెస్టు

జాతీయ భద్రత చట్టం కింద కేసు నమోదు

కాండ్వా : మధ్యప్రదేశ్‌లోని కాండ్వా పట్టణంలో 'గోవధ' ఆరోపణపై ముగ్గురిని అరెస్టు చేసి వారిపై జాతీయ భద్రత చట్టం (ఎన్ఎస్ఎ) కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రాష్ట్రంలో ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గోవధ అంశంపై కేసు నమోదు కావడం ఇది తొలిసారి. నిందితుల్లో రాజు, షకీల్‌లను శుక్రవారం అరెస్టు చేయగా, అజాంను సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. వీరిపై గోవధ నిషేధ చట్టంలోని 4, 6, 9 సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు.

బోస్నియాలో వరదలు

సరాజీవో : బోస్నియాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో,లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వరద ఉధృతితో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలమట్టమయ్యాయి. రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. రోడ్లపైకి వరద నీరు భారీగా వచ్చి చేరింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు ఇండ్లు ధ్వంసమయ్యాయి. రాజధాని సరోబీవోలోని జెల్‌జెజ్‌నికా నది పొంగిపొర్లడంతో ప్రధాన ఆనకట్ట కూలిపోయింది. పలు నదులు పొంగిపొర్లుతున్నాయి. విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. వరదల నేపథ్యంలో ప్రభుత్వం జెనికా, కకాన్జ్ నగరాల్లో ఎమర్జెన్సీ ప్రకటించింది. టాప్కిక్ పోల్జే నగరంలో నివసిస్తున్న ప్రజలు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టినట్టు ప్రభుత్వం ప్రకటించింది. పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయని తెలిపింది.

ప్రమాదమా..? విద్రోహమా..?



మంగళవారం పారిస్‌లో ఓ బహుళ అంతస్థుల భవనంలో వ్యాపించిన అగ్ని కీలలు. ఇది ప్రమాదమా? విద్రోహచర్యా? అన్న కోణం నుంచి దర్యాప్తు జరుగుతోంది.

పారిస్‌లో భారీ అగ్ని ప్రమాదం

8 మంది మృతి : 30 మందికి గాయాలు

పారిస్ : పారిస్ నగరంలోని 8 అంతస్తుల భవనంలో మంగళవారం ఉదయం చోటు చేసుకున్న భారీ అగ్ని ప్రమాదంలో 8 మంది మృతి చెందగా, 30 మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఆరుగురు అగ్నిమాపక సిబ్బంది కూడా ఉన్నారని, వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగిన భవనం నుండి దాదాపు 50 మందిని రక్షించగలిగారు. 250 మంది అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తేవడంతోపాటు, అక్కడ చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతానికి తరలించారని పారిస్ డిప్యూటి మేయర్ తెలిపారు. . ఈ ప్రమాదం వెనుక కుట్రకోణంపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. విచారణలో భాగంగా ఒక మహిళను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. దీన్ని ఇటీవలి కాలంలో పారిస్‌లో సంభవించిన భారీ అగ్ని ప్రమాదంగా అధికారులు పేర్కొన్నారు.

'సేఫ్ జోన్స్'కు అమెరికా సహకరించట్లేదు : ఎర్డోగన్

అంకారా : సిరియాలో సేఫ్ జోన్స్ ఏర్పాటునకు అమెరికా సహకరించట్లేదని టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ విమర్శించారు. ఓ పక్క సేఫ్ జోన్స్ ఏర్పాటు చేసుకోవచ్చునని చెబుతూనే మరోపక్క వీటి ఏర్పాటునకు ట్రంప్ సర్కార్ ఏమాత్రం సహకరించట్లేదని అన్నారు. మంగళవారం టర్కీ పార్లమెంట్‌లో జరిగిన ఏకే పార్టీ సభ్యుల సమావేశంలో ఎర్డోగన్ మాట్లాడారు.`సిరియన్ల భద్రతకు మేము కట్టుబడి ఉన్నాం. సిరియాలో అమెరికా బలగాలు వైదొలిగిన నేపథ్యంలో ఉత్తర సిరియా సరిహద్దులో సేఫ్ జోన్ ఏర్పాటు చేయాలనుకునే ప్రతిపాదనను అమెరికా ముందుంచాం. దీనికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంగీకరించారు. సేఫ్ జోన్‌కు సంబంధించి ఎలాంటి ప్లాన్స్ మాకు అందించలేదు. అమెరికాకు ఇచ్చిన మాటకు టర్కీ కట్టుబడి ఉంది. సిరియాలోని కుర్దు తిరుగుబాటుదారుల లక్ష్యంగా తామెలాంటి దాడులకు పాల్పడమని అమెరికాకు మాట ఇచ్చాం. దీన్ని మేం నిలబెట్టుకుంటాం. సిరియాలో పెట్రేగిపోయిన ఉగ్రసంస్థల నిర్మూలన బాధ్యత మాదే. సిరియా సరిహద్దులో 32కిలోమీటర్ల మేర సేఫ్ జోన్ ఏర్పాటునకు ప్రణాళిక సిద్ధం చేశాం.

కొత్త క్షిపణుల తయారీపై దృష్టి

రష్యా వెల్లడి



మాస్కో: వచ్చే రెండేళ్ళలో రెండు కొత్త క్షిపణి వ్యవస్థలను అభివృద్ధిపరచాలని రష్యా భావిస్తోంది. చారిత్రక అణ్వాయుధ నియంత్రణ ఒప్పందం నుండి వైదొలగాలని అమెరికా భావిస్తున్న నేపథ్యంలో రష్యా ఈ ఆలోచన చేస్తోంది. ప్రచ్ఛన్న యుద్ధం నాటి మధ్యంతర శ్రేణి అణ్వాయుధాల ఒప్పందం (ఐఎన్ఎఫ్)ను రష్యా నిలుపుచేసిందని గత వారాంతంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చెప్పారు. భూతలం నుండి ప్రయోగించే స్వల్ప, మధ్యంతర శ్రేణి క్షిపణులను యూరప్‌లో మోహరించకుండా రష్యా, అమెరికాను ఈ ఒప్పందం నిషేధిస్తోంది. ఈ ఒప్పందం నుండి వైదొలగుతున్నామని అమెరికా ప్రకటించిన తర్వాతనే తాము కూడా దీనిపై చర్యలు తీసుకుంటున్నామని పుతిన్ తెలిపారు. కొత్త క్షిపణి వ్యవస్థలపై పరిశోధన, అభివృద్ధి, రూపకల్పన పనులు చేపడతామని అమెరికా స్పష్టం చేసిందని, రష్యా కూడా అదే రీతిలో వ్యవహరిస్తుందని పుతిన్ చెప్పారు. ప్రస్తుతం నౌకల నుండి ప్రయోగించగల క్రూయిజ్ క్షిపణి కల్బీర్‌కు దీటుగా భూతలం నుండి ప్రయోగించగల క్షిపణి వ్యవస్థలను రూపొందించడం, ధ్వని వేగానికి ఐదు రెట్లు ఎక్కువగా ప్రయాణం చేయగల దీర్ఘశ్రేణి హైపర్‌సోనిక్ క్షిపణులను వృద్ధిపరచడంపై రష్యా మిలటరీ దృష్టి సారిస్తుందని పుతిన్ తెలిపారు. అంతకుముందు రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లావ్‌రోవ్ మాట్లాడుతూ, మధ్యంతర శ్రేణి అణ్వాయుధ దేశాల ఒప్పందం (ఐఎన్ఎఫ్) నుండి అమెరికా వైదొలగడంపై రష్యా తగు రీతిలో స్పందిస్తుందని రష్యా విదేశాంగ మంత్రి తెలిపారు. కిర్గిజిస్తాన్ రాజధాని బిష్‌కేక్‌లో కిర్గిజ్-రష్యన్ స్లావిక్ యూనివర్శిటీ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ లావ్‌రోవ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఐఎన్ఎఫ్ ఒప్పందం నుండి అమెరికా వైదొలగడం వల్ల తలెత్తిన పరిస్థితులపై కచ్చితంగా సైనిక, సాంకేతిక కోణాల్లో స్పందిస్తామని చెప్పారు. ప్రచ్ఛన్న యుద్ధం నాటి ఆయుధ పోటీ తరహాలో గాక, తమ రక్షణ బడ్జెట్ పరిధిలోనే తగిన విధంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. మొత్తంగా ఆయుధ నియంత్రణ వ్యవస్థను రద్దు చేయడానికి అమెరికా పూనుకోవడంతో కొత్త శకం ఆరంభమైందని లావ్‌రోవ్ వ్యాఖ్యానించారు. 2021తో గడువు ముగియనున్న వ్యూహాత్మక ఆయుధాల కుదింపు ఒప్పందం-2010 వంతు దీని తర్వాతని అమెరికా నిపుణులు ఇప్పటికే హెచ్చరించారని తెలిపారు. ఆయుధీకరణ, కొత్త ఆయుధాల ఉత్పత్తి, వ్యూహాత్మక సుస్థిరత వంటి వాటికి సంబంధించి ఈనాటి ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి చొరవల కొరత లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఆయుధాల పరిమితిపై కొత్తగా చర్చలు ప్రారంభించాలని రష్యా ఇటీవల కాలంలో పలు సార్లు చొరవ చూపిందని, కానీ తమ ప్రతిపాదనలన్నీ తిరస్కరణకు గురి కావడమో లేదా ఎలాంటి స్పందనలేకపోవడమో జరిగిందని లావ్‌రోవ్ చెప్పారు.

అధ్యక్షుని పదవీ కాల పరిమితి పెంపు

ప్రతిపాదనపై చర్చించిన పార్లమెంట్

కైరో : ఈజిప్ట్ అధ్యక్షుడి పదవీ కాలాన్ని నాలుగు సంవత్సరాల నుండి ఆరు సంవత్సరాలకు పెంచడం, కొత్తగా ఉపాధ్యక్షుడి పదవిని సృష్టించడంపై ఆదివారం ఈజిప్ట్ పార్లమెంట్ చర్చించింది. మొత్తంగా 596మంది పార్లమెంట్ సభ్యులకు గానూ ఐదో వంతు మంది సభ్యులు అందజేసిన పిటిషన్‌లోని వివరాల ప్రాతిపదికగా ఈ చర్చ జరిగిందని అధికార మేనా వార్తా సంస్థ తెలిపింది. 'సపోర్ట్ ఈజిప్ట్' పేరుతో ప్రభుత్వ అనుకూల పార్లమెంటరీ గ్రూపు సభ్యులు అంతకుముందు సమర్పించిన అధికార అభ్యర్ధనకు స్పందిస్తూ ప్రతినిధుల సభ సాధారణ కమిటీ స్పీకర్ అలీ అబ్దుల్ ఆల్ అధ్యక్షతన సమావేశమైంది. పిటిషన్‌లో సూచించిన మార్పులను చేయడానికి అవసరమైన రాజ్యాంగ సవరణలకు చేపట్టాల్సిన చర్యలను స్పీకర్ వివరించారు. ప్రతినిధుల సభకు అనుబంధంగా పార్లమెంట్ రెండవ ఛాంబర్ (సెనెట్)ను ఏర్పాటు చేసే అంశాన్ని కూడా కమిటీ పరిశీలించింది. అంతకుముందు సపోర్ట్ ఈజిప్ట్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ హదీ మాట్లాడుతూ, రాజ్యాంగంలో చేయాల్సిన సవరణలకు సంబంధించి అభ్యర్ధన అందచేశామని తెలిపారు. 2014 రాజ్యాంగాన్ని పరిరక్షిస్తూనే, మరింత స్వేచ్ఛకు హామీ కల్పిస్తూ. అందులో ప్రతిపాదిత సవరణలు చేయాలని కోరారు. ఈజిప్ట్ రాజ్యాంగంలోని 140వ అధికరణ అధ్యక్ష పదవీ కాలాన్ని నాలుగేళ్ళకు పరిమితం చేస్తూ వరుసగా రెండుసార్లు మాత్రమే ఆ పదవిని అధిష్టించవచ్చని పేర్కొంటోంది. అయితే దేశ ఆర్థిక, భద్రతా సవాళ్ళను ఎదుర్కొనడానికి ఎనిమిదేళ్లు సరిపోవని పిటిషనర్లు విశ్వసిస్తున్నారు.


శాంతి చర్చలకు విఘాతం

తాలిబన్ల మెరుపుదాడుల్లో 21 మంది మృతి

కాబూల్ : అఫ్గాన్ నేతలకు, తాలిబన్లకు మధ్య జరుగుతున్న శాంతి చర్చలు అర్థాంతరంగా నిలిచిపోయాయి. శాంతి చర్చలు కొనసాగుతుండగానే తాలిబన్లు జంట పేలుళ్లకు పాల్పడ్డారు. అఫ్గనిస్తాన్‌లోని బగ్లాన్ ప్రావిన్స్‌లోని పోలీస్ చెక్‌పాయింట్‌తో పాటు మరో రద్దీ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకొని మెరుపుదాడులకు పాల్పడ్డారు. ఈ దాడుల్లో 21మంది మృతి చెందారు. మృతుల్లో 11 మంది పోలీసులు ఉన్నారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అఫ్గాన్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం....రష్యా రాజధాని మాస్కోలో అఫ్గనిస్తాన్ మాజీ అధ్యక్షుడు హమీద్ కర్జాయ్, ప్రతిపక్ష నేతలు, గిరిజన నేతలు తాలిబన్ కమాండర్లలో భేటీ అయ్యారు. వీరంతా అఫ్గాన్‌లో శాంతి స్థాపన అంశంపై సుదీర్ఘ మంతనాలు జరిపారు. అయితే, ఈచర్చలకు అఫ్గాన్ కీలక అధికారులెవరూ హాజరు కాలేదు. తాలిబన్లు తమ డిమాండ్లను ప్రకటించే అవకాశం లభించలేదు. దీంతో,ఆగ్రహానికి గురైన తాలిబన్లు చర్చలు కొనసాగుతుండగానే వైదొలిగారు. ఓ పక్క చర్చలు జరుగుతుండగానే బగ్లాన్ ప్రావిన్స్‌లో రెండు వేర్వేరు చోట్ల దాడులకు పాల్పడ్డారు. ఈ దాడుల్లో 21 మంది మృతిచెందారు.

అమెరికా బెదిరింపులను అడ్డుకోండి

అంతర్జాతీయ సమాజానికి మదురో విజ్ఞప్తి



కారకస్ : అమెరికా యుద్ధ బెదిరింపులకు స్వస్తి పలికేలా చూడాల్సిందిగా వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో అంతర్జాతీయ సమాజానికి విజ్ఞప్తి చేశారు. వెనిజులాపై దండెత్తడానికి విదేశీ సైనికులను ఎంత మాత్రమూ అనుమతించేది లేదని ఆయన స్పష్టం చేశారు. సోమవారంటెలివిజన్‌లో దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ ఆయన, ప్రతిపక్షాలను చర్చలకు రావలసినదిగా పిలుపునిచ్చారు. వలసవాద శకం నుండి ఈనాటి వరకు సాగిన పోరాటాలను గుర్తు చేస్తూ 'చె, ఫిడెల్, చావెజ్ వీరందరూ మన వారసత్వం, వారే మనకి బలాన్ని, మనోధైర్యాన్ని ఇస్తారు.' అని ఆయన వ్యాఖ్యానించారు. జనవరి 23న ప్రతిపక్ష నేత జువాన్ గైడో కుట్రపూరితంగా తాత్కాలిక అధ్యక్షుడిగా ప్రకటించుకున్నప్పటి నుండి అమెరికా ఆ అక్రమ, చట్టవిరుద్ధ చర్యలు, కార్యకలాపాలను చట్టబద్ధ మైనవిగా గుర్తిస్తూ ప్రకటనలు చేస్తోంది.

అమెరికా మిత్ర పక్షాలు కూడా అదే రీతిలో ప్రకటనలు చేసేలా వారిని ఉసిగొల్పుతోంది. ఎన్నికలు జరపకుండా దేశాన్ని పాలించాలని తాను ఎన్నడూ కోరుకోలేదని అన్నారు. వెనిజులాపై ఆంక్షలు విధిస్తూ, దేశంలోని చమురు కంపెనీలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తూ అన్నివైపుల నుండి వెనిజులాను దిగ్బంధనం చేయాలని చూస్తున్నారు, సైనిక జోక్యం చేస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారు, లిమా గ్రూపు, యురోపియన్ యూనియన్‌లు తమపై జరుపుతున్న దాడులు మొత్తంగా వామపక్షాలపై, ప్రగతిశీల శక్తులపై జరుగుతున్న దాడులేనని మదురో వ్యాఖ్యానించారు. కొత్తగా ఎన్నికలు జరిపేందుకు వీలుగా పదవి నుండి తనను తప్పుకోమంటున్న ప్రతిపక్ష నేత డిమాండ్ గురించి ప్రస్తావిస్తూ, తమకు కావాల్సిన పంథాను ఎంచుకునే హక్కు ప్రతి ఒక్క దేశానికి వుంటుందని, ఆ హక్కు కోసమే వెనిజులా పోరాడుతోందని మదురో పేర్కొన్నారు. అమెరికా నుండి వస్తున్న ఈ బెదిరింపులను తిప్పికొట్టాలని ఆయన ప్రపంచ దేశాలను కోరారు.

మొదటి పేజీ తరువాయి

వలస కార్మికుని విషాద మృతి

భాగంగా వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు ఎంవిఆర్ కాటన్ మిల్లులో పెద్దకడుపూరుకు చెందిన ఏడుగురు కార్మికులు పనిచేస్తున్నారు. వారిలో బి ప్రభుదాసు(34) సోమవారం మధ్యాహ్నం విధుల్లో ఉండగానే అస్వస్థతకు గురయ్యాడు. మిల్లు నిర్వాహకుల అనుమతి తీసుకుని అతను కిలోమీటరు దూరంలో ఉన్న మెడికల్ షాపుకు వెళుతుండగా మధ్యలోనే పడిపోయాడు. అయితే ఈ విషయం మిగిలిన వారెవ్వరికీ తెలియదు. స్థానికులు ఈ విషయాన్ని గుర్తించి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడని స్థానికంగా మైక్‌లో ప్రచారం చేయించారు. నాలుగైదు గంటల తరువాత విషయం తెలుసుకున్న తోటి కార్మికులు, ఇతర ప్రాంతాల నుండి వచ్చిన వందలాది మంది కార్మికులు జిజిహెచ్ మార్చురీ వద్దకు పెద్దసంఖ్యలో చేరుకుని బోరున విలపించారు. ప్రభుదాసుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కర్నూలు జిల్లాలో పనుల్లేక పెద్దసంఖ్యలో ప్రతి ఏటా జిల్లాకు వలస వస్తున్నారు. మిర్చి, పత్తి తదితర వ్యవసాయ పనులకు వెళుతుంటారు. వీరు పొలాల్లోనో, ఆయా గ్రామాల శివార్లలో తాత్కాలిక డేరాలు వేసుకుని నివాసముంటున్నారు. ఎండైనా...వాన అయినా వీరి ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. తాగునీరు లేదు, ఇతర కనీస వసతుల్లేవు, నీటి సౌకర్యం లేక వారానికి ఒకటి, రెండుసార్లు స్నానం చేయడం జరుగుతోంది. దీని కారణంగా అనారోగ్యాలకు గురికావడం సర్వ సాధారణం. వ్యవసాయ పనులు లేకపోతే తమకు తెలిసీతెలియని పనులకు సైతం వెళ్లాల్సిన పరిస్థితి. ఇంతటి దారుణ పరిస్థితుల మధ్య ప్రభుదాస్ మృతిచెందడం స్థానికులనూ కదిలించింది. ప్రభుదాస్ మృతదేహాన్ని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, గుంటూరు తూర్పు జిల్లా కార్యదర్శి అప్పారావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వలసల నివారణలో ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. పెద్దకడుపూరు నుండి సుమారు వెయ్యి కుటుంబాలు ప్రతి ఏటా వలస వెళ్తున్నాయని చెప్పారు. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

చర్చలు సఫలం.... సమ్మె లేదు

ముఖ్యమంత్రితో చర్చిస్తామన్నారు. బకాయిలన్నింటినీ 2020 నాటికి చెల్లిస్తామని, ఉగాదికి తొలి విడత బకాయిలు చెల్లించేందుకు అంగీకరించామని తెలిపారు. ఆర్టీసికి స్వయం ప్రతిపత్తి ఇచ్చే అంశాన్ని కూడా ఆలోచిస్తామన్నారు. సంస్థ ఉన్న పరిస్థితుల్లో సమ్మె చేస్తే ఇంకా నష్టపోతామని జెఎసి నాయకులకు వివరించి చెప్పామని, సమ్మె చేయకుండా ఉండేందుకు వారు అంగీకరించారని చెప్పారు. మిగిలిన అంశాలను కూడా చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్టీసి ఎమ్‌డి సురేంద్రబాబు మాట్లాడుతూ 80 శాతం ఒఆర్ కార్మికుల సమిష్టి కృషితోనే సాధ్యమైందన్నారు. ఆర్టీసి నష్టాలకు కారణాలు తెలుసుకుని సాయం చేసేందుకు ప్రభుత్వం అంగీకరించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఆర్టీసి కార్మిక సంఘాల జెఎసి కన్వీనర్ పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల ద్వారా ఇబ్బంది రాకుండా చూస్తామని, సంస్థకు స్వేచ్ఛ కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారన్నారు. సిబ్బంది కుటుంబ సభ్యులకు ఉచిత రవాణా, వైద్య సదుపాయాలు కల్పించాలని కోరామని, సిఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారని చెప్పారు. తాము ఇప్పటి వరకూ చేసిన పోరాటానికి మద్దతు తెలిపిన అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. సమ్మెను ఉపసంహరించుకున్నందుకు జెఎసి నాయకులకు ఆర్టీసి చైర్మన్ వర్లరామయ్య కృతజ్ఞతలు తెలిపారు.

ఐక్య కూటమి పేరుతో దగా : ఆర్టీసి ఎన్ఎంయు

ఐక్య కూటమి పేరుతో ఆర్టీసి ఇయు కార్మికులను దగా చేసిందని నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయు) రాష్ట్ర అధ్యక్షులు చల్లా చంద్రయ్య, కార్య నిర్వాహక అధ్యక్షులు పివి రమణారెడ్డి, ముఖ్య ఉపాధ్యక్షులు డియస్‌పిరావు, ప్రధాన కార్యదర్శి వై శ్రీనివాస రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 శాతం ఫిట్‌మెంట్ ఇప్పిస్తామన్న హామీని తుంగలో తొక్కి 25 శాతానికి అంగీకరించి కార్మికులకు తీరని ద్రోహం చేశారని పేర్కొన్నారు. 80 శాతం అరియర్స్ ఒకే సారి ఇప్పిస్తామని నమ్మబలికి చర్చల్లో ద్రోహం చేశారని తెలిపారు. ఆర్టీసి కార్మికుల జీవితాల్లో 'బ్లాక్ డే' గా ప్రకటిస్తూ అన్ని డిపోల్లో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు.

వైసిపిలోకి ఎమ్మెల్యే ఆమంచి !

అనుచరులు చెబుతున్నారు.

మంత్రి శిద్దా రాఘవరావు బుజ్జగింపులు

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు మంత్రి శిద్దా రాఘవరావు.. ఎమ్మెల్యే ఆమంచిని ఆయన ఇంటికెళ్లి స్వయంగా కలిశారు. ఎమ్మెల్సీ పోతుల సునీతకు, ఆమె గ్రూపునకు ప్రాధాన్యత ఇస్తున్నారనీ ఆమంచి వివరించినట్లు తెలిసింది. చర్చలు ఫలించలేదని సమాచారం.

అసైన్డ్‌కు 20 ఏళ్లు నిబంధన

- చుక్కల భూముల చట్టానికీ సవరణలు
- సింహాచలం భూముల క్రమబద్ధీకరణకు బిల్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపి అసైన్డ్ ప్రభుత్వ భూముల బదలాయింపుల నిషేధ చట్టం -1977 (పిఒటి యాక్ట్)ను సవరిస్తూ మంగళవారం అసెంబ్లీలో ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టింది. ఇది 2019 జనవరి 29 నుంచి అమల్లోకి వస్తుందని బిల్లులో పేర్కొన్నారు. ఏ వ్యక్తికైనా అసైన్డ్ చేయబడిన ఇంటి స్థలాన్ని కొనుగోలు, బహుమతి, లీజు, తనఖా, మార్పిడి చేయాలంటే ప్రభుత్వం స్థలం లబ్ధిదారునికి ఇచ్చిన తేదీ నుంచి 20 సంవత్సరాల కాల వ్యవధి ముగిసే వరకు బదిలీ చేయకుండా చట్టాన్ని సవరించారు. అసైన్ చేయబడిన ఇంటి స్థలాన్ని ఒకే పర్యాయపు చర్యగా అప్పగింత (డెలివరి) పొందిన వ్యక్తికి అనుకూలంగా క్రమబద్ధీకరిస్తారని ఇందులో పేర్కొన్నారు. అర్హత గల కుటుంబానికి జీవితకాలంలో ఒకే ఒకసారి మాత్రమే ఇంటి స్థలాన్ని అసైన్ చేయడం జరుగుతుందని ప్రభుత్వ స్పష్టం చేసింది. చట్టం అమల్లోకి వచ్చే నాటికి ఎవరి చేతిలో భూమి ఉంటుందో ఆ వ్యక్తికి ఆయా భూములను క్రమబద్ధీకరిస్తామని బిల్లులో పేర్కొన్నారు. బిల్లు సవరణలో ' అసైన్డ్ చేయబడిన భూములు అను పదముకు బదులుగా ' అసైన్డ్ చేయబడిన భూములు లేదా ఇంటి స్థలములు', 'భూమి లేని పేదలు'అను పదాలకు బదులుగా ' భూమి లేని లేదా గృహము లేని 'పేదలు' అనే పదాన్ని ఉంచాలని సవరించారు.

చుక్కల భూముల చట్టానికి సవరణ:

చుక్కల భూములకు సంబందించి పలు సవరణలు చేస్తూ ప్రభుత్వం బిల్లును అసెంబ్లీలో మంగళవారం ప్రవేశపెట్టింది. 1954 జూన్ 18 తర్వాత అన్యాక్రాంతం చేయబడిన లేదా బదిలీ చేయబడిన అసైన్డ్ చేసిన చుక్కల భూములకు సవరణ వర్తించదని పేర్కొన్నారు. ప్రధానంగా 'జిల్లా స్థాయి కమిటీ' అనే పదాలు ఎక్కడ వచ్చినా వాటికి బదులుగా 'సబ్ -డివిజన్'స్థాయి కమిటీ అనే పదాన్ని ఉపయోగించాలి. సబ్ డివిజన్ స్థాయి కమిటీ సబ్ కలెక్టర్ లేదా రెవెన్యూ డివిజన్ అధికారి ఛైర్ పర్సన్‌గా తహసీల్దార్ కన్వీనర్‌గా సబ్ డివిజనల్ స్థాయి కమిటీ ఈ చట్టం కింద దాఖలు చేసిన దరఖాస్తులను పరిశీలించి ఉత్తర్వులివ్వవచ్చు. తహసీల్దార్ అనే పదానికి బదులుగా 'మండల రెవెన్యూ ఇనెస్పెక్టర్' అనే పదాన్ని ఉపయోగించాలి. ఆరు నెలల్లో పరిష్కరించే గడువును రెండు నెలలకు తగ్గించారు. అప్పీల్ చేసుకునేవారు జాయింట్ కలెక్టర్‌కు 30 రోజుల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఉన్నతాధికారులకు అప్పీల్ చేసుకునేందుకు మరో 30 రోజులు గడువును కేటాయించారు.

పంచగ్రామాల భూముల క్రమబద్ధీకరణ బిల్లు:

విశాఖ జిల్లా లోని 'పంచగ్రామాలు' అడవివరం, వెంకటాపురం, పురుషోత్తపురం, వేపగుంట, చీమలాపల్లి గ్రామాల్లోని ఆక్రమణదారులు(ఇంటి స్థలం, గృహాలు నిర్మించుకున్న వారు) సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి నష్టపరిహారం చెల్లిస్తే క్రమబద్ధీకరణ చేసేందుకు ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టింది.

బుచ్చి రాములు ఇకలేరు

-ముగిసిన అంత్యక్రియలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సామాజిక న్యాయం ఎజెండాగా పేదల పక్షాన కడవరకూ పోరాడిన వర్దెల్లి బుచ్చి రాములు తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం రాత్రి పొద్దుపోయన తరువాత మరణించారు. ఆయన భౌతిక కాయానికి మంగళవారం సూర్యాపేటలో అంత్యక్రియలు నిర్వహిచారు. బుచ్చి రాములు భౌతికకాయంపై ఎర్రజెండా కప్పి, పూలతో అలంకరించిన ప్రత్యేక వాహనంలో కొత్త బస్టాండ్ సమీపంలో గల ఆయన నివాసానికి తీసుకెళ్లారు. అనంతరం సద్దల చెరువు వద్దగల శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.అంతకుమందు ఆయన భౌతిక కాయాన్ని ఎంవీఎన్ భవన్‌లో ప్రజల సందర్శనార్థం ఉంచారు.

అక్కడ జరిగిన సంతాప సభలో సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని మాట్లాడుతూ.. నాటి నుంచి నేటి వరకు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకూ నిలబడిన వ్యక్తి బుచ్చి రాములు అని కొనియాడారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకట్, నంద్యాల నరసింహారెడ్డి, జూలకంటి రంగారెడ్డి తదితరులు బుచ్చిరాములు కుమారుడు, సాక్షి ఎడిటర్ వర్దెల్లి మురళిని, కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. వారు మాట్లాడూతూ బుచ్చి రాములు పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. 85 సంవత్సరాల జీవితంలో 60 సంవత్సరాలు పార్టీకి అంకితం చేశారనీ, అలాంటి నాయకుడిని కోల్పోవడం పార్టీకి తీరనిలోటనీ అన్నారు. మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి, టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు కోదండరామ్. రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ తదితరులు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.సిపిఎం జిల్లా కార్యదర్శి ములకలపల్లి రాములు అధ్యక్షతన సంతాప సభ జరిగింది.

వి శ్రీనివాసరావు సంతాపం

బుచ్చిరాములు మృతి పట్ల సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు సంతాపాన్ని వ్యక్తంచేశారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు ఆయన నిలబడ్డారని, ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ సంతాపం

సాక్షి దినపత్రిక సంపాదకుడు మురళి తండ్రి, సిపిఎం తెలంగాణ రాష్ట్ర నాయకులు వి.బుచ్చిరాములు మృతికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

బిసి గురుకులాలకు 65 రెగ్యులర్ పోస్టులు మంజూరు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బిసి గురుకుల పాఠశాలలకు రెగ్యులర్ ప్రాతిపదికన 65 పోస్టులు మంజూరు చేశారు. వీటితో పాటు కాంట్రాక్ బేసిస్ కింద 715 టీచింగ్, సర్వీస్ ఔట్‌సోర్స్ కింద 27 నాన్ టీచింగ్ పోస్టులను మంజూరు చేస్తూ బిసి సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బి ఉదయలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. శాశ్వత ప్రాతిపదిన మంజూరు చేసిన వాటిల్లో 65 ప్రిన్సిపాల్ పోస్టులు ఉన్నాయి. కాంట్రాక్ట్ బేసిస్ కింద మంజూరు చేసిన 715 ఖాళీల్లో 455 పిజిటి, 65 స్టాఫ్ నర్సు, పిఇటి 65, లైబ్రేరియన్లు 65, మరో 65 ఆర్ట్ ఉపాధ్యాయుల పోస్టులు ఉన్నాయి.

విద్యుత్ సంస్కరణాలతో ధరలకు కళ్లెం

ఈఆర్‌సి చైర్మన్ భవానీ ప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ సంస్కరణలతో ధరలకు కళ్లెం వేశామని ఎపి ఎలక్ట్రిసిటీ రెగ్యూలేటరీ కమిషన్ చైర్మన్ జస్టిస్ భవానీ ప్రసాద్ అన్నారు. ఎపి ఎనర్జీ ఇన్నోవేషన్ సమ్మిట్-2019 కార్యక్రమం విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన అతిధిగా హాజరై మాట్లాడారు. విద్యుత్ రంగంలో నష్టాలను తగ్గించి డిస్కంల ఆదాయం పెంచడంతో విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించగలుగుతున్నామని తెలిపారు. విద్యుత్ కొనుగోలు ఖర్చును 86శాతం నుంచి 76శాతానికి తగ్గించామన్నారు. ఈ ఏడాది స్వల్పకాలిక విద్యుత్ కొనుగోలుకు ప్రయత్నిస్తున్నామని, విద్యుత్ వినియోగ చార్జీలు కొంత శాతానికి తగ్గించగలిగామని చెప్పారు. వినియోగదారులకు ఎటువంటి డబ్బు చెల్లించకుండా విద్యుత్‌ను సరఫరా చేయాలనేది తన కల అని చెప్పారు. గాలి, నీరు లాగా విద్యుత్ కూడా అత్యంత ముఖ్యమైన వస్తువు అయ్యిందని తెలిపారు. ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ మాట్లాడుతూ మార్చిలోపు అన్ని గ్రామపంచాయితీలలో ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నెట్‌క్యాప్ విసి, ఎండి ఎం కమలాకర్‌బాబు, ఎపి ట్రాన్స్‌కో సిఎండి విజయానంద్, విద్యుత్ రంగ సలహాదారు కె రంగనాథన్ తదితరులు పాల్గొన్నారు.

ఏపి, తెలంగాణలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తాం

బకాయిలు చెల్లించనందుకే ఎన్టీపిసి హెచ్చరిక


ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు గడువులోపు బకాయిలు చెల్లించకపోతే విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని ఎన్టీపిసి హెచ్చరించింది. ఫిబ్రవరి 9ని తుదిగడువుగా నోటీసుల్లో పేర్కొంది. ఈ మేరకు ఆయా రాష్ట్రాలకు విద్యుత్ సరఫరా నియంత్రణ నోటీసులను జారీ చేసింది. గత రెండు నెలల పైబడి బకాయిలు చెల్లించకపోవటం వల్లే వీటిని జారీ చేసినట్లు ఎన్టీపిసి తెలిపింది. ఈ మూడు దక్షిణ భారత రాష్ట్రాలు(ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక) గత రెండు నెలలుగా రూ.4,138.39 కోట్లు చెల్లించలేదని స్పష్టం చేసింది. ఇందులో థర్మల్, సోలార్ పవర్ ప్రాజెక్టులకు సంబంధించి విద్యుత్ సరఫరాకు సంబంధించిన చెల్లింపులు కూడా ఉన్నాయి. ఫిబ్రవరి 9 లోపు బకాయిలు చెల్లించకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని నోటీసుల్లో పేర్కొంది. దీనివల్ల ఎన్టీపిసి రామగుండం, సింహాద్రి, తాల్చేర్, కుడ్గిల్లోని విద్యుత్ ప్లాంట్ల నుంచి 3,470 మెగావాట్ల విద్యుత్ సరఫరా ఆగిపోతుందని పేర్కొంది.

రాష్ట్రం	మొత్తం చెల్లించాల్సింది	60 రోజుల్లో చెల్లించాల్సింది
ఆంధ్రప్రదేశ్	రూ.2,971.83 కోట్లు	రూ.2,219.84 కోట్లు
తెలంగాణ	రూ.2,152.92 కోట్లు	రూ.1,356.06 కోట్లు
కర్ణాటక	రూ.713.29 కోట్లు	రూ.562.49కోట్లు

దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి రూ.7,859 కోట్ల బకాయిలు పెండింగ్‌లు ఉన్నాయని ఎన్టీపిసి వెల్లడించింది. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచే అధిక మొత్తంలో రావాల్సి ఉందని కంపెనీ ఎగ్జిక్యూటివ్‌లు తెలిపారు. ఈ జాబితాలో ఉత్తరప్రదేశ్ తరువాత స్థానంలో ఉందన్నారు. కేంద్ర విద్యుత్ శాఖ పోర్టల్‌లో పేర్కొన్న సమాచారం మేరకు.. ఎన్టీపిసికే కాకుండా ఇతర విద్యుత్ సరఫరా కంపెనీలకు ఉత్తరప్రదేశ్ రూ. 6,127 కోట్లు బకాయి పడింది. రాజస్థాన్ రూ.2404 కోట్లు, పంజాబ్ రూ.1,041 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది.

ఈసారి మీరు మెచ్చేట్లు చేస్తా



రామ్‌చరణ్

బోయపాటి శ్రీను దర్శకత్వంలో రామ్ చరణ్ నటించిన 'వినయ విధేయ రామ' సంక్రాంతి సీజన్‌లో విడుదలై అంచనాలను అందుకోలేకపోయింది. బ్లాక్ బ్లాస్టర్ మూవీ 'రంగస్థలం'తో నటుడిగా కెరీర్ బెస్ట్ పెర్ఫార్మన్స్ ఇచ్చిన రామ్ చరణ్ నుండి ఇలాంటి సినిమా రావడం ఆయన ఫ్యాన్స్ కూడా జీర్ణించుకోలేపోయారు. ఇక సినిమా విడుదలయ్యాక దీని ఫలితంపై స్పందించడానికి కూడా ఎవరు ముందుకు వచ్చే సాహసం చేయలేకపోయారు. అయితే తాజాగా చరణ్ ఈ సినిమా పై స్పందిస్తూ ఒక లేఖను విడుదలచేశారు. "సినిమా కోసం చాలా కష్టపడ్డాం. ఎంతగానో శ్రమపడి మిమ్మల్ని అలరించాలని మేము చేసిన ఈ ప్రయత్నం దురదృష్టవశాత్తు సక్సెస్ కాలేకపోయింది. మీరు చూపించే ప్రేమను ప్రేరణగా తీసుకొని ఇక ముందు మీరు మెచ్చే సినిమాలు చేసేలా కృషి చేస్తానని" చరణ్ ఆ లేఖలో పేర్కొన్నారు.

సాధారణ విషయం కాదు

– దిల్ రాజు



'సినిమా ఫస్ట్ సాంగ్ రిలీజ్ రోజునే సినిమా బాగా ఉందని, ఆడేలా ఉందని చెప్పాను. నిజంగానే సినిమాను ప్రేక్షకులు ఆదరించారు. ఈరోజుల్లో సినిమా ఆడేదే కష్టం. అలాంటిది 50 రోజులు పూర్తి చేసుకోవడం అంటే సాధారణ విషయం కాదు' అని దిల్‌రాజు అన్నారు.

బెక్కెం వేణుగోపాల్, రియాజ్ నిర్మాతలుగా రూపొందిన చిత్రం 'హుషారు'. శ్రీహర్ష కొనుగంటి దర్శకుడు. తేజస్ కంచర్ల, తేజ్ కూరపాటి, అభినవ్ మంచు, దినేష్ తేజ్, దక్ష నగార్కర్, ప్రియా వడ్లమాని, హేమ ఇంగ్లే ప్రధాన తారాగణంగా రూపొందిన ఈ సినిమా డిసెంబర్ 14న విడుదలై 50 రోజులను పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నిర్మాత బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ.. సినిమా ఇంత పెద్ద విజయాన్ని సాధిస్తుందని నేను ఊహించలేదు. కొన్ని ఏరియాల్లో షిఫ్టింగ్‌తో, శ్రీ మయూరిలో ఫుల్‌రన్‌తో 50 రోజులు వరకు సినిమా రన్ అయ్యింది. హార్డ్‌వర్క్‌కి మంచి పేరు వస్తుందనడానికి మా సినిమానే కారణం. ఈ సినిమా కోసం యూనిట్ అందరం ఏడాదిన్నర పాటు కష్టపడ్డాం. సినిమాకు సంబంధించిన పాటలు, ట్రైలర్ బయటకు వచ్చినప్పుడు వచ్చిన రెస్పాన్స్‌తో మాలో నమ్మకం బాగా పెరిగింది. శ్రీహర్ష చాలా ఓపికగా, ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా చేశాడని అన్నారు. ఇంకా తేజ్ కొర్రపాటి, దినేష్, ప్రియా వడ్లమాని, దక్షనగార్కర్ మాట్లాడుతూ.. విజయం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు.

శ్రీహర్ష కొనుగంటి మాట్లాడుతూ.. నేను చెప్పిన 5 నిమిషాల కథ విని ఎగ్జయిట్ అయ్యి సినిమాను చేయడానికి నాతో ట్రావెల్ చేశారు. ఈ సినిమాకు పనిచేసిన టెక్నీషియన్స్‌కు మా కంటే ఎక్స్‌పీరియెన్స్ ఉన్నా.. మాతో ఫ్రెండ్స్‌లా కలిసి పోయి సినిమా చేశారు. అందరికీ ధన్యవాదాలు అన్నారు.

'4 లెటర్స్' విజయవంతం కావాలి

వెంకటేష్

ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకిత మహారాణా హీరో హీరోయిన్లుగా పరిచయం అవుతున్న చిత్రం '4 లెటర్స్'. 'కుర్రాళ్ళకి అర్థమవుతుందిలే' అన్నది ఉప శీర్షిక. ఆర్.రఘురాజ్ దర్శకత్వంలో దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ నిర్మించారు. ప్రముఖ కథానాయకుడు వెంకటేష్ టీజర్, ట్రైలర్‌ను చూసి చిత్ర కథానాయకుడు, దర్శక, నిర్మాతలను అభినందించి, చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కాగా, ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఈనెల 22న విడుదలకానుంది.



వెంకటేష్‌తో '4లెటర్స్' హీరో ఈశ్వర్

ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ.. టీజర్‌ను రాఘవేంద్రరావు విడుదల చేయటం మాకెంతో ఆనందంగా ఉంది. ఇందులో ఈశ్వర్ చక్కగా నటించాడు. సత్యానంద్‌గారి వద్ద శిక్షణ తీసుకున్న ఈశ్వర్.. ఈ సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేశారు. కమర్షియల్ హంగులతో యూత్ సహా అన్నీ వర్గాలను ఆకట్టుకునే ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందించాం అన్నారు.

దర్శకుడు ఆర్.రఘురాజ్ మాట్లాడుతూ.. నేటితరం ప్రేమకథాచిత్రం. అందుకే 'కుర్రాళ్ళకి అర్థమవుతుందిలే' అన్నది ఉప శీర్షికగా పెట్టాం. ప్రేమ, పెళ్లి విషయాలలో నేటితరం యువత ఆలోచనలు, అభిప్రాయాలు, వాస్తవాలు ఏమిటన్నది విషయాలను వాస్తవానికి దగ్గరగా ఉండేలా చిత్రీకరించటం జరిగింది. కథ, కథనాలు, సంభాషణలు అన్నివర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా సాగటంతో పాటు ఆలోచన రేకెత్తించేలా ఉంటాయి అన్నారు.

'ఎంతవారలైనా' శిక్షార్హులే!

'ఎంతవారలైనా కాంత దాసులు కావచ్చు, కనకదాసులు కావచ్చు. కానీ, తప్పు చేసినప్పుడు ఎంతవారలైనా కూడా కచ్చితంగా శిక్షార్హులే' అనే అంశాన్ని ప్రధానంగా ఎంచుకుని తెరకెక్కిస్తున్న చిత్రం 'ఎంతవారలైనా' అని చిత్ర దర్శకుడు గురు చిందేపల్లి తెలియజేస్తున్నాడు. థ్రిల్లర్ హారర్ మూవీగా రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ తుదిదశకు చేరుకుంది. రామదూత ఆర్ట్స్ పతాకంపై జి.సీతారెడ్డి నిర్మిస్తున్నారు. అద్వైత్, జహీదా శ్యామ్, అలోక్ జైన్, సీతారెడ్డి ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.



ఎంతవారలైనా దర్శకుడు గురు, నిర్మాత సీతారెడ్డి

నిర్మాత జి.సీతారెడ్డి మాట్లాడుతూ.. నటన మీద ఉన్న ఆసక్తితోనే డైరెక్టర్ ప్రోత్సాహంతో ఈ సినిమాలో ఒక క్యారెక్టర్ కూడా చేశాను. కథ ఎంతో నచ్చి ఈ సినిమాను చేశాం. హైదరాబాద్, మైసూర్, బెంగళూరు, చిక్‌మంగళూరులలో దాదాపు 60 రోజుల పాటు షెడ్యూల్ చేశాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే ఫస్ట్ లుక్ రిలీజ్ చేస్తాం' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సుక్కు, ఫోటోగ్రఫీ: ఎస్.మురళీమోహన్‌రెడ్డి.

సిద్ధమైన 'ఉన్మాది'



ఉన్మాదిలో రమ్య, ఎస్ఆర్‌రెడ్డి

పోలీస్ అంటే రక్షణ. ఆపదలో ఉన్న వారికి అభయ హస్తం అందించి రక్షణ అందించే పోలీసులు కర్కశంగా ఉన్మాదిగా ఎందుకు మారాడు? అసలు అలా మారడానికి దారి తీసిన పరిస్థితులేంటి? అనే విషయాలను తెలుసుకోవాలంటే 'ఉన్మాది' సినిమా చూడాల్సిందే అంటున్నారు దర్శకుడు ఎస్.ఆర్.రెడ్డి. ప్రవీణ క్రియేషన్స్ ప్రై.లి. పతాకంపై ఎస్.కరణ్ రెడ్డి సమర్పణలో రూపొందుతోన్న చిత్రం. సెన్సార్ సహా అన్నీ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఈనెల 8న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శక నిర్మాత టైటిల్ పాత్రధారి ఎస్.ఆర్.రెడ్డి మాట్లాడుతూ.. "ఇది ఒక గ్రామీణ నేపథ్యంలో జరిగే కథ. సినిమా పూర్తి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుంది. డేవిడ్ సంగీతం అందించిన ఈ సినిమా పాటలు, ట్రైలర్‌ను ఇటీవల విడుదల చేశాం. చాలా మంచి స్పందన వచ్చిందని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: డేవిడ్, కెమెరా: దంటు వెంకట్, నిర్వహణ: ఎస్.వరలక్ష్మి.

'లగాన్' తరహాలో



తమిళ స్టార్ హీరో విజయ్ నటిస్తున్న 63వ చిత్రం చిత్రీకరణ ప్రస్తుతం చెన్నైలో జరుగుతుంది. స్పోర్ట్స్ డ్రామాగా దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇక తాజాగా రెహమాన్ ఈ చిత్రం గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఇంతకుముందు ఎన్నడూ సౌత్ ఇండియా సినీ చరిత్రలో ఇలాంటి స్క్రిప్ట్ రాలేదని ఈ చిత్రం 'లగాన్, పీలే' తరహాలో ఉండనుందని తాజాగా జరిగిన ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు. దీన్ని బట్టి ఈ చిత్రం అట్లీ, విజయ్‌కి హ్యాట్రిక్ విజయాన్ని అందిచండం ఖాయంగా కనిపిస్తుంది. ఇంతకుముందు వీరి కాంబినేషన్‌లో తెరకెక్కిన 'తెరి, మెర్సల్' సూపర్ హిట్ అయ్యాయి. ఏజిఎస్ ఎంటర్టైన్మెంట్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నయనతార కథానాయికగా నటిస్తుంది. భారీ అంచనాల మధ్య ఈ చిత్రం ఈ ఏడాది దీపావళికి విడుదలకానుంది.

అమ్మ నేర్పింది.. మీకు నేర్పా..



ఏ తండ్రైనా తన తండ్రి అంతటివాడు లేడని పిల్లలు చెప్పడం సహజమే. కానీ బిజీ లైఫ్‌లో బిజీగా వుండే సినిమారంగంలో కుటుంబం కోసం సమయాన్ని వెచ్చించడమే కాకుండా విలువలు, సంప్రదాయాలు తండ్రి నుంచి నేర్చుకోవడం గొప్ప విషయమని ఎ.ఆర్. రెహమాన్ కుమార్తె ఖజితా రెహమాన్ పేర్కొంది. ఇటీవలే ముంబైలో 'స్లమ్ డాగ్ మిలియనీర్'కు ఆస్కార్ వచ్చిన పదేళ్ళ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె పాలుపంచుకుంది. తన తండ్రి పెద్ద సంగీత విద్వాంసుడే. కోట్లమందికి పూజ్యుడే. వారికంటే నాకెంతో పూజ్యుడు. ఎన్నో విషయాలను నేర్పాడంటూ తెలియజేసింది. దానికి ఆయన స్పందిస్తూ... ఇదంతా తనకు తాను ఎదిగే క్రమంలో తన తల్లి నేర్చుకున్నానంటూ వెల్లడించారు.



చేదు అనుభవాలు పుస్తకంగా..



'పరిశ్రమలో సుదీర్ఘ అనుభవాన్ని చూశాను. టీవీ కార్యక్రమాల నిర్వహణలో ఆర్థికంగా నష్టపోయాను. నా పక్కన నిలబడతారు అనుకున్న కొందరు కావాల్సిన సమయంలో దూరంగా వెళ్లారు. వీళ్లందరితో నేను ఎదుర్కొన్న చేదు అనుభవాలను పుస్తకంగా రాద్దామనుకున్నాను. కానీ అలా చేస్తే అంత మందికి దూరం అవ్వాల్సి ఉంటుంది. మరో వైపు చూస్తే లక్షలాది మంది సాయం కోసం ఎదురుచూస్తున్నారు. నేను ఎదుర్కొన్న బాధల కోపం, కసి , ప్రతీకారం, ఆవేదనకు మరో కోణంలో మొదలైందే 'మనం సైతం' అంటూ కాదంబరి కిరణ్ తెలిపారు.

ఈ సేవా సంస్థ క్రమం తప్పకుండా అవసరార్థులకు ఆర్థిక సహాయం అందిస్తోంది. వివిధ సమస్యల్లో చిక్కుకున్న పేదలను మనం సైతం సభ్యులు ఆదుకుంటూ మానవతను చాటుతున్నారు. పట్టువదలకుండా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తోంది. హైదరాబాద్ ఫిలిం చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో పది మంది పేదలకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వీరిలో విద్యా, వైద్యం, క్రీడలు వంటి వివిధ అవసరార్థులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతా లక్ష్మారెడ్డి, తెలంగాణ ఎఫ్ డీసీ ఛైర్మన్ రామ్మోహన్ రావు, దర్శకులు దశరథ్, న్యూస్ రీడర్ దీప్తీ వాజ్ పేయి, పాత్రికేయులు సాయి, మనం సైతం సభ్యులు బందరు బాబీ, అనిల్ కుమార్, వినోద్ బాలా, సురేష్, కవిత తదితరులు పాల్గొన్నారు.

సగం ఖర్చుతో ఆరోగ్యబీమా

ఎఫ్‌డీసీ ఛైర్మన్ రామ్మోహన్ రావు మాట్లాడుతూ... పేదలకు డబ్బులు ఇవ్వడమే కాదు, ఆత్మీయత పంచుతున్నారు. అవసరం ఉన్న వాళ్ల ఇంటికి వెళ్లి పరామర్శించి, ఆదుకుంటున్నారు. చిత్ర పరిశ్రమ అంటే పోటీ. ఇక్కడ నిత్యం పరుగులు పెట్టాలి. అవన్నీ వదిలేసి పేదలకు సేవ చేయడం ఎంతో కష్టమైన పని. చిత్ర పరిశ్రమలో కొన్ని విభాగాల కార్మికులకు ఆరోగ్య బీమా సౌకర్యం లేదు. అలాంటి శాఖల కార్మికులకు తెలంగాణ ఫిలిం డెవలప్ మెంట్ కార్పొరేషన్ నుంచి సగం ఖర్చు మినహాయింపుతో ఆరోగ్య బీమా అందజేస్తామని ఈ సందర్భంగా చెబుతున్నాను. అలాగే చిత్ర పురి కాలనీలో ఒక వైద్యశాల నిర్మించే ప్రయత్నం చేస్తున్నాం. పేద సినీ కార్మికులకు వైద్యం అందజేసేందుకు కృషి చేస్తాం. అన్నారు.

'అంజలి సిబిఐ'గా నయనతార

నయనతార నటించిన బ్లాక్ బస్టర్ సినిమా 'ఇమైక్క నోడిగల్'. ఈ చిత్రాన్ని తెలుగులో 'అంజలి సిబిఐ' పేరుతో అనువదిస్తున్నారు. ఆర్ అజయ్ జ్ఞానముత్తు ఈ క్రైమ్ థ్రిల్లర్ తెరకెక్కించారు. నయనతార సిబిఐ ఆఫీసర్‌గా నటించింది. అథర్వ, రాశీఖన్నా కీలక పాత్రల్లో నటించగా బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ప్రతినాయకుడిగా నటించారు. ప్రముఖ హీరో విజయ్ సేతుపతి విక్రమాదిత్య అనే అతిథి పాత్రలో నటించారు. నయనతార భర్త పాత్ర ఇది. ఈ చిత్రాన్ని క్యామియో ఫిల్మ్ బ్యానర్ సంస్థలో సిజే జయకుమార్ నిర్మించారు. హిప్ హాప్ తమిళన్ ఈ చిత్రానికి సంగీతం అందించగా ఆర్‌డి. రాజశేఖర్ సినిమాటోగ్రఫీ అందించారు. తెలుగు అనువాద కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయి. విశ్వశాంతి క్రియేషన్స్ బ్యానర్ పై తెలుగు హక్కులను సిహెచ్ రాంబాబు, ఆచంట గోపీనాథ్ దక్కించుకున్నారు. ఈనెల 22న విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.


'బిలాల్‌పూర్ పోలీస్ స్టేషన్'

ఎంఎస్ క్రియేషన్స్ పతాకంపై మహంకాళి శ్రీనివాస్ నిర్మించిన చిత్రం 'బిలాల్ పూర్ పోలీస్ స్టేషన్'. మాగంటి శ్రీనాథ్, సాన్వీ మేఘనా జంటగా నటించారు. గోరేటి వెంకన్న ఓ కీలక పాత్ర పోషించారు. దర్శకుడు నాగసాయి మాకం తెరకెక్కించిన ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమవుతోంది. మార్చి రెండో వారంలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాత సన్నాహాలు చేస్తున్నారు.



ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ.. మంచి కథకు నిర్మాణ విలువలు తోడయితేనే ఆ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంది. పూర్తి వినోదాత్మక చిత్రంగా ఉంటూనే ఆలోచింపజేసే సినిమా అవుతుంది. ఇవాళ సమాజం ఎదుర్కొంటున్న ఒక సమస్యనూ ఇందులో చూపించాం. నిర్మాణాంతర కార్యక్రమాలు నాణ్యతతో చేశాం. మార్చి రెండో వారంలో పెద్ద పంపిణీ సంస్థ ద్వారా ఎక్కువ కేంద్రాల్లో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం అన్నారు.

దర్శకుడు నాగసాయి మాకం మాట్లాడుతూ.. ఎలాంటి అసభ్యత, అశ్లీలత లేని కథా కథనాలు ఉంటాయి. బిలాల్ పూర్ అనే ఊరి పోలీస్ స్టేషన్‌కు వచ్చే వింత వింత కేసులు కడుపుబ్బా నవ్విస్తాయి. సినిమా చూస్తున్న వాళ్లకు తమ ఊరిలో జరిగే సంఘటనలు గుర్తొస్తాయి. సినిమా ఆద్యంతం సహజమైన పాత్రలతో, సన్నివేశాలతో సాగుతుంటుంది. అన్నారు.



ఆధునిక నిత్యావసరాల్లో టీవీ, కంప్యూటర్, స్మార్ట్‌ఫోన్ తప్పనిసరి. ముఖ్యంగా అన్ని అవసరాలకు ఒకటే సాధనంగా స్మార్ట్‌ఫోన్ మారింది. మనిషి అవయవాల్లో ఇదొక భాగంగా మారిపోయింది. ఇదే మనిషి జీవన విధానానికీ ప్రమాదకారిగా మారింది. కంప్యూటర్, స్మార్ట్‌ఫోన్ వినియోగదారుల్లో ఇప్పుడు కొత్తగా కనిపిస్తోన్న రకరకాల వ్యాధులు 'విజన్ సింద్రోమ్' వలనే అని నిపుణులు చెబుతున్నారు. ఆ విజన్ సింద్రోమ్ లక్షణాలు, నివారణ మార్గాలేమిటో తెలుసుకుందాం...


విజన్ సింద్రోమ్‌తో జాగ్రత్త

సాంకేతికత అభివృద్ధి మానవ మనుగడను ఉచ్ఛస్థితికి చేర్చింది. అదే సందర్భంలో నాణేనికి రెండువైపులు ఉన్నట్లే... సాంకేతికత వినియోగంలో లాభనష్టాలూ ఉన్నాయి. చిన్న చిన్న కారణాల వల్ల ప్రాణాపాయాన్ని కొనితెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమౌతోంది. వీటిలో 'విజన్ సింద్రోమ్' ఒకటి. ఎక్కువగా కంప్యూటర్, టీవీ స్క్రీన్ చూస్తూ ఉన్నా, మొబైల్ చూస్తున్నా కంటి ఆరోగ్యం పాడవుతుంది. దీన్నే విజన్ సింద్రోమ్‌గా వ్యవహరిస్తున్నారు. ఇది మనిషి మనుగడకు ఉచ్చు బిగిస్తోంది. కంప్యూటర్, మొబైల్ ఫోన్, టీవీ – నేడు సర్వసాధారణ ఉపకరణాలు. వినోదాన్ని పంచే టీవీ ప్రమాదం అంచుకు నెడుతోంది. అవసరాన్ని తీర్చే కంప్యూటర్ వ్యసనంగా తయారైంది. రోజులో దాదాపు 10 గంటలు కంప్యూటర్స్, టీవీల ముందు గడుపుతున్నారు. వీటిలో మొబైల్ ఫోన్ మన శరీరంలో ఒక అవయవంగా మారిపోయింది. పడకలోనూ పక్కనే చేరుతుంది. రోజులో గంటపాటూ వదిలి ఉండలేని పరిస్థితి. సెల్‌ఫోన్‌ను అపరిమితంగా వినియోగించడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. కంటికి సంబంధించిన సమస్యలతో పాటు, ఇతర శరీరభాగాల పనితీరు స్తంభించిపోతున్నట్లు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్‌ను అతిగా వినియోగించడం వల్ల వచ్చే 'విజన్ సింద్రోమ్' వ్యాధి వస్తుందని, అది మెదడు పనితీరుపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందని వైద్యులు చెబుతున్నారు.

కంప్యూటర్, మొబైల్ ఫోన్ నుంచి వచ్చే రేడియేషన్ వల్ల దృష్టిలోపాలు ఏర్పడే అవకాశం ఉంది. అంతకన్నా ముందు కళ్లు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతాయి. ఆసక్తికరమైన అంశం ఏదైనా కనిపిస్తేనో, గేమ్స్ ఆడుతూనో, వీడియోలనో తదేకంగా చూస్తూ రెప్ప వేయడమూ మరిచిపోతాం. రెప్ప వేయకుండా చూడడం వల్ల కళ్లు తడి ఆరిపోతాయి. కళ్ల చుట్టూ ఉండే కండరాలు బిగుసుకుపోతాయి. ఇది నిద్రలేమికీ కారణమవుతుంది. కానీ కనురెప్పలు క్షణక్షణానికీ మూసుకుని తెరుస్తూ ఉంటేనే కళ్లు లూబ్రికెంట్ అయివుంటాయి. ఈ సమస్య ఎక్కువైతే ప్రమాదంగా పరిణమిస్తుంది. ఈ వ్యాధి నేటితరం యువతలో ఎక్కువగా కనిపించడం ఆందోళన కలిగిస్తోందని, సెల్‌ఫోన్‌ను అతిగా చూడడం వల్ల తీవ్రమైన తలనొప్పి, కంటినొప్పి వంటి సమస్యలు వస్తున్నాయని, ఈ సమస్యను విస్మరిస్తే తుదకు చూపు మందగించే ప్రమాదం ఉందని డాక్టర్లు స్పష్టం చేస్తున్నారు.



ప్రపంచవ్యాప్తంగా ప్రతియేటా సుమారు 10 మిలియన్ల మంది కంప్యూటర్ విజన్ సింద్రోమ్ (సివిఎస్) కు గురవుతున్నట్లు అమెరికాలో జరిపిన ఒక అధ్యయనంలో వెల్లడైంది. ప్రతిరోజూ మూడు గంటలకు మించి కంప్యూటర్‌పై పనిచేసే వారిలో కంటికి సంబంధించిన సమస్యలు అధికంగా ఉన్నాయని ఈ అధ్యయనంలో వెల్లడైంది.



సివిఎస్ సమస్య ఉత్పన్నమవడానికి కంప్యూటర్ స్క్రీన్ నుంచి వెలువడే రేడియేషన్ ఒక ప్రధాన కారణం. అలాగే పరిసరాలలోని వెలుతురులో హెచ్చుతగ్గులు, కంప్యూటర్ అమరిక, కంప్యూటర్ ముందు కూర్చునే విధానం, గంటల తరబడి కదలకుండా కంప్యూటర్ మీద పనిచేయడం వంటి కారణాలతోపాటు, దృష్టి లోపాలూ సివిఎస్ కలగడానికి కారణమవుతాయి.

విజన్ సింద్రోమ్ లక్షణాలు

తీవ్రమైన కళ్ల మంట, వస్తువులు మసకబారినట్టు కనపడడం, దురదగా ఉండటం, స్క్రీన్‌పై కనిపించే చిత్రాలు మసకగా కనిపించడం అయిపోవడం, అలిసిపోయినట్లుగా అనిపించడం తరచూ తీవ్రమైన తలనొప్పి, కంటినొప్పి పై లక్షణాలు కనిపిస్తే విజన్ సింద్రోమ్ తీవ్రత పెరిగినట్లుగా గుర్తించాలి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చిన్నవయసులోనే కంటిచూపు మందగించే ప్రమాదం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.


నివారణ

- ప్రతి అరగంటకు ఒకసారి కళ్లు మూసుకుని, రెండు అరచేతులను కళ్ల మీద పెట్టుకోవాలి. అలా 30 నుంచి 60 క్షణాల వరకూ ఉండాలి.
- ప్రతి గంటకు ఒకసారి దూరంగా కనిపించే వాటిని కొద్దిసేపు చూడాలి. ఇలా చేయడం వల్ల కళ్లకు విశ్రాంతి లభిస్తుంది. కళ్లు రిలాక్స్ అయ్యి, కంటి సమస్యలు రాకుండా చాలావరకూ తప్పించుకోవచ్చు.
- వీలైనంత వరకూ చిన్న పిల్లలను స్మార్ట్ ఫోన్లు, కంప్యూటర్లకు దూరంగా ఉంచాలి.
- అవసరానికి మించి స్మార్ట్‌ఫోన్ల వినియోగించరాదు.
- కంప్యూటర్‌పై ఎక్కువ సమయాన్ని వెచ్చించేవారు కనీసం గంటకోసారి ఐదు నిమిషాల చొప్పున విశ్రాంతి తీసుకోవాలి.
- కంప్యూటర్ తెర మన కళ్ల కంటే కాస్త తక్కువ ఎత్తులో ఉండాలి. ఇలా చేయడం వల్ల కళ్లను మరీ పెద్దవి చేసి, చూడాల్సిన అవసరం ఉండదు. దీంతో కళ్లపై కాస్త భారం తగ్గుతుంది.
- కంప్యూటర్, ఫోన్లలో స్క్రీన్ లైటింగ్ తగ్గించాలి.
- కలర్స్‌ను కూడా సరిపోయే విధంగా అడ్జస్ట్ చేసుకోవాలి.
- టియర్ డ్రాప్స్ వాడడం ద్వారా కొంతవరకు సమస్యను తగ్గించుకోవచ్చు.

- ఉదయమిత్ర

గూగుల్ ప్లస్ ఏప్రిల్ 2 వరకే...

ప్రముఖ సెర్చింజన్, సాఫ్ట్‌వేర్ దిగ్గజం గూగుల్... ఎప్పటికప్పుడు సరికొత్త సాంకేతికతను అందిస్తుందనే విషయం తెలిసిందే. అదే సందర్భంలో అంతగా ప్రజాదరణ పొందని వాటిని మూసేస్తుందనే విషయమూ విదితమే. అలా మూసేస్తున్న కోవలోకి చేరింది 'గూగుల్ ప్లస్'. గతేడాది డిసెంబర్‌లోనే తన గూగుల్ ప్లస్ సేవలను నిలిపివేయనున్నట్లు ప్రకటించింది. ఆ మేరకు వచ్చే ఏప్రిల్ 2వ తేదీ నుంచి గూగుల్ ప్లస్ సేవలను నిలిపివేయనుంది. అలాగే వినియోగదార్లకు సంబంధించిన గూగుల్ ప్లస్ అకౌంట్లు, వారు క్రియేట్ చేసుకున్న పేజీలు, అందులో ఉండే సమాచారం పూర్తిగా డిలీట్ అయిపోతుంది. అయితే, తమ సమాచారం కావాలనుకున్న వారికి మాత్రం వారి వారి డేటాను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని గూగుల్ అందిస్తున్నది. ఈ అవకాశం ఏప్రిల్ 2వ తేదీ వరకు మాత్రమే ఉంటుంది. అయితే గూగుల్ ఫొటోస్‌లో బ్యాకప్ అయి ఉన్న ఫొటోలు, వీడియోలు మాత్రం డిలీట్ అవ్వవని గూగుల్ తెలిపింది. సాఫ్ట్‌వేర్ పరమైన సాంకేతిక లోపాలతో వినియోగదారుల సమాచారం ఇతరుల చేతికి చేరే అవకాశాలుండటమే దీనికి ప్రధాన కారణమని గూగుల్ తెలిపింది. ఒక బగ్ మూలంగా 5,00,000 మంది వినియోగదార్ల వ్యక్తిగత సమాచారం బయటి డెవలపర్లకు అందుబాటులోకి వచ్చిన విషయాన్ని గుర్తించిన గూగుల్ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ★



ఈ ఫోన్ ఖరీదు రూ.92 వేలు

మిజు (Meizu) బ్రాండ్ అభివృద్ధి చేసిన ప్రపంచపు మొట్టమొదటిసారిగా ఎలాంటి రంధ్రాలు, పోర్టులు లేకుండా లభ్యమౌతోన్న తొలి స్మార్ట్‌ఫోన్ మిజు జీరో (Meizu Zero). దీని ధర సుమారుగా రూ.92,000. ఆధునిక సాంకేతికత మేళవింపుతో రూపుదిద్దుకున్న ఈ ప్రయోగాత్మక స్మార్ట్‌ఫోన్– సామ్‌సంగ్ గెలాక్సీస్ 9 తరహాలో కర్వ్‌డ్ సైడ్స్, సిరామిక్ బాడీ, ఐపీ68 వాటర్ అండ్ డస్ట్ రెసిస్టెన్స్‌తో స్లిమ్ టాప్ ఇంకా బోటమ్ బిజెల్స్‌ను కలిగి ఉంటుంది. 5.99 అంగుళాల ఫుల్ హైడెఫినిషన్ ప్లస్ అమోల్డ్ డిస్‌ప్లే, ఇన్‌బిల్ట్‌గా ఫింగర్ ప్రింట్ సెన్సార్‌తో పాటు ఎమ్‌సౌండ్ 2.0 అనే టెక్నాలజీని ఉపయోగించుకుని హై–క్వాలిటీ సౌండ్‌ను ఉత్పత్తి చేస్తుంది. మైక్రోఫోన్స్ ఫోన్ బోటమ్ ఎడ్జ్‌లో హైడ్ కాబడి ఉంటాయి. వైర్‌లెస్ ఛార్జింగ్ ద్వారా అ ఫోన్‌ను ఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. సిమ్ కార్డ్ స్లాట్ స్థానంలో ఈ–సిమ్ స్లాట్‌ను ఉపయోగించుకోవాలి. ఇక ప్రాసెసర్ విషయానికి వచ్చేసరికి మిజు జీరో స్నాప్‌డ్రాగన్ 845 చిప్‌సెట్‌పై పనిచేస్తుంది. ర్యామ్, స్టోరేజ్, బ్యాటరీ విభాగాలకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. ఇక కెమేరా విషయానికొస్తే... వెనుక భాగంలో 12 మెగా పిక్సెల్ + 20 మెగా పిక్సెల్ సెన్సార్స్ కాంబినేషన్‌లో డ్యుయల్ సెన్సార్స్, ఫోన్ ముందుభాగంలో 20 మెగా పిక్సెల్ సెల్ఫీ స్నాపర్‌ను అమర్చారు. మొత్తంగా ఈ స్మార్ట్‌ఫోన్ ప్రస్తుతం వస్తోన్న ఫోన్లకు భిన్నంగా వినూత్నమైన సాంకేతికతతో ఆకర్షణీయంగా ఉంది. ★



ఫొటో ఎడిటింగ్ యాప్స్‌తో డేటా చోరీ

ఫొటో ఎడిటింగ్ యాప్స్ వాడుతున్నారా? అయితే ఒక్క క్షణం! గూగుల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొనే ఫొటో ఎడిటింగ్ యాప్స్ ద్వారా వినియోగదార్ల సమాచారాన్ని దొంగలిస్తున్నారనే విషయం మీకు తెలుసా? గూగుల్ ప్లేస్టోర్‌లోని 29 ఫొటో ఎడిటింగ్ యాప్స్ వినియోగదార్ల సమాచారాన్ని చోరీ చేస్తున్నాయట! ఈ కారణంగానే గూగుల్ తన ప్లేస్టోర్‌లోని 29 ఫొటో ఎడిటింగ్ యాప్స్‌ను తొలగించినట్టు తాజాగా వెల్లడించింది. వీటి వల్ల వినియోగదారుల సమాచారానికి భారీ ప్రమాదం ఏర్పడిందన్న నివేదికల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు గూగుల్ చెబుతోంది. మన దేశంలో– ప్రో కెమెరా బ్యూటీ, కార్టూన్ ఆర్ట్ ఫొటో, ఎమోజి కెమెరా వంటి యాప్స్ కొన్ని లక్షలకు పైగా డౌన్‌లోడ్ అవుతున్నాయని, ఇది ఆందోళన కలిగించే అంశమని గూగుల్ పేర్కొంది. హానికరమైన ఈ యాప్స్ వివిధ స్మార్ట్‌ఫోన్లలోకి మాల్‌వేర్‌ను పంపిస్తున్నాయంటూ అమెరికా ఆధారిత సైబర్ సెక్యూరిటీ రీసెర్చ్ సంస్థ ట్రెండ్ మైక్రో గుర్తించింది. ప్లేస్టోర్‌లోని బ్యూటీ కెమెరా యాప్స్ రిమోట్ యాడ్ కాన్ఫిగరేషన్ సర్వర్లను యాక్సెస్ చేయగలదని ట్రెండ్ మైక్రో తన అధికారిక బ్లాగ్‌పోస్ట్‌లో వెల్లడించింది. ముఖ్యంగా ప్రో కెమెరా బ్యూటీ, ఎమోజీ కెమెరా, సెల్ఫీ కెమెరా ప్రో, ఫొటో ఎడిటర్, ఆర్ట్ ఎఫెక్ట్, వాల్‌పేపర్స్ హెచ్‌డీ, ప్రిజ్మా ఫొటో ఎఫెక్ట్ వంటి యాప్స్ ఈ జాబితాలో ఉన్నాయి. వినియోగదార్ల చిరునామాలు, ఫోన్ నంబర్లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఇవి దొంగిలిస్తున్నాయి. ఈ యాప్స్ డౌన్‌లోడ్ చేయగానే వినియోగదార్లకు ఎలాంటి సందేహం రానివిధంగా, ఎవరూ గుర్తించలేని విధంగా ఒక షార్ట్‌కట్‌ను క్రియేట్ చేస్తుంది. దీనివల్ల ఈ యాప్‌ను అన్‌ఇన్‌స్టాల్ చేయడమూ కష్టమే. ★





చిన్నారి

జోక్:

తల్లి : ఇలా ఎలా ఫెయిలయ్యావురా? కనీసం సప్లిమెంట్ పరీక్షల్లోనైనా పాసవుతావా?


సోము : మార్చిలో ఒకలాగా, సెప్టెంబరులో ఒకలాగా రాయనమ్మా..!

పొడుపు కథ

చారల చారల పాము
చక్కని పాము
నూతిలో పాము
నున్నని పాము
ఏమిటది?

జవాబు : పొట్లకాయ

నీడ కనిపెట్టండి!



పిల్లలూ! ఇక్కడున్న చిత్రంలో.. కొన్ని కుక్క పిల్లలు వాటి నీడలు ఉన్నాయి. ఏది ఏ నీడో కనిపెట్టండి?

చిలుకా - నీ ఒంటి రంగు

చిలుకా చిలుకా నీ ఒంటిపచ్చ
ఎక్కడిదీ? ఎక్కడిదీ?
ఓ బుజ్జిపాప - ఓ బుజ్జిపాప
ఆకుల నడిగి అద్దుకొన్నా!
కొంగా, కొంగా నీ ఒంటి తెలుపు
ఎక్కడిదీ? ఎక్కడిదీ?
ఓ బుజ్జిపాప - ఓ బుజ్జిపాప
పాలనడిగి తెలుపు తెచ్చా!
కాకీ - కాకీ నీ ఒంటి నలుపు
ఎక్కడిదీ? ఎక్కడిదీ?
ఓ బుజ్జిపాప - ఓ బుజ్జిపాప
ఎండకు తిరిగి నల్లగ వచ్చా!





బి. స్రవంతి,
9వ తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
చిప్పగిరి,
కర్నూలు జిల్లా.

రంగులు దిద్దండి!



పిల్లలూ! ఇక్కడ మీకు ఎంతో ఇష్టమైన బొమ్మ ఉంది కదా.. ! దీనికి చక్కటి రంగులు వేయండి!

నేను గీసిన బొమ్మ





ఎం.కల్యాణ్,
8వ తరగతి,
జడ్.పి.హైస్కూలు,
పెనుమాక,
తాడేపల్లి మండలం,
గుంటూరు జిల్లా.

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపాల్సిన మా చిరునామా :

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ -Chinnaarips@gmail.com

మరో సిరీస్‌పై గురి



నేడు న్యూజిలాండ్‌తో తొలి టీ20

మధ్యాహ్నం 12.30 ని.ల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

వెల్లింగ్టన్ : న్యూజిలాండ్‌పై వన్డే సిరీస్‌ను గెలిచిన టీమిండియా నేడు కివీస్‌తో తొలి టీ20లో తలపడనుంది. వన్డే సిరీస్‌ను 4-1తో చేజిక్కించుకొని న్యూజిలాండ్ పర్యటనలో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసిన భారత్ మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌ను ఆతిథ్య జట్టుతో ఆడనుంది. భారత్ క్రికెటర్లు కొందరు బంతితో సత్తాచాటితే మరికొం దరు బ్యాటుతో విజృంభిస్తున్నారు. ప్రపంచ కప్ జట్టుకు కావాల్సిన ఆటగాళ్లను ఎంపిక చేసుకోవడానికి సెలక్షన్ కమిటీకి ఎటువంటి కష్టం లేకుండా 15 మంది క్రికెటర్లు ఒకరితో ఒకరు పోటీ పడి రాణిస్తు న్నారు. అయితే బుధవారం నుంచి జరగబోయే తొలి టీ20లో ఈ సీజన్‌లో నిర్విరామంగా ఆడుతున్న శిఖర్ ధావన్, ధోనీ, కుల్దీప్ యాదవ్ వంటి వారికి విశ్రాంతినిచ్చి రిషబ్‌పంత్, కృనాల్ పాండ్యా, సిద్దార్థ్ కౌల్, హార్థిక్ పాండ్యా వంటి యువ ఆటగాళ్లకు అవకాశమిస్తే బావుంటుంది. ఇంకోపక్క సీనియర్లతోనే టీ20 మ్యాచ్‌లు ఆడి గెలిస్తే ప్రపంచకప్ ముందు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని సీనియర్ విశ్లేషకులు అభిప్రాయపడు తున్నారు. రోహిత్ సారథ్యం లోనే టీమిండియా టీ20 బరిలోకి దిగనుంది. ఇదిలా వుండగా న్యూజి లాండ్ జట్టుకు టీ20 సిరీస్‌కు ముందే ఎదురుదెబ్బ తగిలింది. వన్డే సిరీస్ మొదటినుంచి అత్యుత్తమ ప్రదర్శ నతో కివీస్‌కు అండ గా నిల్చిన సీనియర్ ఆటగాడు ఓపెనర్ మార్టిన్ గప్టిల్ వెన్ను గాయంతో బాధపడు తుండడంతో సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. త్వరలో బంగ్లాదేశ్ సిరీస్‌కు సిద్ధమవుతాడని కివీస్ కోచ్ గ్యారీ స్టీడ్ ఆశాభావం వ్యక్తం చేశాడు. గుప్టిల్ స్థానంలో ఆల్‌రౌండర్ జిమ్మీ నీషమ్‌ను, డారిల్ మిచెల్, బ్లేయిర్ టిక్నర్‌లను జట్టులోకి న్యూజిలాండ్ ఎంపిక చేసింది. ఫిబ్రవరి 8న రెండో మ్యాచ్, 10న మూడో టీ20 మ్యాచ్ జరగనుంది.

భారత్ జట్టు

రోహిత్‌శర్మ(సారథి), శిఖర్ ధావన్, రిషబ్ పంత్, దినేష్ కార్తీక్, కేదర్ జాదవ్, ధోని(కీపర్), కృనాల్ పాండ్యా, కుల్దీప్ యాదవ్, చాహల్, భువనేశ్వర్ కుమార్, సిద్దార్థ కౌల్, ఖలీల్ అహ్మద్, శుభ్‌మన్ గిల్, విజయ్‌శంకర్, హార్దిక్ పాండ్యా, మహ్మద్ సిరాజ్.

న్యూజిలాండ్ జట్టు

కేన్ విలియమ్సన్ (సారథి), డగ్ బ్రాస్‌వెల్, కొలిన్ డి గ్రాండ్‌హోమ్, లాకీ ఫెర్గూసన్, స్కాట్ కగ్గెలిజిన్, డారెల్ మిచెల్, కొలిన్ మన్రో, జిమ్మీ నీషమ్, మిచెల్ శాంట్నర్, టిమ్ సీఫెర్ట్, ఇష్ సోధి, టిమ్ సౌథీ, రాస్ టేలర్. బ్లేయిర్ టిక్నర్



రిజర్వు ఆటగాళ్లకు పరీక్ష : విలియమ్సన్

టీమిండియాలాంటి అగ్రశ్రేణి జట్టుపై తమ రిజర్వు ఆటగాళ్లను పరీక్షించేందుకు ఆత్రుతగా ఉన్నట్టు న్యూజిలాండ్ సారథి కేన్ విలియమ్సన్ అన్నాడు. ఆల్‌రౌండర్లు ఎక్కువ మంది ఉండటంతో జట్టును సమతూకంగా ఉంచడం అవసరమని వెల్లడించాడు. టీ20 సిరీస్‌లో ఆల్‌రౌండర్ డారిల్ మిచెల్, పేసర్ బ్లెయిర్ టిక్నెర్ అరంగేట్రం చేస్తున్నారు. తక్కువ మ్యాచ్‌లు ఆడిన ఆల్‌రౌండర్ స్కాట్ కగ్గెలిజెన్, టిమ్ సీఫెర్ట్‌ను తీసుకున్నారు. మా వద్ద చాలామంది ఆల్‌రౌండర్లు ఉన్నారు. కొలిన్ మన్రోతోపాటు పవర్ హిట్టర్ల బ్యాటింగ్ ఆర్డర్ మారొచ్చు. టిమ్ సౌథీని ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకొని అతడికి విశ్రాంతి ఇవ్వాలి. కొత్త జట్టుగా ఆడుతుండటంతో కాస్త ఆత్రుతగానే ఉంది' అని విలియమ్సన్ అన్నాడు.



ఇంగ్లండ్ సిరీస్ అనంతరం

టీ20లకు మిథాలీ గుడ్‌బై?

న్యూఢిల్లీ : భారతజట్టు మహిళా క్రికెటర్ మిథాలీరాజ్ టీ20లకు గుడ్‌బై చెప్పనున్నారు. స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగే సిరీస్ అనంతరం తాను టీ20లకు గుడ్‌బై చెప్పాలనే ఆలోచనలో ఉన్నట్లు మంగళవారం తెలిపింది. కానీ వన్డేల్లో మాత్రం మరికొంతకాలం కొనసాగుతానన్నారు. న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను టీమిండియా మహిళాజట్టు 2-1తో చేజిక్కించుకోగా మిథాలీ కెప్టెన్‌గా వ్యవహరించిన విషయం తెలిసిందే. కివీస్ పర్యటనలో భాగంగా మూడు టీ20ల మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం వెల్లింగ్టన్‌లో తొలి టీ20లో మిథాలీకి తుదిజట్టులో చోటుపై సందేహం నెలకొంది. ప్రస్తుతం టీమిండియా టీ20 జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యం వహిస్తోంది. 36 ఏళ్ల మిథాలీ టీ20 ప్రపంచకప్-2020 వరకు కొనసాగాలని అనుకున్నా యువతకు ప్రాధాన్యతనివ్వాలనే ఉద్దేశ్యంతో ముందే కెరీర్‌కు ముగింపు పలకనున్నట్లు తెలిపింది. మిథాలీ ఇప్పటివరకూ 85 టీ20ల్లో 97 అత్యధిక పరుగులతోపాటు 17 అర్ధసెంచరీలతోపాటు 2,283 పరుగులను సాధించింది.

సౌరాష్ట్ర 307 ఆలౌట్

విదర్భతో రంజీట్రోఫీ ఫైనల్



నాగ్‌పూర్ : సౌరాష్ట్రతో జరుగుతున్న రంజీట్రోఫీ ఫైనల్లో విదర్భ బౌలర్లు సర్వేట్ (5/98), వాకరే (4/80) రాణించడంతో సౌరాష్ట్ర జట్టు 307 పరుగులకే ఆలౌటైంది. దీంతో విదర్భకు ఐదు పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. ఓవర్‌నైట్‌స్కోర్ ఐదు వికెట్ల నష్టానికి 158 పరుగులతో మూడో రోజు ఆటను కొనసాగించిన సౌరాష్ట్రను స్నెల్ పటేల్ (102) సెంచరీతో ఆదుకున్నాడు. చివరి వికెట్‌కు ఉనద్కడ్ (46) సకారియా(28) సాయంతో 60 పరుగుల భాగస్వామ్యాన్ని నిర్మించి జట్టును గౌరవప్రద స్కోర్‌కు చేర్చాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన విదర్భ మూడోరోజు ఆట ముగిసే సమయానికి రెండు వికెట్లు కోల్పోయి 55 పరుగులు చేసింది. ఓపెనర్లు ఫజల్(10), సంజయ్(16)పరుగులకే ఔటయ్యారు. గణేష్ 24, జాఫర్ 5 పరుగులతో క్రీజులో ఉన్నారు. అంతకుముందు విదర్భజట్టు తొలి ఇన్నింగ్స్‌లో 312 పరుగులు చేసిన విషయం తెలిసిందే.

వైద్య ఖర్చుల చెల్లింపుల్లో నిర్లక్ష్యం

సాయ్‌పై ధ్వజమెత్తిన బాక్సర్ మనోజ్‌కుమార్



న్యూఢిల్లీ : భారత సీనియర్ బాక్సర్ మనోజ్ కుమార్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్)పై మంగళవారం ఆరోపణలు చేశారు. తాను ఆసియా క్రీడల సందర్భంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న ఖర్చుల చెల్లింపులో సాయ్ వెనుకడుగు వేసిందన్నాడు. ఈ విషయాన్ని తెలియజేస్తూ కేంద్ర క్రీడల మంత్రి రాజ్యవర్ధన్‌సింగ్ రాథోడ్‌కు ఓ లేఖను కూడా రాసినట్లు తెలిపాడు. మూడుసార్లు కామన్వెల్త్ గేమ్స్‌లో పతకాన్ని గెల్చిన మనోజ్ కోచ్ రాజేష్ రాజౌండ్ ఈ విషయాన్ని సాయ్‌ను తెలియజేసినా స్పందించలేదని వాపోయాడు. సెప్టెంబర్ 10, 2018లో తాను 5.30 లక్షల రూపాయల హాస్పటల్ ఖర్చుల రిపోర్టులను సాయ్‌కు మెయిల్ చేసినా ఇప్పటివరకూ ఎటువంటి సమాధానం రాలేదంటూ మనోజ్ తన ఆవేదనను వ్యక్తం చేశాడు.

ఉత్సాహంగా మాస్టర్స్ అథ్లెటిక్స్ ప్రారంభం


విజయవాడ -ప్రజాశక్తి

ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేశ నలుమూలల నుంచి 3000 మంది అథ్లెట్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 45 సంవత్సరాల వయస్సు పైబడిన వారు ఈ పోటీలకు హాజరయ్యారు. రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రన్నింగ్, షార్ట్‌పుట్, జావెలిన్‌త్రో, హైజంప్, లాంగ్ జంప్ విభాగాలలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ నెల 10వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.



మరో రూ.4900 కోట్ల అప్పు

- వాణిజ్య బ్యాంకుల వద్దకు సిఆర్‌డిఏ
- అద్దె ప్రాతిపదికన హెచ్‌ఓడి భవనాలు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధానిలో నిర్మించనున్న హెచ్‌ఓడి భవనాలను అద్దెకిచ్చేందుకు సిఆర్‌డిఏకు అధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. దీని ప్రకారం భవనాల నిర్మాణానికయ్యే అప్పును తీర్చేవరకూ హెచ్‌ఓడి భవనాల్లో ఉండే ప్రభుత్వ రంగ సంస్థలు కూడా అద్దె చెల్లించాల్సి ఉంది. దీనికి సంబంధించిన విధివిధానాలు త్వరలో రూపొందించనున్నారు. 2017 మార్చి 23వ తేదీన జరిగిన సిఆర్‌డిఏ అథారిటీ మీటింగులో తీసుకున్న నిర్ణయం ప్రకారం తాము అప్పు కోసం వెళతామని, రీపెమెంట్ చేసే విషయంలో తమకు తగిన అనుమతులు ఇవ్వాలని సిఆర్‌డిఏ ప్రభుత్వాన్ని కోరింది. సిఆర్‌డిఏ రూపొందించిన విధి విధానాలకు అనుమతిస్తూ మంగళవారం ప్రభుత్వం జిఓ విడుదల చేసింది. దీని ప్రకారం హెచ్‌ఓడి భవనాల నిర్మాణానికి రూ.4900 కోట్లు ఖర్చవుతుందని పేర్కొంది. దీనికి వడ్డీ రూ.8.28 శాతం చొప్పున రూ.504 కోట్లు కలిపితే మొత్తం ప్రాజెక్టు ఖర్చు రూ.5404 కోట్లు అవుతుంది. మొత్తం విలువలో 20 శాతం ప్రభుత్వం సమకూర్చే అవకాశం ఉండగా మిగిలిన 80 శాతాన్ని కమర్షియల్ బ్యాంకులు, హడ్కో నుండి అప్పు తీసుకునేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 12 ఏళ్ల కాలపరిమితితో దీన్ని తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. రాజధాని నిర్మాణంలో ప్రభుత్వం నుండి వచ్చే గ్రాంటు రూ.980 కోట్లు, ఇతర మినహాయింపులు పోను సుమారు రూ.4329 కోట్లు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. అంటే త్రైమాసికానికి రూ.రూ.145.70 కోట్లు చెల్లించాలి. ఈ మొత్తాన్ని ఆయా భవనాలు వాడుకునే సంస్థల నుండి వసూలు చేసుకునే విధంగా సిఆర్‌డిఏకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. బిఓటి పద్ధతిలో నిర్మించే ఈ భవనాలకు సంబంధించి ప్రభుత్వం, సిఆర్‌డిఏ మధ్య ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది. అప్పు తీరిపోయిన వెంటనే ఆయా కార్యాలయాలను ప్రభుత్వానికి బదిలీ చేయాల్సి ఉంటుంది.

పసుపు- కుంకుమకు డబ్బుల్లేవు

- మహిళలను వెనక్కు పంపిస్తున్న బ్యాంకర్లు
- పాత బకాయిలకు జమ చేసుకుంటున్న వైనం
- పొదుపు మహిళల ఆగ్రహం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

బ్యాంకుల్లో మళ్లీ నగదు కష్టాలు మొదలయ్యాయి. టిడిపి ప్రభుత్వం ఆర్భాటంగా చేపట్టిన పసుపు కుంకుమ పథకానికి నగదు నిల్వలు లేవని బ్యాంకులకు వచ్చిన మహిళలను వెనక్కి పంపుతున్నారు.నగదు నిల్వల కొరతతో చెక్కులను పాత బకాయిలకు జమ చేసుకుంటామని బ్యాంకు మేనేజర్లు చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆడపడుచులకు నేరుగా నగదు ఇస్తున్నామని చెప్పి చెక్కులు ఇవ్వడంతో తమ అవసరాలకు అనుగుణంగా వాటిని మార్చుకునేందుకు వెళ్లగా బ్యాంకర్లు చెబుతున్న సాకులతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిబ్రవరిలో రూ.2,500, మార్చిలో రూ.3,500, ఏప్రిల్‌లో రూ.4వేలుతో చెల్లుబాట య్యేలా మొత్తం మూడు చెక్కులను ఈ నెల 2, 3, 4 తేదీల్లో ప్రభుత్వం ఆర్భాటంగా పంపిణీ చేసింది. కర్నూలు జిల్లాకు సంబంధించి 75,737 సంఘాల్లోని 6.59 లక్షల మంది పొదుపు మహిళలకు చెక్కులను పంపిణీ చేశారు. మొత్తంగా దాదాపు రూ.700 కోట్ల చెక్కులు మహిళల చేతుల్లోకి వచ్చాయి. ఇందులో ఒక్కో మహిళకు రూ.2,500 చొప్పున దాదాపు రూ.170 కోట్లను బ్యాంకులు మహిళలకు సర్దుబాటు చేయాల్సిన పరిస్థితి జిల్లాలో నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం గతనెల 27న పొదుపు మహిళలకు సంబంధించిన చెక్కులను క్లియరెన్సు చేసేలా నగదు అందుబాటులో వుంచాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ముఖ్యమంత్రి ఆదేశించినా బ్యాంకులు చెక్కులను క్లియరెన్సు చేయలేక పోతున్నాయి.



బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

ప్రధానంగా గ్రామీణ ప్రాంత బ్యాంకు మేనేజర్లు చెక్కులు తీసుకెళ్లిన మహిళలను ఉద్దేశించి మీ అప్పుకు జమ చేసుకుంటామని చెబుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో 25,618 గ్రూపులుంటే అందులో 16,800 గ్రూపులకు మాత్రమే చెక్కులు ఇచ్చారు. సొంత ఇళ్లు లేని మహిళలు అద్దె ఇళ్లు మారే పరిస్థితి పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంది. 60 ఏళ్లు దాటిన మహిళలు పొదుపు గ్రూపుల్లో ఉండరాదనే నిబంధనతో వారిని గ్రూపుల్లో నుంచి తొలగించి కొత్త వారిని చేర్చుకున్నారు. ప్రభుత్వం ఆధార్ సీడింగ్ కాలేదని పాతవాళ్లకివ్వ కుండా కొత్తవాళ్లకివ్వకుండా గ్రూపుల్లో కొంత మందికే ఇస్తున్నారు. పసుపు కుంకుమ పథకానికి నోచుకోని మహిళలు గ్రూపుల్లోని మిగితా సభ్యులతో ఘర్షణ పడుతున్నారు. వెల్దుర్తి మండలంలోని మాధవస్వామి అనే గ్రూపునకు రూ.25 వేలు చెక్కును ఇచ్చారు. ఎస్‌బిఐలో జమచేయగా డబ్బు లేదని, తర్వాత ఇస్తామంటూ వెనక్కి పంపేశారు. ఇలా గ్రామీణ ప్రాంత బ్యాంకుల్లో డబ్బు లేదని వెనక్కి పంపడంతో మహిళలు ఆందోళన చెందుతున్నారు.

వారం తరువాత రమ్మంటున్నారు

పసుపు కుంకుమ చెక్కులు తీసుకెళ్తే డబ్బులు లేవని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు ఇవ్వడానికి సాధ్యం కాదని, వారం తరువాత రమ్మంటున్నారు.

– రేష్మ గ్రూప్ , వెల్దుర్తి

డబ్బులేవంటున్నారు

పసుపు కుంకుమకు సంబంధించిన చెక్కును డ్రా చేసుకునేందుకు బ్యాంక్‌కు వెళ్లాం. బ్యాంకు మేనేజర్ మాత్రం నగదు లేదని చెప్పడంతో వెనుదిరిగి వచ్చాం.

– నాగమ్మ, పొదుపు మహిళ

ట్రాన్స్‌కో అధికారి ఆస్తి రూ. 1.5 కోట్లు

ప్రభాకర్ రెడ్డి నివాసంలో ఏసిబి సోదాలు

ప్రజాశక్తి-నెల్లూరు క్రైం/మండపేట (తూర్పుగోదావరి)

రెండు కిలోల వెండి, ఐదు ఇళ్ల స్థలాలు, 26 ఎకరాల పొలం, ఒక కారు, రెండు దిచక్ర వాహనాలు.. సోదా చేసే కొద్ది బయటపడుతున్న అవినీతి అక్రమ ఆస్తులు. మార్కెట్ ధర ప్రకారం రూ.కోటి 50 లక్షలు ఉంటుందని అంచనా. నెల్లూరు విద్యుత్ శాఖలో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న నెమళ్లపూడి ప్రభాకర్ రెడ్డి నివాసంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న సమాచా రంతో ఏసిబి డిఎస్‌పి దేవానంద్ శాంత్ బృందంతో ఏకకాలంలో నాలుగు ప్రాంతాల్లో దాడులు చేశారు. దేవానంద్ సమాచారం మేరకు.. నెమళ్లపూడి ప్రభాకర్ రెడ్డి నివాసం, అతని కుటుంబ సభ్యులు, కార్యాలయాల్లో సోదాలు చేపట్టారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా తూర్పుగోదావరి జిల్లా మండపేట పరిసర ప్రాంతాల్లోనూ ఐటి దాడులు జరిగాయి.

వాకపల్లి కేసు విచారణ ప్రారంభం

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్, విశాఖ

విశాఖ జిల్లా కోర్టులో వాకపల్లి విచారణ ప్రారంభమైంది. 2007 ఆగస్టు 20న పాడేరులోని వాకపల్లి గ్రామానికి నక్సలైట్స్ కూంబింగ్ సందర్భంగా గ్రేహౌండ్స్ దళాలు వెళ్లాయి. ఆ రోజు ఏడుగురు ఆదివాసి మహిళలపై అత్యాచారం చేశారనే ఆరోపణపై మంగళవారం విచారణ జరిగింది. షెడ్యూల్ కులాలు, తెగలు, అంటరానితనం నిషేధిత చట్టం కేసుల విచారణ ప్రత్యేక జిల్లా న్యాయస్థానం ఇద్దరు బాధిత మహిళల సాక్ష్యాన్ని రికార్డు చేశారని, తదుపరి నిందితులతో పోలీసుల తరపున డిఫెన్సు అడ్వకేట్ కూడా సాక్షులను క్రాస్ ఎగ్జామినేషన్ చేశారని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుంకర రాజేంద్రప్రసాద్ తెలిపారు. కేసు విచారణ యావత్తు ఇన్‌కెమెరా ప్రొసీడింగ్స్ ద్వారా జరిగింది. నిందితులు పదకొండుమంది కోర్టుకు హాజరయ్యారు. ఎన్నో అడ్డంకులను అధిగమించి బాధిత మహిళల పోరాటంతో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎట్టకేలకు విచారణ ప్రారంభమైంది. ఈ విచారణ రోజు వారి పద్ధతిన ఫిబ్రవరి 12 వరకు జరగనుంది.

జనసేన సలహాదారుగా విష్ణురాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనసేన పార్టీ సలహా కౌన్సిల్ ఛైర్మన్‌గా విష్ణురాజును నియమించారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ మంగళవారం ప్రకటన విడుదల చేశారు. బి.వి.రాజు ఫౌండేషన్ నిర్వాహకులుగా, విద్యావేత్తగా ఉన్న విష్ణురాజు చేరిక పార్టీకి బలోపేతాన్ని ఇస్తుందని తెలిపారు. జనసేన పార్టీ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ రీజనల్ కార్యదర్శిగా బొమ్మదేవర శ్రీధర్‌ను, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కనకరాజు సూరిని నియమించారు.

ఎస్‌పి బాలు తల్లి అంత్యక్రియలు

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రముఖ సినీగాయకులు ఎస్‌పి బాలసుబ్రమణ్యం తల్లి శకుంతలమ్మ అంత్యక్రియలు మంగళవారం స్థానిక బోడిగాడితోట ప్రాంతంలో నిర్వహించారు. సోమవారం ఉదయం నగరంలోని తిప్పరాజు వారి వీధిలోని వారి స్వగృహంలో కన్నుమూసిన విషయం తెలిసిందే. లండన్ పర్యటనలో ఉన్న ఎస్‌పి బాలు మంగళవారం ఉదయం నగరానికి చేరుకున్నారు. శకుంతలమ్మ అంత్యక్రియల్లో పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

వైసిపిలోకి మాజీ మంత్రి ఖలీల్‌బాషా

లోటస్‌పాండ్‌లో వైఎస్ జగన్‌తో భేటీ

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

టిడిపికి చెందిన మైనార్టీ నేత, మాజీ మంత్రి ఎస్.ఎ.ఖలీల్‌బాషా వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని లోటస్‌పాం డ్‌లో ఎమ్మెల్యే అంజాద్‌బాషా, వైసిపి రాష్ట్ర డాక్టర్స్ అసోసియేషన్ నాయకుడు శివభరత్‌రెడ్డి ఆధ్వర్యంలో తన ముగ్గురు కుమారులతో కలిసి వైసిపి అధినేత వైఎస్ జగన్ సమక్షంలో పార్టీ కండువాను కప్పుకున్నారు. ఈ నెల ఏడవ తేదీన కడపలో వైసిపి విజయశంఖారావం సభ నిర్వహిం చనున్న నేపథ్యంలో మైనార్టీ నేత చేరిక మరిన్ని చేరికలకు బీజం వేసే అవకాశం ఉంటుందనే ఊహాగానాలు సాగుతున్నాయి. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతలను మాజీ మంత్రి అహ్మదుల్లా కుమారుడు అష్రఫ్‌కు అప్పగించడంతో తీవ్ర నిరుత్సాహానికి గురైనట్లు సమాచారం.

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిస్తాం : ఆర్‌పి ఠాకూర్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలను రాష్ట్రంలో ప్రశాంతంగా నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ డిజిపి ఆర్‌పి ఠాకూర్ చెప్పారు. ఎన్నికల నిర్వహణపై ఆరు రాష్ట్రాల డిజిపిల సదస్సుల్లో పాల్గొనేందుకు మంగళవారం ఆయన తిరుపతికి వచ్చారు. స్థానిక మానస సరోవర్ హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో నాటుసారా, ఆయుధాలు, డబ్బు అక్రమ రవాణాను అరికట్టేందుకు అనుమానిత ప్రాంతాల్లో ప్రత్యేకంగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తామన్నారు.సమస్యాత్మక ప్రాంతాల్లో మందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో కర్నాటక డిజిపి నీలమునిరాజు, తమిళనాడు డిజిపి టికె.రాజేంద్రన్, తెలంగాణ హోమ్ సెక్రటరీ రాజీవ్‌త్రివేది, ఆంధ్రప్రదేశ్ హోమ్ సెక్రటరీ ఎఆర్.అనురాధ, ఒరిస్సా అండ్ చత్తీస్‌గడ్ జాయింట్‌డైరెక్టర్, అనంతపురం డిఐజి క్రాంతిరాణా టాటా తదితరులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా సంగీత సమ్మేళనం

ముగిసిన మహారాజ సంగీత, నృత్య కళాశాల శత వసంతోత్సవాలు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

మూడు రోజుల పాటు జరిగిన విజయనగరం మహారాజ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల శత వసంత ఉత్సవాలు అత్యంత ఉత్సాహ భరితంగా ముగిశాయి. చివరిరోజైన మంగళవారం గాన కోకిల పి.సుశీల గేయాలాపనతో ఆహూతులను మెమైరపిం చారు. కళాశాల పూర్వ, ప్రస్తుత అధ్యక్షులు సిహెచ్. బాలసర్వసతి, బి.అనురాధ పరశురాం సారథ్యంలో స్థానిక విద్యార్థులు, అధ్యాప కులు కలిసి సుమారు అరగంటపాటు వీణ కచేరీతో అలరించారు. అనంతరం పలువురికి నగదు పురస్కారాలను అందజేశారు. వయోలిన్ విద్వా ంసులు, కళాశాల రెండో అధ్యాపకులు ద్వారం వెంకటస్వామి నాయుడు కుమార్తె వయోలిన్ విద్వాంసులు ద్వారం మంగతాయ రును ఘనంగా సన్మానించడంతో పాటు రూ.మూడు లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాల పేరు ప్రఖ్యాతులు చిరకాలం నిలిచిపోవాలన్నారు.

పి.సుశీలకు విజయనగరం మహారాజ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల శత వసంత ఉత్సవాల పురస్కారాన్ని రాష్ట్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శి విజయభాస్కర్, జెడ్‌పి చైర్‌పర్సన్ శోభా స్వాతీరాణి, జిల్లా కలెక్టర్ హరిజవహర్‌లాల్ అందజేశారు.కళాశాల ప్రాంగణం లో ఏర్పాటు చేసిన ప్రముఖ గాయకులు, కళాశాల పూర్వ విద్యార్థి, కీర్తిశేషులు ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68